# తరిగొండ వెంగమాంబ చరిత్రము

## దానశాసనాల సంవీక్షణం



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# తరిగొండ వెంగమాంబ చరిత్రము - దానశాసనాల సంవీక్షణం


పరిష్కరణ

**శ్రీ ఎస్.కృష్ణారెడ్డి (గోపీకృష్ణ)**

విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, తి.తి.దే.

సంపాదకులు

**డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ**

సంచాలకులు

అన్నమాచార్య ప్రాజక్టు

తి.తి.దేవస్థానములు, తిరుపతి



**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి.**

**2023**

# TARIGONDA VENGAMAMBA CHARITRAMU - DANASASANALA SAMVEEKSHANAM

*Parishkartha*
**S. Krishna Reddy (Gopikrishna)**
Rtd. Head Master, TTD.

T.T.D.Religious Publications Series No.1432

@ All Rights Reserved

First Print : 2023

Copies : 250

Published by :
**Sri A.V. Dharma Reddy, I.D.E.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 501.

***Cover Design and***
***D.T.P. Type Setting***
Office of the Annamacharya Project,
TTD, Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 501.

# నివేదన

ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.
శ్రీకార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తశిరోమణులలో కవయిత్రి తరిగొండ వెంగమాంబ స్థానం విశిష్టమైనది. ఈ మాతృమూర్తిని 'తెలుగు మీరా' అని వాగ్గేయకారులు కీర్తిస్తుంటారు. ఈ భక్తురాలు మూడువందల సంవత్సరాల క్రితం అంతర్యామి పిలుపు మేరకు ఆపదమొక్కులవాడిని చేరింది. స్వామిసేవలో, భక్తజనసేవలో, సాహిత్యసేవలో తరించిన పుణ్యమూర్తి.

ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలోని వాయల్పాడు దగ్గర తరిగొండ గ్రామంలో స్వామివారి అనుగ్రహంతో జన్మించింది. బాల్యదశ నుండి భక్తురాలై సాంసారిక బంధాలకు దూరమై జీవితాంతం యోగినిగా గడిపిన పరమసాధ్వీమణి.

తిరుమలలో వెంగమాంబ భక్తిని గుర్తించిన నాటి ఉన్నతాధికారులు, పాలకులు, అర్చకులు శ్రీవారి ఏకాంతసేవలో 'ముత్యాల హారతి' సమర్పించే అవకాశమిచ్చారు. ఆ ముత్యాలహారతి సమర్పణసేవను కొనసాగించి ఆర్కాట్‌నవాబ్, రాజ్యాధికారులు, ఆపై ఆంగ్లేయులు, తదనంతరం మహంతు పరిపాలకులు వెంగమాంబ పట్ల గౌరవమర్యాదలు ప్రపంచీకరించారు. ఈసేవ ఎలాంటి ఆటంకం లేక నేటికీ కొనసాగడం దేవస్థానం పరిపాలకుల సంప్రదాయరక్షణకు ఒక చక్కని ఉదాహరణ.

ఏకాకిగా తిరుమల చేరుకున్న వెంగమాంబను ఆదరించిన వారిలో ఆనాటి మహంతులు, అలాగే తాళ్లపాక కుటుంబీకులు ముఖ్యులు. తిరుమలలో వెంగమాంబ నివసించిన స్థలం ఉత్తరమాడవీధిలో తాళ్లపాక వారి ఇంటిలో ఒక భాగం. ఆ ఇంటికి కొద్ది దూరంలో తులసీవనం. ఆ వనంలో 'గుండుబావి'. ఆ బావికి కొద్దిదూరంలో పాపవినాశతీర్థం వెళ్ళే

కాలిబాటలో అమ్మోరుబావి. దానికి ఆనుకొనివున్న బాటగంగమ్మ కెదురుగా జామతోట. తులసీవనంలో నేటికీ వందనాలందుకొనే వెంగమాంబ సమాధి. ఇవన్నీ తలిస్తే చాలు మనస్సు పులకిస్తుంది.

తరిగొండ వెంగమాంబ శ్రీవారికి చేసిన సేవలకు గుర్తుగా తి.తి.దే. అన్నమాచార్యప్రాజక్టు, దాససాహిత్య ప్రాజక్టు, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజక్టుల కోవలో 2006వ సంవత్సరంలో తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టును మొదలు పెట్టింది. ఈ ప్రాజెక్టు వున్నప్పుడు వెంగమాంబ రచనలను క్రమంగా ముద్రిస్తూ కవిపండితుల్ని, గాయకుల్ని ఆకర్షించగలిగింది. అంతేగాక తిరుపతి పడమర ముత్యాలరెడ్డిపల్లె ముఖద్వారంలో ఆ తల్లి విగ్రహాన్ని నెలకొల్పింది. వీటితోబాటు వెంగమాంబ జన్మస్థలి తరిగొండలోని నారసింహ ఆలయ పాలనాధికారాన్ని చేబట్టి నిత్యోత్సవాదులతో భక్తులను ఉద్ధరిస్తున్నది. ఏటేటా తరిగొండ వెంగమాంబ జయంతి, వర్ధంతులను నిర్వహిస్తూ ఆ తల్లిపట్లగల కృతజ్ఞతలను ప్రకటిస్తున్నది. వెంగమాంబ కీర్తనలను ఇతర రచనలను రికార్డింగులు చేయిస్తూ తగినరీతిలో ప్రచారం చేస్తున్నది.

వెంగమాంబ కృతుల పరిష్కారం, ముద్రణ పూర్తి అయినా వెంగమాంబ కాలంనాటి దానశాసనాలు సాధికారికంగా ముద్రితం కాలేదు. ఈ శాసనాలను సేకరించి తి.తి.దే. వారికి ఈ రచన ద్వారా అందిస్తున్న విఖ్యాతులు శ్రీ సొరకాయల కృష్ణారెడ్డి గారు. మొట్టమొదట వెంగమాంబ ఆదరంతో అందుకొన్న మూల్యాలను గుర్తించి దానశాసనాలుగా అక్షరస్థం చేసినవారు శ్రీ కుప్పయ్యశర్మగారు.

అముద్రిత దానశాసనాల అంశం ఉన్నతాధికారుల దృష్టికి రాగా అవి ముద్రణార్హమని తి.తి.దే. భావించింది. తరిగొండ వెంగమాంబ చరిత్రతోబాటు శాసనాలను కూడా ముద్రిస్తే శాసనపరిశోధకులకు, తరిగొండ వెంగమాంబ భక్తులకు, ఆశ్రితజనావళికి ఆమోదప్రదమవుతుందని భావించింది. ఈ కార్యభారాన్ని చేపట్టమని సంచాలకులు, అన్నమాచార్య ప్రాజెక్టును ఆదేశించింది. తి.తి.దే. ఆశయాన్ని, సంకల్పాన్ని సఫలం చేసిన డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ, సంచాలకులు, అన్నమాచార్య ప్రాజెక్టు గారిని

అభినందిస్తున్నాను. ఇలాగే లభ్యమైన దానశాసనాలు 31. అయినా తరువాతి కాలంలో కీ॥శే॥ గుండేపల్లి కుప్పయ్యశర్మ 8 దానపత్రాలలో సామాన్య అంశాలున్నాయని భావించి వదలిపెట్టారు. అయినా వాటిని కూడా కలుపుకుని 31 శాసనాలను, ఆపై తరిగొండ వెంగమాంబ మరణానంతరం వెలువడ్డ దానశాసనాలను కూడా చేర్చి ఈ పుస్తకంలో జత చేయడం జరిగింది. ఈ శాసనాలన్నీ క్రీ.శ. 1785-1809 మధ్యకాలం నాటివి కావడం గుర్తించదగ్గ అంశం. ఈ శాసనాలలోని అంశాలు శాసనపరిష్కర్తలకు ఒక భాండాగారం. వీటినన్నిటిని దృష్టిలో పెట్టుకొని తి.తి.దే. దానశాసనాలను యథాతథంగా ముద్రించడానికి సమ్మతించింది. ఈ గురుతరమైన బాధ్యతలను శాసనాంశాల పరిశోధనలో దిట్టయిన శ్రీ సొరకాయల కృష్ణారెడ్డికి (గోపీకృష్ణకు) అప్పగించడం జరిగింది. వీటితోబాటు శ్రీ వేంకటేశ్వర భక్తవిజయంలో భాగంగా వ్రాయబడి ఒకప్పుడు ముద్రితమైన శ్రీ తరిగొండ వెంగమాంబ చరిత్రమును కూడా జతచేసి ప్రకటిస్తున్నాం. ఇందువల్ల కవయిత్రికి సంబంధించిన యథార్థాంశాలు చదువరులకు తెలియజేయడానికి చక్కని మార్గమయ్యింది. పైగా ఈ చరిత్రను వారి వంశీకుడైన గుండేపల్లి కుప్పయ్యశర్మ నోటు పుస్తకంలో వ్రాసి భద్రపరచడం వల్ల ప్రాముఖ్యత సంతరించుకొన్నది.

ఈ చిరుపుస్తకం పవిత్ర సేవాకైంకర్యం చేసేవారికి, భక్తజనసేవా దురంధరులకు, కరదీపిక అనడంలో సందేహం లేదు. ముఖ్యంగా మహిళలకు, భాగవతులకు ఉత్తేజదాయకం. అలాగే సారస్వతప్రియులకు ఆ తల్లి 18 గ్రంథాలు కాంతులీనుతున్న 18 రత్నాలు. ఈ దానశాసనాలు సమకాలంలో మాతృశ్రీ వెంగమాంబపై ఉన్న ఆదరాభిమానాలు తెలుసుకోవడానికి దారిదీపం.

సదా శ్రీవారిసేవలో

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# దానశాసనాలు - ఆదర్శ దీపాలు

డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ, ఎం.ఎ., పిహెచ్.డి.,
సంచాలకులు, అన్నమాచార్య ప్రాజెక్టు,
తి.తి.దేవస్థానములు, తిరుపతి.

శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తురాలు, కవయిత్రి, నిరతాన్నదాత్రి శ్రీ వెంగమాంబ జీవితమే ఒక విచిత్రం. ఆ తల్లి ఒక మామూలు గృహస్థుల యింటిలో జన్మించినా అందరిలాగే ఆమెకు వివాహతంతు జరిపించినా దైవనిర్ణయం మేరకు యోగినిగా మారిపోయింది. ఓనమాలు రావంటూనే వివిధ సాహిత్యప్రక్రియలలో అష్టాదశకృతులు రచించింది. వట్టి చేతులతో తిరుమలకు వచ్చి వనాలు పెంచింది. ఒక యోగినిగా జీవిస్తూ వడ్డికాసులవాడికి వొద్దికగా ఒక ముత్యాల కర్పూరహారతి సేవాకార్యక్రమం కొనసాగించింది.

వెంగమాంబ కవిత్వం చెబుతుంటే ఘంటికలతో 8 మంది వ్రాయసగాళ్ళు తాళపత్రాల మీద వ్రాసుకొనేవారట. వారంతా జమీందారులు, పాళేగార్లపంపున వచ్చినవారు. వ్రాసినవాళ్ళు వ్రాసినట్టే వాటిని పట్టుకుపోయారు. ఆమెకు ఒక్కటీ యివ్వలేదు. ఆ కారణం వల్ల ఆమె యింటిలో అవి పదిలం కాలేదు. అచ్చయిన ఆమె రచనలన్నీ అక్కడాయిక్కడా దొరికినవే. ఆమె ద్విపదభాగవతం ఇంకా పూర్తిగా దొరకవలసి వుంది. ఇప్పటివరకు దొరికిన మూడు స్కంధాలను తి.తి.దే ముద్రించింది. ప్రస్తుతం శ్రీ జి.కుప్పయ్య శర్మ గారి ఇంటిలో లభించిన అముద్రితమయిన దానపత్రాలు, యథాతథంగ ముద్రిస్తున్నాము. వీటితోబాటు వారి వంశీకులు వ్రాసిపెట్టుకొన్న ఆమె చరిత్ర కూడా వుంది. తరిగొండ వెంగమాంబ జీవనగానాన్ని గూర్చి పదిమందికి పైగా వ్రాసినారు. ఆంగ్లంలో కూడా కొందరు వ్రాసినారు. వాటన్నిటికంటే స్వకుటుంబీకులే వ్రాసిపెట్టుకొన్న చరిత్రే ముఖ్యమని దానిని ప్రచురిస్తున్నాము.

వెంగమాంబ 1730 సంవత్సరంలో జన్మించి 1817 ఈశ్వరనామ సంవత్సరం, శ్రావణశుద్ధ నవమినాడు విష్ణుసాయుజ్యం చెందినట్టు విజ్ఞులభిప్రాయం. ఆమె జీవించిన 87 సంవత్సరాలలో 1785 సం॥ నుంచి 1809 సం॥ వరకు అనగా దాదాపు 25 సంవత్సరాల కాలంలో ఆమె మఠానికి 31 దానాలు ఇవ్వబడ్డాయి. ఆ దానాలలో ముఖ్యమైన 23 దానపత్రాలకు స్వర్గీయ గుండేపల్లి కుప్పయ్యశర్మ గారు 1946 సంవత్సరములో నకళ్లు వ్రాసిపెట్టారు. వాటినే ప్రస్తుతం పుస్తకరూపంలో ప్రచురించడం జరిగింది. తక్కిన 8 దానపత్రాలలో డబ్బు, బియ్యం యిలాంటి చిల్లర దానాలు వుండడంతో కుప్పయ్యశర్మగారు వాటిని వదిలి పెట్టారు. కాని శ్రీసాధు సుబ్రహ్మణ్య శాస్త్రి గారు Tirupati Sri Venkatesvara అనే ఆంగ్ల గ్రంథంలో 347 పుట నుండి 354 పుటల వరకు వాటిని, వాటి సారాంశం కూడా వ్రాశారు. వాటిని కూడా యిందులో అచ్చువేయడం జరిగింది. అలాగే వెంగమాంబ సమాధిస్థితయయిన వందసంవత్సరాలకు మరి రెండు దానాలు వచ్చాయి. వాటిని కూడా యిందులో పొందుపరచడం జరిగింది.

శ్రీ ఎస్.కృష్ణారెడ్డిగారి వద్దనున్న ఈ దానశాసనాల విషయాన్ని తెలుసుకొని, ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చాను. వెంటనే అనుమతించి పుస్తకంగా ముద్రాపించడానికి ఆదేశించిన శ్రీ కార్యనిర్వహణాధికారి శ్రీ ఆళ్ళ వేంకట ధర్మారెడ్డి గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీమతి సదా భార్గవి గారికి నా కృతజ్ఞతలు.

శ్రీ గుండేపల్లి కుప్పయ్యశర్మ గారి వ్రాతప్రతిని, తాను తిరిగి వ్రాసుకొని ఈ పుస్తకంగా రూపొందించిన శ్రీవారిసేవకులు, శాసనాలపట్ల సమగ్ర అవగాహన ఉన్న శ్రీమాన్ సొరకాయల కృష్ణారెడ్డి (గోపీకృష్ణ) గార్కి నా ప్రత్యేక ధన్యవాదాలు.

– అకెళ్ళ విభీషణశర్మ

# స్వగతం

**శ్రీ ఎస్. కృష్ణారెడ్డి (గోపీకృష్ణ)**
**విశ్రాంత ప్రధానోపాధ్యాయులు**
**తి.తి.దేవస్థానములు, తిరుపతి.**

తిరుమల ఉత్తరమాడవీధిలో మిట్టమీద తరిగొండ వెంగమాంబ బృందావనం మధ్యలో ఆమె సమాధి మండపం వుంది. దానిచుట్టూ కొంత ఖాళీజాగా వుంటే అందులో శ్రీ వేంకటేశ్వర బి.నాగిరెడ్డి ఇంగ్లీషు మీడియం పాఠశాల నిర్మించారు. డెప్యూటేషన్ మీద ఆ పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా కొంతకాలం వుండే భాగ్యం నాకు కలిగింది.

అప్పుడే తరిగొండ వెంగమాంబ వంశీకులతో పరిచయం కలిగింది. అప్పటి వారసుడు గుండేపల్లి వెంకటలక్ష్మీ నరసింహామూర్తి (జి.వి.ఎల్.ఎన్.మూర్తి). మంచి స్నేహితుడు. అప్పుడే తరిగొండ వెంగమాంబ నివసించిన యింటిని, ఆమె పూజామందిరాన్ని వగైరా నిశితంగా పరిశీలించాను. ఆమె రచనల తాళపత్రాలు యేవీ లభ్యం కాలేదు. ద్విపద భాగవతంలోని ఒక తాళపత్రం దొరికింది. దానివల్ల ఏమీ లాభం లేదు. కానీ మూర్తి ఒక తాళపత్రపొత్తం తెచ్చి చూపించాడు. అవి ఆమె మఠానికి చెందిన దానపత్రాలు. వాటిని భద్రపరచమని చెప్పాను.

తరిగొండ వెంగమాంబ కృతులమీద పరిశోధన చేస్తూ కె.జె.కృష్ణమూర్తి గారు ఒకరోజు పాఠశాలకు వచ్చారు. ఆమె రచన లేవీ లభ్యంకానందున వున్న దానపత్ర తాళప్రతులు ఆయనకిచ్చాము. ఆయన తీసుకొనిపోయాడు. కానీ పెద్దగా వుపయోగించుకోలేదు. లేదంటే మా గురువర్యులు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి వాటిని చూపడంతో వారు అందులోని విషయాలను ఆంగ్లంలో క్లుప్తీకరించి తన ఆంగ్ల గ్రంథం 'తిరుపతి శ్రీ వేంకటేశ్వర' లో ప్రచురించారు. మరలా ఒకరోజు వాటిని అడిగాను. మూర్తి లేవన్నాడు.

నేను కోపంతో వూగిపోతుంటే మూర్తిగారు యింట్లోవున్న అన్ని వ్రాతప్రతులు తెచ్చియిచ్చారు. అందులో ఆయన తండ్రి గుండేపల్లి కుప్పయ్య శర్మ వ్రాసిపెట్టిన రెండు నోటు పుస్తకాలలో పోగొట్టుకొన్న దానపత్రాల నకళ్లు, వెంగమాంబ జీవితచరిత్ర వున్నాయి. మనస్సు శాంతించింది. ఆ నకళ్లు 1946లో వ్రాసిపెట్టినారు. వాటితోబాటు 1941లో విడుదల చేసిన కరపత్రం ఒకటి వుంది. ఆ కరపత్రంలో వెంగమాంబ మఠానికి ఎందరో గ్రామాలు, భూములు దానం చేసినా వాటి ఆదాయం మఠానికి చేరడం లేదని నృసింహజయంతికి అన్నదానం చేయడం సారెసారెకు గగనమైపోతోందని వాపోయారు. అందరి సహకారం అపేక్షించారు. 1941 నాటికే ఆ పరిస్థితి వచ్చిందంటే యిప్పుడిక వూహించలేము. ఆ దానపత్రాల నకళ్లు 50 సంవత్సరాలుగా అలాగే నా దగ్గర వున్నాయి. వాటిని వారు అడుగలేదు. నేను యివ్వలేదు. తి.తి.దే. వారు 2006 సంవత్సరములో తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజక్టు ఏర్పాటు చేసినారు. నేను నా దగ్గరవున్న వెంగమాంబ వ్రాతప్రతులు వగైరా 2007 సంవత్సరంలో ఆ ప్రాజక్టుకు అప్పగించాను. వారు వెంగమాంబ గారి కృతులు ముద్రితాలు, అముద్రితాలు అన్నీ ప్రచురించారు. ఆచార్య కె.జె.కృష్ణమూర్తిగారి సిద్ధాంత గ్రంథము – 'మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కృతుల పరిశీలనము' కూడ ప్రచురించారు. ఈ దానప్రతుల జోలికిపోలేదు. అవీ ప్రాజక్టులో వున్నాయో లేదో తెలియదు. వారికి అప్పగించేటప్పుడు నేను కాపీ చేసి పెట్టుకొన్న నకలు ఆధారంగా దీనిని యథాతథంగా అచ్చువేయడం జరుగుతోంది.

అచ్చువేయడానికి అనువుగా కాని, పాఠకుల సౌలభ్యానికి గాని యిందులో ఏ మార్పులూ చేయలేదు. దాదాపు రెండువందల పాతిక సంవత్సరాల క్రితం వారు ఎలా వ్రాసిపెట్టారో అలానే అచ్చువేస్తున్నాము. చేర్పులు కూర్పులు మార్పులు ఏమీ చేయకుండా అక్షరదోషాలు యథాశక్తి లేకుండా సరిచూశాను.

తి.తి.దే. అర్ధశతాబ్దం క్రిందట వెంగమాంబ బృందావనంలో కాన్వెంట్ స్కూల్‌కు అనుమతినిచ్చింది. తన ఇంటిలో పూజాగృహంలో యథేచ్ఛగా సంచరించడానికి అనుమతినిచ్చింది. తన ద్విపదభాగవతం ప్రథమ, ద్వితీయ స్కంధాలు పరిష్కరించే భాగ్యం కల్పించింది. చివరికి వృద్ధాప్యంలో తన దానపత్రాలు, చరిత్రను ఆవిష్కరించే అవకాశం కల్పించింది. అంతటి దయామయి మా అమ్మ తరిగొండ వెంగమాంబ పాదపద్మాలకు యీ చిన్ని పొత్తం సమర్పణంలో పూర్తి బాధ్యతలు ఇచ్చిన శ్రీవారికి కృతజ్ఞతాంజలి సాదరంగా సమర్పిస్తున్నాను.

ఇదొక మహద్భాగ్యం. పూర్వజన్మసుకృతం. దీనికి అవకాశం కల్పించిన శ్రీ కార్యనిర్వహణాధికారి ఏ.వి. ధర్మారెడ్డి గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారి (విద్య & వైద్యం) సదాభార్గవి గారికి, ముఖ్యంగా వెనుబలంగా నిలచిన అన్నమాచార్య ప్రాజక్టు సంచాలకులైన డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ గారికి సహాయం చేసిన సర్వులకు నా కృతజ్ఞతాభివందనాలు.

సదా శ్రీవారి సేవలో...

గోపీకృష్ణ

(సొరకాయల కృష్ణారెడ్డి)

# విషయ సూచిక


| విషయము | | పుట |
|---|---|---|
| 1. నివేదన | : శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి | iii |
| 2. దానశాసనాలు–ఆదర్శ దారిదీపాలు | : డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ | vi |
| 3. స్వగతం | : శ్రీ సొరకాయల కృష్ణారెడ్డి | viii |
| 4. శ్రీ తరిగొండ వెంగమాంబ చరిత్ర | | 1 |
| 5. దానశాసనాలు | | |
| ఎ. శ్రీ తరిగొండ వెంగమాంబ గారికి వ్రాయించి యిచ్చిన దానపత్రముల నకళ్లు | : శ్రీ కుప్పయ్యశర్మ | 57 |
| బి. వెంగమాంబ సాయుజ్యం పొందిన వంద సంవత్సరాలకు వచ్చిన దానాలు | | 90 |
| సి. శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారి Tirupati Sri Venkatesvara గ్రంథములోని తరిగొండ వెంగమాంబ దానవిశేషాలు | | 94 |

# శ్రీ వేంకటేశ్వర భక్త విజయము

## శ్రీ తరిగొండ వెంగమాంబ చరిత్రము

శ్లో॥ శ్రీకళ్యాణ గుణోల్లాసం చిద్విలాసం మహోరసమ్ ।
శేషాద్రిమస్తకే వాసమ్ - శ్రీనివాసం భజామ్యహమ్ ॥

* * *

శ్రీ తిరుపతికి పడమరలో నుత్తర భాగమున సుమారు ముప్పది మైళ్ళదూరమున తరిగొండయను గ్రామమొక్కటి గలదు. ఆ గ్రామంలోని యగ్రహారములోని బ్రాహ్మణులు తర్క, వ్యాకరణ, ధర్మ శాస్త్రముల యందు మిక్కిలి పాండిత్యము గలవారుగను అష్టాదశ పురాణములు, చతుర్వేదోప నిషత్తులు చక్కగా పరిశీలించి యభ్యసించిన వారుగను 'ప్రేరితోపవాదన ప్రకటాటో' పరిపాలన సమర్థులునై యుండిరి. ఒక సూర్యుడే అనేక సూర్యులై వాపీ కూపతటాకములందు ప్రతిబింబించి అనేక రూపములుగా గోచరమగునట్లు పరమాత్ముడొక్కడే సకలభూతములందనేక నామముల బొందిన వాడై యావరించినట్లు శ్రీ లక్ష్మీనృసింహావతారమై, ఆ తరిగొండ యందు మణియై వేంచేసి యుండిరి. సుమారు నూట ముప్పది సంవత్సరములకు పూర్వము గ్రామములో నున్న బ్రాహ్మణశ్రేష్ఠులలో వసిష్ఠ గోత్రోద్భవుండును, మహా పుణ్యచారిత్రుండును, సకలధర్మపరాయణుండును, విష్ణు పూజా పరతంత్రుడునగు కృష్ణయ్యయను నామధేయముగల భూసురుడొక డుండెను. అతడు పూర్వజన్మ సుకృతము చేత సకల ధనధాన్యకనక వస్తు గృహవాహనాది సంపదచే అలరారుతుండెను.

### శ్రీ వెంగమాంబ జననము

అతనికి సకల సంపదలు కలిగియున్నను ఆడబిడ్డలేదను కొఱత గలిగి యందు నిమిత్తమై యతడు శ్రీవేంకటేశ్వరులను తనకోర్కె చెల్లింపుమని

యనుదినమును ప్రార్థించుచుండెను. సకల పురుషార్థప్రదపారిజాతుడైన శ్రీనివాసుని నమ్మిచెడిన వారు లేరను లోకోక్తిననుసరించి ఆతని భక్తి కొంత కాలమునకు ఫలితమును బొందినదై భగవంతుని కటాక్షముచే నొక బాల జన్మించెను. శ్రీమహాలక్ష్మీదేవివలె మహాసౌందర్యవతియై పూర్ణచంద్రబింబము వలె రూపరేఖావిలాసవతియై ప్రకాశించుచుండెను. ఆ కాంతామణిని జూచి యా బ్రాహ్మణుండమితానందపరవశుడై వరప్రదుడైన శ్రీ వేంకటేశకల్యాణ గుణోల్లాసుని కృతజ్ఞతతో నిర్మలమైన భక్తితో నారాధించుచు నా బిడ్డకు వెంగమాంబయని నామకరణము జేసి యత్యంత గారాబముతో పెంచుచుండెను. ఆ యబల దినదిన ప్రవర్ధమానయై యైదు సంవత్సరములు నిండిన తోడనే సర్వవిద్యాసంపన్నుల యందు రంజిల్లు రాణియగు వాణీదేవియే భూమియందు పరావతారము నొందినట్లు సర్వవిద్యా సంపన్నురాలై యమృతము లొలుకు పలుకులచే శ్రీవేంకటరమణుని దివ్యనామమును స్తోత్రముజేయుచు శ్రీశునియందత్యంత భక్తిశ్రద్ధలు గలదైయుండెను. ఆమె భక్తిభరితమైన స్తోత్రములు హరిభక్తశిరోమణులెల్లరకు పరమానందకరములై యుండెను. ఆమె యీ బ్రహ్మాండమే కోవెలయనియు, సర్వాంతర్యామియైన శ్రీ వేంకటేశపరబ్రహ్మమే దేవుడనియు మనసున భావించినదై సర్వాంతర్యామియైన యతనినే భజింపుచు పరవశముతో నిరభిమానముగా నృత్యము జేయుచుండెను. అదిచూచి తండ్రి యామె భక్తిశ్రద్ధలకు మెచ్చి హరిభక్తి గల యీ తనయదే భాగ్యమని మిక్కిలి సంతోషించెను. కాని కొన్నాళ్లకా యభిప్రాయమును వదలుకొని యామెచర్యలు ప్రపంచరీతికి విరోధమని తలచి క్రోధస్వాంతుడై యామె భక్తిమార్గము నాక్షేపింప నారంభించెను.

## వెంగమాంబ భక్తిమార్గమునకు తండ్రి యాక్షేపించుట

అయ్యో! ఇదేమి? ఆశ్చర్యముగా నున్నది? లేక లేక జనించిన యీ బిడ్డ తుదకిట్లున్నదేమి? మానాభిమానములు వదలి బిడ్డ యిట్లు భగవంతుని

ధ్యానించుట తగునా? ఇప్పుడే యిట్లున్న నిక ముందెట్లుండునో? అని శంకించి యిక నా బిడ్డకు విద్యవలదనియు, భజనలు, హరిధ్యానమెంత మాత్రము తగవనియు హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని యందు వలె యభిప్రాయముతో నామె కంత ఖండితమైన యుత్తరువులనిచ్చి దండించ నారంభించెను. ఒక్క నిమిషమైన హరిధ్యానమునకు అవకాశమివ్వక యింటి యందలి పాత్రలు దోముట, యిల్లు చిమ్ముట, బియ్యము దంచుట, పిండి వంటకములకు వలసిన పనులను జేయుట మొదలగు గృహకృత్యములందు నియమించెను. వెంగమాంబ మిక్కిలి చిన్నబిడ్డగావున నామె శక్తికీపనులు మిక్కిలి కఠినమై విశేషముగా బాధింపజొచ్చెను. మిక్కిలి గారాబముతో పెంచుచుండిన తండ్రియే హరిభక్తి నిషేధించిన కారణముచే కొంచెమైన దయలేనివాడై క్రూరస్వభావముతో నామెను పలువిధములైన శ్రమల బెట్టుచుండెను. అయిననూ మామిడిచెట్టు మామిడి ఫలమునే యిచ్చునట్లును, మకరంద మాధుర్యమును గ్రోలు తుమ్మెద వేరేమియు గోరక మకరందమునే గోరునట్లును ఆ బాల శ్రీ వేంకటేశ్వరుల ధ్యానామృతపానచిత్తయై దేహమును మరచి యపార సత్కృపాసాగరుండైన శ్రీవేంకటేశ పరమాత్మక భజనలు చేయుచు హరిః ఓం నమో నారాయణాయ యని స్మరింపుచు తా జేయుచుండిన పనులను నిద్రావస్థ నొందినవాడు తత్పూర్వము తన చేతనున్న వస్తువును తాదెలియక విడిచినట్లు ఆ పరమభక్తశిరోమణి పారవశ్యముచే తనకు దెలియక విడచినదై మహత్ప్రకాశ - వైభవ సుందరాకారుండైన పరంధాముని దివ్యచరణారవిందములందు దీపమునందుష్ణము నిండినట్లు ధ్యానముచే గూడినదై మనోబుద్ధుల కదలక మెదలక నిల్పినదై యుండగా నంతరింద్రియముల చంచలములైనవై సర్వ జగద్బీజుండైన ఓంకార పరబ్రహ్మముయొక్క సన్నిధిలో సింహం చెంగటనున్న భీతాహతంబైన యల్పజంతువువలె కదలక యుండెను.

శ్లో॥ సలిలే సైంధవం యద్వత్ - సామ్యం భజతి యోగతః ।
తథాత్మసమనసోరైక్యం - సమాధిరభిధీయతే ॥

నీటిలో ఉప్పును కలిపినపుడు ఆ రెండును ఒకటియగునట్లు ఆత్మ మరియు మనస్సు ఒక్కటైనపుడు ఆ కలయికనే "సమాధి" అంటారు. అట్టి దివ్యపరబ్రహ్మనిష్ఠాసమాధిచే నామెదేహము అంతర బాహ్య కృత్యములు మాని భూమిపై వ్రాలియుండెను. దానిని జూచి తండ్రియగు కృష్ణయ్య మిక్కిలి వ్యాకులపడి "ఆహా! నేనేమి చేయుదును? ఇది యేమి విపరీతము? పెండ్లి చేసికొని పురుషునకు సేవను జేయుచు గృహకృత్యముల నిర్వహింపవలసిన స్త్రీల కిట్టి హరిభక్తి తగునా? కాబట్టి యెలాగైనను హరిభక్తి మరపించవలయునని యనేకయుక్తులు పన్ని యామెయందు దయలేక శ్రీహరియందు భీతిలేక కఠినమైన శిక్షలజేయుచు, తిట్టుచు, కొట్టుచు నాహారము నిప్పించక తనవలె ప్రపంచ విషయములందు వర్తించని హేతువుచే క్రోధస్వాంతుడై యాభక్తశిరోమణిని యనేక హింసలబెట్టి కట్టుదిట్టములు చేయుచుండెను.

కం॥ తరిగొండ వనిత వేంకట
పరమాత్ముని యందు భక్తి భరితాత్మయుగాన్
దురితంబదియని జనకుడు
పరివిధముల దయయు లేక బాధలు బెట్టెన్.

ఎన్ని మారులు కరిగించినను బంగారురంగు తరగని విధమునను, మల్లెలను మాలగట్టినను, చెండ్లు గట్టినను, యెచ్చట యుంచినను పరిమళము తరుగని విధముగా నెన్ని బాధల బెట్టినను, యా బాలిక స్వభావమైన హరిభక్తిని విడువజాలక అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని పల్లవచరణారవిందమందు నీటిలోని మత్స్యమా నీటిని విడచి ప్రాణభీతిచే బయటికి రాజాలక యానీటియందే యోలలాడునట్లు మానసిక స్థిరత్వము గలిగియుండుట జూచి కృష్ణయ్య విభ్రమము నొందినవాడై తన మనసున కేమియు దోచక

చింతించుచు హరి హరి నాకు కూతునిమ్మని ప్రార్థించితిని గాని నీ భక్తురాలిని నా యింట జన్మింపజేయుమని బ్రతిమాలితినా. ఈ బిడ్డవల్ల నాకెంత శ్రమలున్నవో నేనెరుగనని దుఃఖించుచు పిమ్మట వివాహము జేసిన యా బాలిక స్వభావము మారిపోవునని తలచి పెండ్లి ప్రయత్నముల జేయ నిశ్చయించెను.

## వెంగమాంబకు వివాహమగుట

అప్పుడాకన్య యొక్క యద్భుతమైన రూపలావణ్యములను జూచి యనేకు లా కన్యను వివాహమాడ సహమహమికతో నుండిరి. మఱి కొందరు ఆమెకు రూపలావణ్యములను చక్కగా నమర్చెనుగాని మంచివ్రాత వ్రాయకపోయెనే యని చింతించిరి. కొందరు ప్రపంచవిషయములందు ఆశాపాశములు మాని నిరతము శ్రీహరి ధ్యానము చేయుచున్న యీ వనితను పెండ్లియాడిన కష్టము సంభవించుననియు, కొందఱు యిది యేదో దేవత యిట్లవతరించి యున్నదనియు, కొందఱీకన్య చూచుటకు బహుచక్కనిదై యున్నను సంసారమునకు దగినది కాదనియు నిట్లు పలురకముల జెప్పుకొనుచుండిరి. అయినను ఆమె తండ్రి వారందఱితో నా బిడ్డ గృహకృత్యములందు మిక్కిలి సామర్థ్యముగలదనియు హరిభక్తి యొకానొకప్పుడు సేయుటేగాని దాని యందలి చింతనామృతమును గ్రోలుట లేదనియు జెప్పి తన బిడ్డ చర్యలం బొగడుచు తుదకు ఆ వధూమణిని చిత్తూరు ప్రాంతమందున్న నారగుంట పాళ్యములో విద్యావినయయుక్తుడైన యొక భూసురునకిచ్చి వివాహము జేయ నిశ్చయించి సకలబంధు మిత్రవర్గములకు శుభలేఖలు నంపించి యఖండ వైభవముతో వివాహము జరిపించెను. ఆ బిడ్డ లావణ్యమునకు భ్రమించి యామెయందు అత్తమామ బంధుమిత్ర సకల జనులు నత్యంత ప్రీతిగలవారై వర్తించుచుండిరి. ఆ బాలిక యెండమావులవంటి ప్రపంచ విషయ భోగప్రేమాతిశయములయందు యించుకైననూ లక్ష్యము లేక మేఘములచే నావరింపబడు సూర్యునకు

ప్రకాశము లోపముగానట్లు పరమ దయామంగళ విగ్రహుండైన శ్రీ వేంకటేశ్వరులపై భక్తి యచంచలముగా గల దయ, సదా యేకరీతిగా మనోమారుత బుద్ధీంద్రియముల సుధాంబుధి సోమునియందు నిల్పినదై దేహము మరచి శ్రీమన్నారాయణ ధ్యానామృతములను గ్రోలుచుండెను. బంధుజనులామె భక్తి మార్గమును జూచి యచ్చెరువొందినవారై పూర్వము నారాయణ ధ్యానముచే వాసికెక్కిన ప్రహ్లాదుడీ యుగమునందు స్త్రీ రూపముతో కృష్ణయ్యకు పుత్రికారత్నమై జన్మించెనోయని యాలోచించినవారై యామె తండ్రితో నా విషయముల విస్తరించి చెప్పనారంభించిరి. అప్పుడు లోకాభిమానముచే నిండిన కృష్ణయ్య చింతాక్రాంతుడై యిక నేనేమిచేయ జాలకున్నాను. వివాహము జరిగియును యీ బాలిక యీలాగుననే యున్నను, కులమునకు హానియు, ప్రపంచమున కపకీర్తియు నాకు బంధుజనులచే నిందయు గల్గుచున్నవేయని చింతించినవాడై యా బాలికను తన యింటికి తోడి తెచ్చి శక్తికొలది అనేక విధములైన శక్తియుక్తులచే నామెకు గల్గియున్న హరిభక్తిని మరపించి అనిత్య, అల్ప, హేయమైన యింద్రియ కరణముల విస్తరింపజేయు ప్రాపంచకములైన యాశాపాశములు గలుగజేయ ప్రయత్నించుచుండెను. ఇట్లుండగా కొన్ని దినముల కామెయందు నవయౌవన మావిర్భవించెను. అట్టి సమయమందు లక్ష్మీదేవియే తన యింటిలో సహస్రదళ రాజీవమునందు పూర్ణమైన అమృతకళలతో గూడినదై యవతరించినట్లు వెంగమాంబ మహాసౌందర్యముచే దేదీప్యమానమైన మాణిక్యము రీతి ప్రకాశించుచుండెను. అప్పుడామె తండ్రి శీఘ్రముగా నిషేకము జరిపించిన నామెకు ప్రపంచబుద్ధి గల్గునని, పరమాత్ముని మరచునని యభిప్రాయము గలవాడై యందులకు దగిన యేర్పాటులను జేసెను. ఆమె భర్త యా నిషేకదినమందలి రాత్రియందు సమీపించిరాగా వెంగమాంబ యాతనిని జూచి

మత్తకో॥ నాకు నాథుడు భర్త వేంకటనాథుడనుచును గానవా
ప్రాకటంబుగ నన్ను జూడక పారుభ్రాంతిని బాసియున్ ।
చేకొని క్రమమైన వార్తల ఛీ ఛి దూరము వెళ్లరా
రాకు దగ్గర మీరి వచ్చిన రాలిపోదువు యాకుగా ।

ఓరి పిచ్చివాడా! నీకేమి విభ్రమము గలిగియున్నది? నాకు ప్రాణ నాయకుడు, భర్త, ప్రభువు శ్రీ వేంకటేశుండని నీవెరుగవా? నా తండ్రి మాయాబద్ధుండై బుద్ధిహీనతచే నీకు వివాహము జేసెను. కాబట్టి నన్నాశ్రయించకుము. మీరుదువేని నీ శిరసు సహస్రఖండములై పోవునని పలికెను.

ఇట్లు పల్కిన యామె మాటలను విని యా బాపడు విభ్రమము జెందినవాడై అయ్యో! కృష్ణయ్యకూతురు పిచ్చిదని లోకులు జెప్పినమాట నిజమయ్యెనే, ఇది గ్రహమో, దేవతయో, యేమో, యెఱుక శక్యముగాకున్నదే. నాతల్లియు, తండ్రియు ప్రాపంచికములైన యాశాపాశము లేని యావనితను నాకిచ్చి వివాహముజేసి యిట్టి దుఃఖములు సంభవింపజేసిరేయని చింతించుచు పిమ్మట పంచవర్షములకు మృతి నొందెను.

## బ్రాహ్మణులు వెంగమాంబను శ్రమల బెట్టుట

అప్పుడాయగ్రహారములోని బ్రాహ్మణులందరును జేరి కులాచార ధర్మ ప్రకారమామెకు శిరోజముల దీసివైచి స్వయంపాక పనులలో ననగా వంటపనుల యందు నియమింప యత్నించిరి. అందుకు వెంగమాంబ సమ్మతించక తాను నిత్యసుమంగళిననియు, నిత్యమంగళాకారుడైన శ్రీ వేంకటేశ్వరులు తనపతియై తనయందే రాణించుచున్నాడనియు, నా పరమేశ్వరుని వ్రతముగా గొలుచుటే తన ధర్మమనియు వారానతిచ్చు ప్రకారము తన శిరోజముల దీయనక్కరలేదనియు వాదులాడుచు మంచి శ్వేతవస్త్రములను, సువాసనలు గల పుష్పములను రత్నకాంచన

దివ్యాభరణములను ధరించుకొని నిత్యానందామృతపానాసక్తయై సంతతము శ్రీ గోవింద పరబ్రహ్మ స్మరణానందముచే పరవశమెుందుచు ప్రకాశించుచుండెను. అప్పుడా పుణ్యాంగన యొుక్క దివ్యసుగుణ వైభవముల తెలియజాలని బ్రాహ్మణులు తమ ప్రయత్నముల చేత నామెను తమ యిచ్ఛానుసారముగా నడువ జేయ సాధ్యము గాకపోవుట చేత తమ ప్రయత్నములను చాలించుకొని యామెను కులభ్రష్టురాలనియు, మహాగర్వముగల వితంతువనియు, ననేక తెరగుల దూషించుచు, కులములో నుండదగదని యామెనిండ్లలోనికి రానీయక తరిమివేయుచుండిరి.

కం॥ నలుగడల సంచరించుచు
వలనొప్పెడు వేంకటేశువైభవదేశున్ ।
సలలితముగ నిజమదిలో
పల గొలుచుచు సంతసించె భామామణియున్ ॥

అప్పుడు వెంగమాంబ స్వేచ్ఛగా దిరుగుచు సంతతము శ్రీ వేంకటేశ్వరుల చరణారవిందధ్యానామృతపానచిత్తయై, యా పరంధాముని భక్తియందే సొక్కుచు సరస్వతియోయన్నట్లు ఆడుచు సకల ప్రపంచమును మరచి కేవలాత్మయై వినమిత బుధలోలుడైన శ్రీ వేంకటాచలవాసుని యందు చింత నిలిపి క్రీడించుచుండెను. ఆ మహాపుణ్యవతి యొుక్క మహిమను దెలియని బ్రాహ్మణులు ప్రపంచ వాసనాధిక్యతచే మాయామదాంధులై యా భక్తిరత్నమును యవమానపరచసాగిరి. మఱియు విద్యాసంపదలు గలిగి ధనయౌవనపర్వతారూఢులై యజ్ఞానముచే నామెను పెక్కువిధముల దూషించిరి. రాళ్ళచే రువ్వించిరి. వ్యభిచారియనిరి. కులద్రోహి, కులభ్రష్టురాలనిరి. మరియు కొందరు వివేకులిట్టి భక్తిభరితమయిన కవిత్వముగల యీామె సాక్షాత్ సరస్వతీదేవియేగానీ సామాన్యురాలు గాదని యా పుణ్యేశ్వరి ప్రభావముల గొనియాడిరి. మరికొందరామెను జూచి నమస్కరించుచు, ఆమె లక్ష్మీదేవియే గానీ సామాన్యురాలు గాదనియు, నామె

వాక్కునందు భారతి నిత్యనివాసమున్నదనియు నామెకు ప్రదక్షిణ నమస్కారములను జేయుచుండిరి. మరియు నన్నపానముల నిచ్చి సన్మానించిరి. ఆమె కీర్తిని గొనియాడుచు నొకరితోనొకరామె ప్రభావముల జెప్పుకొనుచు నాశ్చర్యస్వాంతులైయుండిరి.

**శ్రీ తరిగొండకు శంకరాచార్య పరంపరాచార్యులు వచ్చుట**

ఇట్లుండగా కొంతకాలమునకు జగద్గురువులైన శ్రీ ఆదిశంకరాచార్య పరంపరలో జేరిన యొక యాచార్యులు ఛత్రచామరధ్వజాదిబిరుదులతోను, కమండలాది నవరత్నఖచితకంకణాభరణాదులతోడను యలంకృతుడై గజతురగ పదాది పరివారములతో స్వర్ణ సింహాసనారూఢులై వచ్చిరి. అప్పుడాయగ్రహారములోని బ్రాహ్మణులు మొదలగు ప్రముఖజనులు వారి నెదుర్కొనిపోయి యుచితమర్యాదల జేసి సకల సంభ్రమములతోను దోడ్కొని వచ్చి మకరతోరణాదిసకలవిధ యలంకారములజేసి యొక శుభ్రప్రదేశమున వేంచేయించిరి. అప్పుడు తరిగొండ గ్రామములోని జనులును, చుట్టుప్రక్కల గ్రామములోని జనులును వేనవేలుగా త్రికరణశుద్ధులై ఫల, శర్కర, నారికేళ, గంధ, పుష్పముల నాచార్యుల వారికి సమర్పించి తమ శక్త్యానుసారము ధన, కనక వస్త్ర వస్తువాహనాదుల సమర్పించి స్వాముల దర్శించి పోవుచుండిరి.

శ్లో॥ ఆచార్యో వేదసంపన్నో - విష్ణుభక్తో విమత్సరః ।
యోగజ్ఞో యోగనిష్ఠశ్చ - సదా యోగాత్మకశ్శుచిః ॥

ఈ శ్లోకము ఉత్తరార్ధము మరో విధంగా కూడా ఉన్నది -

ఆచార్యో వేదసంపన్నో విష్ణుభక్తో విమత్సరః ।
మంత్రజ్ఞో మంత్రభక్తశ్చ సదా మంత్రాశ్రయశ్శుచిః ॥

ప్రస్తుత గ్రంథానుసారము తాత్పర్యము -

శాస్త్రజ్ఞుడు, వేదవిదుడు, విష్ణుభక్తుడు, మాత్సర్యము లేనివాడు, మంత్రముల నెఱిగినవాడు, మంత్రములను సేవించువాడు, మంత్రములనే ఆశ్రయించినవాడు, పరిశుద్ధుడు - ఈ ఉత్తమలక్షణములు కలిగినవాడే బ్రాహ్మణుడని అర్థము.

ఇట్లుండగా తరిగొండలో నొక బ్రాహ్మణ స్త్రీ భ్రష్టురాలాయెనని యజ్ఞాన జనవదంతి ప్రసిద్ధిగా నుండుటచే కొందరు బ్రాహ్మణులు శ్రీ ఆచార్యులవారి రాక మంచిసమయమని యెంచి, యోచించి యామెకాచార్యుల వారిచే బుద్ధిజెప్పించవలెననియు, కులాచారధర్మప్రకారము శిరోజముల దీసివైచి యామెను మరల కులములో జేర్చుకొనుట కడు న్యాయమార్గమని నిశ్చయించి యామె విషయమై జగద్గురువులకు అర్జీలను వ్రాసి యిచ్చియు, నేరుగా జెప్పియు సకల విషయముల తెలియజేసిరి. అది విని యాచార్యులవారు బ్రాహ్మణ యువతి యట్లుండుట ధర్మవిరోధమనియు, కులహానికరమనియు నాలోచించినవారై వెంగమాంబను తనయొద్దకు బిలుచుకొని రమ్మని తన భటుల నాజ్ఞాపించిరి. అప్పుడాచార్యులవారి సేవకులు పరుగున వెంగమాంబ కడకు వెళ్ళి యాచార్యులవారి యాజ్ఞను సెలవిచ్చిరి. అది విని యా లోకేశ్వరి యన్నముదిన్న పిదప వత్తునని ప్రత్యుత్తరమిచ్చెను. ఆచార్యభటులా మాటలకు తబ్బిబ్బునొంది యిట్టి వార్తల మేమిదివరకెచ్చటను వినలేదని వేగముగా వచ్చి స్వామివారికి విన్నపము జేసిరి.

## వెంగమాంబ శంకరాచార్యుల వద్దకు వచ్చుట

అప్పుడా మాటలను విని యా సభలోని వారు విభ్రాంతులై యుండగా కొందరు బ్రాహ్మణులు కోపావేశము గలవారై కేవలము స్త్రీలకింతటి గర్వముండరాదని జ్ఞానశూన్యులై యోచించుచు వేగముగా బయలుదేరి వెంగమాంబ గారి యొద్దకు వచ్చి యామెనాచార్యుల వద్దకు రమ్మని నిర్బంధించిరి. అప్పుడు వెంగమాంబ గారు ఆచార్యులను దర్శింప నొక

నారికేళమును బట్టుకొని వచ్చిరి. సభలోని వారామెను యాచార్యులు వారు వేంచేసియున్న సింహాసనమున కభిముఖమునున్న తెరచాటున నిల్పిరి. అఖిలప్రాణేశుడైన శ్రీనివాస దైవశిఖామణిని తలచి పరవశము గలదై నిలిచియుండెను. అదిచూచి యజ్ఞానపూరితులైన కొందఱు బ్రాహ్మణులామెను నమస్కరింపుమని త్వరపెట్టిరి. కొందరామెను జూచి బాగుపడుకాలము లేదనిరి. మఱికొందఱు ఆచార్యులకు నమస్కరించని యామెను జూచి యీ విధవకెంత గర్వము గల్గినదనిరి. కొందరు గ్రహముబట్టినదనిరి. మఱికొందరు వివేకరహితమనిరి. ఆమె కవితాధార కాకముకూతలకు సమమనిరి. కొందఱేమి కారణమో యని యాలోచించిరి. మఱికొందరు ప్రపంచములో నిట్టిదుండబోదనిరి. బ్రాహ్మణకులగౌరవము నాశమొందించుటకే యామె జన్మించినదనిరి కొందఱు. అప్పుడు జగద్గురువులు తెరనావలికి దీయించి వెంగమాంబను జూచి "ఓ భామా! నీవేల నమస్కరించవని యడిగిరి", అందులకు లోకమాత "మీరాయాసనము నుండి యావలకు లేచిపోయిన నేను నమస్కరించె" దననెను. అది విని యాచార్యుల వారు చిన్నబోయినవారై యీ వనిత యిట్లేల యనుచున్నదోనని కొంత తడవు శంకించి పిమ్మట బ్రాహ్మణకులాచార ధర్మము పరిపాలనార్థము శాంతము వహించియైనను యా యువతికి బుద్ధి చెప్పవలెనని నిశ్చయించి "సరే నమస్కరింపుము" అని యాసనము నుండి దిగి యొక ప్రక్కగా నిలిచిరి.

## ఆచార్యులవారి సింహాసనము దగ్ధమై భస్మీపటలమగుట

అప్పుడచ్చటి బ్రాహ్మణులాతని శాంతమునకు, నాలోచనమునకు నచ్చెరువంది వెంగమాంబను నమస్కరింపుమని యరచిరి. అప్పుడు వేంకటేశ్వరుల భక్తరత్నమైన వెంగమాంబ పరమదయాళువైన భగవంతుని సదా నమస్కరించుచున్నటువంటి తన దివ్యబాహువులతో నాసింహాసనమునకు నమస్కరించెను. ఆహా! ఏమనవచ్చు? అప్పుడట జరిగిన యాశ్చర్యకరమైన సంఘటన! సింహమటవి నుండి దూకి వచ్చెనా?

లేక సముద్రముప్పొంగెనా? లేక కాలకంఠుడు వీరావేశముతో నెల్లలోకముల లయము జేయవచ్చెనా? లేక ప్రళయము సంప్రాప్తమయ్యెనా? యనునట్లు గొప్ప ధ్వనియు, దానివెంబడి ప్రజల కలకలత్వమును జనించెను. అప్పుడాచార్యుల సభలోని భూదేవులు కడు భయసంభ్రమస్వాంతులై చిత్తవైకల్యమును బొందినవారై యొకరినొకరు శీఘ్రగమనము నిమిత్తము పిలుచుకొనుచు పరుగిడనారంభించిరి. స్వాములవారి సింహాసనము ఆ క్షణమే యగ్నిజ్వాలలచే కీలితంబై పటపట ధ్వనితో కొన్ని నిమిషములలోనే నిర్మూలమైపోయెను. నవరత్నఖచితమైన సింహాసనము వైశ్వానరుడు దయాహీనుడై దహించిన వెంటనే పొగయు నగ్నికణములును భూమ్యాకాశములు నిండుగా నావరించెను. అప్పుడు స్వాములవారు మిక్కిలి భయపీడితులై స్వాంతమందు "ఆహా! నేనా సింహాసనమందున్నచో నాగతి చెప్పనలివిగానిదే. ఇప్పుడు నా ప్రాణరక్షణమైనది. ఆమె మాహాత్మ్యము భక్తివైరాగ్యాదులను దెలియక పామరబుద్ధిచే గూడిన మూఢబ్రాహ్మణులు నన్నిట్లు పురికొల్పిరే. ఈమె సాక్షాత్ ప్రహ్లాదుని యవతారమై యున్నది గాని వేరుగాదు అని చెప్పుచు నామెకు ప్రదక్షిణ నమస్కారముల జేసి 'తల్లీ! నీవు మహాయోగసంపన్నురాలవు. వేంకటేశుని సదా మనమున నిల్పినదానవు. నీ మాహాత్మ్యము నెఱుగలేక చేసిన యపచారముల మన్నించవలె'నని యామె ప్రభావమును గొనియాడుచు వేడికొనిరి.

పిమ్మట యాచార్యులవారు బ్రాహ్మణులను జూచి ధూపముచే నావరింపబడిన యనిలము దృశ్యము గాని యట్లుగను, కల్మషముచే గురిబడిన కాంచనము ప్రకాశించనట్లుగను, మేఘములచే వ్యావృతుడైన సూర్యుడు తీక్ష్ణజ్వాలలను సైతము విస్తరింపజేయక దాగియుండునట్లును, మహాభక్తి, వైరాగ్య, యోగ, జ్ఞాన సంపన్నురాలును, బ్రహ్మవేత్తలలో పరమ రత్నములైన శ్రీ వెంగమాంబ మాహాత్మ్యములను మీరెరుగజాలక యా పుణ్యాంగన లోకాచారముననుసరించని కారణమున నామెను నిర్లక్ష్యము

జేసితిరే? ఈ ప్రపంచము కల్మషకూపమైయున్నది మరియు నా ప్రపంచ భావములు కల్మషకూపముల విస్తరింపజేయునవియై యున్నవి. విచారించగా పరిశుద్ధ నిత్యబుద్ధమైన పరబ్రహ్మము యొక్క మార్గమునకు ప్రపంచమార్గమే వ్యతిరిక్తమైయున్నది.

**శ్లో॥ యథా పంకేన పంకాంభః సురయా వా సురావృతః ।**
**భూతహత్యాం తథైవైమాం న యజ్ఞైర్మార్ష్టుమర్హతి ॥**

భావము స్పష్టముగా నున్నది.

మలినమును మలినముచే గడిగిన మలినము బోనియట్లును, కల్లుకుండను కల్లుచే గడిగిన కంపుపోనయట్లును కర్మము వలన గలిగిన జన్మము మరల కర్మానుష్ఠానము వలన గాని పోజాలదు. కాబట్టి కర్మననుష్ఠించుచున్న యీ ప్రపంచజ్ఞులు ఆచారములను, యితర కర్మముల ననుష్ఠించుచు పరిశుద్ధులై కైవల్యార్హులయ్యెదమని భ్రమించుచున్నారు. జ్ఞానస్వరూపిణియైన యీ జననికి పరబ్రహ్మను సదా ధ్యానించుటకన్నను సత్కర్మ లేనే లేదు.

**శ్లో॥ యే తు వృత్తం విజానంతి జ్ఞాత్వా వై వర్ధయంతి యే ।**
**తే వై సత్పురుషా ధన్యా వంద్యాస్తే భువన త్రయే ॥**

ఎవరు ఆత్మనిష్ఠాభ్యాసులోవారే సత్పురుషులు, కృతార్థులు, త్రైలోక్యవందితులు, మహాత్ములునైయున్నారు మరియు బ్రహ్మనిష్ఠచే పరమశాంతిని బొందిన వెంగమాంబ మహాపవిత్రురాలై యున్నది. ఇంకమీద నీమెనెంతమాత్రము దూషించకుడు. అట్లు మీరు దూషింతురేని -

**శ్లో॥ యోగీశ్వరస్య యోగస్య యోగశాస్త్రస్య పార్వతి! ।**
**నిందాం చ యే ప్రకుర్వంతి రాక్షసాస్తే నరాః క్షితౌ ॥**

ఓ పార్వతీ! యోగీశ్వరులను, ధ్యానగుణమును, యోగశాస్త్రమును ఎవరైతే నిందిస్తారో వారు ఈ నేలమీదనున్న నరరూపరాక్షసులు.

మీ బ్రాహ్మణ జన్మములను పోగొట్టుకొన్నవారై భువిలో రాక్షసులుగా జన్మింతురని చెప్పి, బ్రాహ్మణులను ఖండించి యాపుణ్యలోకేశ్వరిని యనంత విధముల గొనియాడిరి.

ఇట్లు స్వాములవారు చెప్పగా విని బ్రాహ్మణులు దిగులొందినవారై యా బ్రాహ్మణకులతిలకమైన వెంగమాంబకు శరణాగతులై వందనములు సేసి తాము పూర్వము జేసిన తప్పులను క్షమింపవలెనని ప్రార్థించిరి.

**కం॥ తరిగొండ విప్రతిలకా**
**శరణంబని పడెదమమ్మ సాష్టాంగముగా ।**
**బరువైన మాదు తప్పులు**
**కరుణించి క్షమించవమ్మ కమలదళాక్షీ!**

అటుతర్వాత స్వాములవారు వెంగమాంబను గౌరవించ నెంచినవారై యా గ్రామమంతయు నలంకరింపించి, బ్రాహ్మణసంతర్పణలు జేయించి యామెకు సకల భక్ష్య, భోజ్య లేహ్యములతో విందు జేయించెను. అప్పుడు వెంగమాంబ గారికి భూసురులెల్లరు జయము పలికిరి. శేషాద్రిశిఖామణియైన శ్రీవేంకటేశ్వరులను వేడిరి. శ్రీనివాసమూర్తిని వేదాంతరత్నమనిన్ని, భక్తుల బ్రోచెడి పరమదయాళువనియు, కలియుగనారాయణుడనియు, నాశ్రితజన చింతామణి యనియు పొగడుచు శ్రీ వేంకటేశ్వరుల గూర్చి స్తోత్రములు జేసిరి. అప్పుడాచార్యులవారు వెంగమాంబను సద్గురుమూర్తిగా పూజించి యామె యనుగ్రహమును బొందినవారై త్రివిధదీక్షల బొంది బ్రహ్మనిష్ఠాభ్యాసులై శ్రీ వేంకటేశ్వర పరంజ్యోతియగు నారాయణుని మనోబుద్ధిమారుతదృక్కులు మధ్య సర్వకాలములందు దర్శించనేర్చినవారై కృతార్థులైరి. అప్పుడు వెంగమాంబ గారు లోకాచార్యుడైన శంకరాచార్యుల వారిని వినుతిజేసిరి.

రాగం - భానుస్వరం - ఆదితాళం

పల్లవి॥ శంకరాచార్యగురించి సన్నుతింపరే

అ.ప॥ నిష్కళంక పరమయోగమభ్యసింపరే ।

చ॥ స్థూల సూక్ష్మకారణముల మూల మరయ వువిద
నీలతో యడమున నిలచి మెఱయరే ॥శంక॥

మూడు రెండు దాటిపైన మెడజేరరే ।
సోడిమిగను ముక్తికాంత చోద్య మరయరే ॥శంక॥

చక్కగా త్రివేణి నడుమ జలక మాడరే ।
చొక్కముగను వెలుగుచున్న చుక్కగాంచరే ॥శంక॥

పన్నుగా శ్రీతరిగొండపతిని గాంచరే ।
పరమునెన్ను కొనుచు బ్రహ్మపదము జేరరే ॥

ఇట్లు వినుతి జేసిన వెంగమాంబను సకల జనులు ముకుళితహస్తులై సేవించుచు నామె ప్రభావములను దేశదేశముల జెప్పసాగిరి. ఇట్లుండగా కొందరు బ్రాహ్మణులు రంగువేసిన వస్త్రము ఉదుకతో రంగు పోనియట్లుగా, దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన మొదలగు ప్రపంచ దుర్గంధమగ్నులై యనుభవజ్ఞానములేక యాచార్యులతో నిట్లు చెప్పిరి. "స్వామీ! వెంగమాంబ వంటి పుణ్యవతి యీ లోకమున నిక జన్మించబోదు. అందుకు సందియము లేదు. కాని యట్టి పుణ్యవతి కులాచారముల ననుసరించకపోయిన యిక సామాన్యులు సహితము పురుషుడు గతించిన శిరోజముల దీసివేయకను, బ్రాహ్మణాచారముల నిగ్రహించియును నడచుకొందురు. అట్లందరును చేయదొడంగిన భూలోకములో బ్రాహ్మణకులమునకు శ్లాఘ్యత యేమున్నది? కనుక మీరెటులైన నామెను ప్రేరేపించి శిరోజముల దీయజేసితిరేని మేమందరమును వెంగమాంబను బ్రాహ్మణదేవతగా నెంచి నిత్యోత్సవముగా

నారాధించెదము, ఆ మాటలు విని స్వాములవారామెకట్లు చెప్పజాలననియు, సర్వజ్ఞురాలైన యా మాత కట్టిచారములజెప్పబోయినపుడు సింహాసనము నిర్మూలనమైనది గదా! కనుక యట్లు చెప్పదగదనియు, వెంగమాంబ శిరోజముల దీయకయున్నను స్వతస్సిద్ధముగా బ్రాహ్మణదేవతయే యనియు, యిక బ్రాహ్మణులును, సకలజాతుల వారును ఆమెను తమ కులదైవముగా పూజించబోవుచున్నారనియు జెప్పెను. అట్లు జెప్పి స్వాముల వారెంత వాదించినను బ్రాహ్మణులు వినక తమ యభిప్రాయమును వెంగమాంబకు తెలియజేయుడని నిర్బంధించిరి. అందుచే నాచార్యులు వెంగమాంబకు నమస్కరించి బ్రాహ్మణుల యభిప్రాయమును తెలియజేసిరి. అందుకు లోకైకజనని మందహాస వదనారవిందయై తానా ప్రకారముగా జేయుట కాక్షేపణ లేదనియు అయితే మరల వెంట్రుకలు మొలవకుండునట్లుగా జేయ శక్తులెవరనియు నడిగెను. అది విని యాచార్యులవారవమానము నొంది యామెకు దండములాచరించి క్షమింపుమని వేడిరి.

ఆ కాలమున మదనపల్లిలో రూపావతారము సుబ్రహ్మణ్యశాస్త్రులను గొప్ప ఆధ్యాత్మికవిద్యావేత్త యుండెను. కృష్ణయ్య ఆయన యొద్దకేగి, తన కూతురు వృత్తాంతమును విన్నవించి, ఆమెకు బ్రహ్మవిద్యోపదేశము చేయుటకై అభ్యర్థించినాడు.

## గురూపదేశము, గ్రంథరచన

తరిగొండ వాస్తవ్యుడు, ఉత్తమగృహస్థుడైన కానాల కృష్ణయామాత్యుని కూతురగు వెంగమాంబ వైఖరిని గూర్చి కర్ణాకర్ణిగా వినియున్న శాస్త్రులవారు కృష్ణయార్యుని అభ్యర్థనము నంగీకరించెను. కృష్ణయ్య తరిగొండకు మరలి వచ్చి, యొకరోజున వెంగమాంబను మదనపల్లికి తోడ్కొనిపోగా, గురువు ఆమెను కొన్ని ప్రశ్నలడిగి ఆమె తాత్త్వికధోరణి సవ్యమైనదే యని గుర్తించి, తన శిష్యురాలిగా అంగీకరించెను.

శాస్త్రిగారు తన యుపాస్యదైవమగు శ్రీ సోమేశ్వరస్వామి సన్నిధిని వెంగమాంబకు వేదాంతవిద్య నుపదేశింపదొడగిరి. 'గురుస్సాక్షాత్ పరబ్రహ్మ' యను పరిపూర్ణ విశ్వాసముతో నామె గురూపదేశములను ఆచరణపూర్వకముగా అనుభవమునకు దెచ్చుకొనుచుండినది. తనయ వాత్సల్యముతో తనను గౌరవించుచున్న సుబ్రహ్మణ్యగురుని మిగుల నభినివేశముతో వెంగమాంబ శుశ్రూషింపజొచ్చినది. ఆ దేశికోత్తముడు క్రమముగ నామెకు మంత్రోపదేశము గావించి, తదుపాసనావిధానమును సాంగముగా నుపన్యసించినాడు. భక్తితత్త్వమును, యోగశాస్త్రరహస్యములను సాంకల్యముగ బోధించి, పరమార్థమును వివరించినాడు. జన్మాంతరసంస్కార రూపమున ఆమెలో అణగియుండిన జ్ఞానశక్తి అనుక్షణ తీవ్రసాధనల వలన, ఉద్బుద్ధమై, అచిరకాలముననే ఆమె పరిపూర్ణజ్ఞాని యయ్యెను. ఇది గుర్తించిన సుబ్రహ్మణ్యదేశికుడు సంతృప్తుడై, మఱికొన్ని సాధన మార్గములను దెలిపి, మెలకువలను విశదీకరించి, సూచనల నొసంగి వెంగమాంబను దీవించి తరికొండకనిపెను.

గురూపదేశమును బడసి వచ్చిన వెంగమాంబ దినములో నెక్కుకాలము తరిగొండ లక్ష్మీనృసింహాలయములో గడుపుచుండెను. ఆ గుడిలో నొకవైపున నున్న ఆంజనేయస్వామి విగ్రహము చాటున గల ఏకాంత ప్రదేశమందామె యోగసమాధి లీనయగుచుండెను. ఇది యెవ్వరును గమనింపరైరి. యోగాభ్యాస సమయము గాక తక్కినవేళలలో వెంగమాంబ కవిత్వమల్ల నారంభించెను.

వెంగమాంబ సారస్వతకృషిలో తొట్టతొలి ఫలము తరిగొండ నృసింహశతకము. "మీరిపుడు వాక్కుల నిచ్చినంతలో, శతకము గాను జెప్పెదను సద్గురుస్వామి కటాక్ష మేర్పడన్" అనియందు పేర్కొనినది. కొందరామె కవిత్వమును విమర్శించగా వెంగమాంబ అందులకు నొచ్చుకొనక, తన శతక పద్యములను ధరిత్రి మీదట నిల్పుమని ఆ తరిగొండ నృసింహునే వేడుకొనినది.

నృసింహ శతకానంతరము ఈ కవయిత్రి ప్రహ్లాదచరిత్ర ఆధారముగా 'నృసింహ విలాసకథ' (యక్షగానము)ను రచించి ఆ స్వామికే సమర్పించినది. అటు పిమ్మట శివనాటకము (శివవిలాసము) అను యక్షగానమును రచించి రాచవీటి (రాయచోటి) వీరభద్రస్వామి కంకితమొనర్చెను.

నృసింహాలయమునకు రాకపోకలు సాగించుచుండుట యోర్వలేని కుమతులు కొందరామె ప్రవర్తనమును గూర్చి దుష్ప్రచారము గావింప మొదలిడిరి. మఱికొందరామె యేగుచుండగా వెకిలిగా మాటాడుచు సన్ననిరాళ్ళు రువ్వుచుండిరి. దుష్టశిక్షకుడు, శిష్టరక్షకుడు, భక్తపాలకుడునైన లక్ష్మీనృసింహస్వామియే అట్టివారలకు బుద్ధిగరపగలడని తలచి, యామె ఒకవైపు యోగసాధనను, మఱొకవైపు గ్రంథరచనమును కొనసాగించుచు 'కవితైవ తపః' అను సూక్తిని సార్థక మొనర్చుచుండెను.

ఇంచుమించు ఈ కాలముననే ఈ కవయిత్రి రాజయోగామృత సారమనెడు తాత్త్విక (ద్విపద) కావ్యమును రచించి తరిగొండ పురధాముడైన నృసింహస్వామి కంకితము గావించినది. అనంతరము బాలకృష్ణనాటక మనెడు యక్షగానమును రచించి వాసుదేవున కంకిత మొనర్చెను.

వెంగమాంబ తొలుతనుండియు లక్ష్మీనృసింహాలయములో ఎడమ వైపున గల ఆంజనేయుని విగ్రహము వెనుకనున్న స్థలములో కూర్చుండి, పెక్కుగడియలు ధ్యానసమాధి యందు గడుపుచుండెడిది. ఆమె గుడికి వచ్చిపోవుచుండుట చాలమంది ఎఱిగియున్నను, అట్లు ఆంజనేయ విగ్రహము చాటున ధ్యాననిమగ్న యగుచుండుట యెవ్వరెరుగురు. ఒకనాడామె యాంజనేయవిగ్రహము వెనుక యోగసమాధిలీనయై, కొన్ని దినములట్లే యుండెను. వెంగమాంబ గుడిలో గాని, గ్రామములో గాని కనిపింపనందున ఎల్లరును ఆమె యూరు విడిచి ఎచటికైన పారిపోయియుండునని పరిపరి విధముల ఊహించిరి.

ఆలయార్చకు డొకనాడు ఆంజనేయుని పూజించుచు, వెనుక నున్న వెంగమాంబను జూచుట తటస్థించెను. చూచి, దయ్యమో, భూతమో యని భయపడెను. ధైర్యము తెచ్చుకొని మరల నొకమాఱు పరికించి విగ్రహము చాటున చీకటిలో నున్నది కానాల కృష్ణయ్య కూతురగు వెంగమాంబయే యని నిశ్చయించి, గుప్తవర్తనమునకై అచ్చట చేరినదని ఆ భక్తురాలిని శంకించి, యతడు కోపాటోపముతో బిగ్గరగా దూషించుచు తలవెంట్రుకలు పట్టి యామె నీవలికి లాగెను.

కేశములు లాగబడుటచేతవలని బాధచే సమాధిభంగము కాగా అమె కనులుదెరచి చూచినది. ఆ యోగిని దృష్టికి తాళలేక అర్చకుడు మూర్ఛితుడై పడెను. కొంతవడికి తెప్పరిల్లి, అపరాధమును క్షమించమని యామె చరణములపైబడి ప్రార్థించినాడు. తన ధ్యానమున కారీతిని విఘ్నము కల్గుట దైవసంకల్పమే యని తలపోసి, వెంటనే ఆ యూరు వదలి వెళ్లవలసినదిగా నరహరి ఆజ్ఞాపించినట్లామె నిశ్చయించి, ఆ యిష్టదైవమును మనసార ధ్యానించి మ్రొక్కి తిరుమల దారిబట్టెను.

## తిరుమల యాత్ర

వెంగమాంబ తరిగొండను వీడి, తిరుపతి క్షేత్రమున కభిముఖముగా పయనించెను. క్రమముగా వేంకటాచలారణ్యమును ప్రవేశించినది. ఆకలిదప్పులను లెక్కపెట్టక, క్రూరజంతువుల సంచారమునకు భీతినొందక, ఇష్టదైవమగు తరిగొండ లక్ష్మీనృసింహుని సంస్మరించుచు, ఒకటి రెండు దినము లడవిదారిలో పయనించి, *'సందెకావు మొగలిపెంట' యను పేరుగల

**సందెకాపు మొగలిపెంట :** సందెకాపు-సందెకావు. అంటే సందెవేళ నిరీక్షించే ప్రదేశం. పెంటలు-మందలు- పశువులు గుమికూడే ప్రదేశం. ఆ కాలంలో పశువులను అడవులలో స్వేచ్ఛగా వదలివేసి రాత్రులలో టెంకలలో రక్షణకోసం ఒకచోట చేర్చి కాపుకాచేవారు. అలాంటి ప్రదేశం యిది. అలనాటి ఆంగ్లేయులు కూడా యిక్కడొక బంగళా సకల సౌకర్యాలతో నిర్మించారు. దీనినే యుద్ధగళ తీర్థమంటారు. రాతియుగపు నాటి ఆనవాళ్లు వున్నాయి. ఇక్కడి ఆంజనేయస్వామి, ప్రకృతి ఒసగిన ఫలాలు, నీటి చెలమలు వెంగమాంబను ఆదుకొన్నాయి.

కోనను చేరెను. అచ్చట వెలసియున్న యాంజనేయుని పాదసన్నిధిలో పద్మాసనాసీనయై యామె తిరుపతి వేంకటేశ్వరస్వామిని గూర్చి తీవ్రముగా తపము గావింప దొడగెను. ఒకనాడు శ్రీ వేంకటేశ్వరుడు ప్రత్యక్షమై, తన సన్నిధికి రావలసినదని యానతిచ్చినటుల నామె కనుభూతి కలిగెను. ఆ కాఅడవిలో తననాదరించి కాపాడిన ఆంజనేయస్వామిని మిగుల కొనియాడి, క్రమముగా వెంగమాంబ కాలినడకన తిరుమల పుణ్యక్షేత్రమును చేరుకొనినది.

ఉన్నతములగు గాలిగోపురములు, సూర్యకిరణసంకలితములై ప్రకాశించు బంగారు శిఖరములు, ఎత్తైన ప్రాకారములు, ఉద్యానవనములు, మఠములు, మందిరములు మున్నగు వాటితో మనోజ్ఞములైయున్న వేంకటాచలక్షేత్రదృశ్యముల దిలకించుచు, వెంగమాంబ భక్తిభావపులకితయై వేంకటనాథుని కొనియాడుచు, ఆలయమున కరిగి, స్వామివారి దివ్యమంగళ విగ్రహమును తనివితీర, ముదమార సందర్శించినది.

వెంగమాంబ యోగిని యని, గొప్ప భక్తురాలని ఆ నోట, ఆ నోట అంతకుముందే వినియుండిన ఆనాటి మహంతు ఆమె రాక నెఱిగి, శ్రీనివాసుని కోవెల యొక్క తూర్పుమాడవీధి చివర నుండిన రాతితేరునకు కుడిప్రక్కనున్న పూరియింటిని ఆమె నివాసమునకై యొసంగెను.

మఱియు మఠంవారి పాకశాల నుండి వడిబియ్యమును, అందులకు దగిన సంభారములను వకుళమాలిక పేరిట వెంగమాంబకు పంపించు నేర్పాటు గావించెను.

వెంగమాంబ తన కుటీరమున స్వయంపాకము చేసికొని స్వామికి నైవేద్యము పెట్టి భుజించుచు, మిగిలిన వేళలయందు భక్తిప్రపత్తులతో గ్రంథరచన గావింప మొదలిడెను. తన కుటీరము నొద్ద తులసి మొక్కలను,

పూలతీగలను పెంచి, పుష్పమాలలు కట్టి ఆలయమున కేగి స్వామివారికి సమర్పించుచుండెను. ఈ కవయిత్రి తిరుమల క్షేత్రమును చేరిన పిమ్మట మంత్రోపదేశమును పొందినటుల తోచును. ఈమె తరిగొండలో రచించిన రచనలలో దేనియందును హయగ్రీవస్తుతి లేకుండుట, తిరుమల యందు రచించిన కృతులన్నింట ఇష్టదైవతాస్తుతిలో హయగ్రీవుడు పేర్కొనబడి యుండుట ఈ యూహ కాధారములైనవి. వెంగమాంబ తిరుమలక్షేత్రమును చేరిన తొలినాళ్లలో రచించిన కృతి విష్ణుపారిజాతము. ఈ యక్షగాన మామె కవితాకమనీయతను, భక్తితత్త్వమును వేనోళ్ల చాటుచున్నది.

తాళ్లపాకవారి పొరుగున నుండుట వలన, వారి పూర్వులు రచించియుండిన రచనలతో పరిచయము కలుగు నవకాశము వెంగమాంబకు లభించెను. ఆ రచనలలో అన్నమయ్య ధర్మపత్నియగు తిమ్మాంబ (తిమ్మక్క) రచించిన సుభద్రాకల్యాణమను కృతి వెంగమాంబను మిగుల నాకర్షించినది. తదనుగుణముగా నామె 'రమాపరిణయ'మను ద్విపద కావ్యమును 'పెండ్లిపాట'గా రచించినది.

### బృందావనము

తిరుమలలో తాను నివసించుచుండిన యింటికి ఉత్తరదిశలో ఎత్తైన ప్రదేశమున కొంతచోటును సేకరించి, వెంగమాంబ అందు పూలమొక్కలతో గూడిన తులసీబృందావనమును పెంచదలచినది. అట్లు పెంపొందించ దలంచిన ఆ తోటకు నీటివసతి నిమిత్తముగ అందొక దిగుడుబావిని త్రవ్వించినది. ఎంతలోతు త్రవ్వినను అందు ఊటపొడమలేదు. అట్టడుగున పెద్దబండ యొకటి అడ్డుపడియుండుట అందులకు కారణమని తెలిసిన పిమ్మట, ఆమె బావిలోనికి దిగి యాశువుగా 'గంగాభవానిని' గేయ రూపమున ప్రార్థించినది.

రాగం - మోహన - త్రిపుట - చాపుతాళం

ప॥ ఓ తల్లి గంగాభవానీ రావే - ఖ్యాతిగ యిచటికి కపటము మాని ॥ఓ॥

చ॥ హరిపాదమున బుట్టినావు పురహరుని జటాజూటమున
నిలిచినావు । పరమ పవిత్రమైనావు - మా పాలిట వెలసి
పూజలుగైకొన్నావు. ॥ఓ॥

హరికర్పితముగ శ్రీ తులసివనమాలనాదర్చతో నిన్నుగావింప వెలసి
తరుణిది పెంచను మెరసియున్న నర లేక రావె శేషాద్రిలో వెలసి॥ఓ॥

వాసిగ నిను, చాల నమ్మి చిన్న వాండ్ల కాదరువుగ వున్న సొమ్మమ్మి
చేసితి నిను పనినమ్మి చేయ నిరువుగ యిచటికి బిర బిర రమ్మి॥ఓ॥

తరిగొండ నరసింహుడైనా శేషగిరివాసు నే వేళ కీర్తింపు జ్ఞానకరుణ
నాపై యుంచు శానా, మమ్ము కడతేర్చు భారము కల్గిన దానా ॥ఓ॥

ఇట్లు ధ్యానించిన కొన్ని నిముషములకు రజిత ప్రకాశముతో గూడిన సురగంగ బిరబిరమని యుప్పొంగుచు నురుగులతో గూడికొని బండలలో నుంచి చీరుకొని వచ్చి యా కొలను నిండునంత వరకు ప్రవహించెను. ఆ ప్రభావమును జూచిన జనులు వెంగమాంబ యీ లోకమునుద్ధరింప వచ్చిన మహాదేవియని సాష్టాంగముగా నమస్కరించి యామెకీర్తిననేక రీతుల ప్రశంసింపందొడగిరి. వెంగమాంబ యా పుష్కరిణిలోని తీర్థముతో తులసివనమును బెంచుచు దినదినమును తులసీదళములచే శ్రీ భూనీళాసమేతులైన శ్రీనివాసునారాధించుచు (శ్రీ వరాహ, పద్మ, భవిష్యోత్తర పురాణాంతర్గతమైన మాహాత్మ్య గ్రంథమునున్ను, శ్రీరాజయోగసారము, ముక్తికాంతా విలాసమునను గ్రంథములను రచించిరి. మరియు ననేక వేదాంత కీర్తనములను, శ్రీవేంకటేశ్వరుల కీర్తనములను రచించెను) శ్రీ వేంకటాచల మహాత్మ్యమను పద్యకావ్యమును రచించి యాపరంధామునికే సమర్పించెను. అందుచే నమితసంతోషముతో యోగనిష్ఠాగరిష్ఠురాలైన

యామె కనురెప్పయందే సదా తన పరంజ్యోతి తత్వసందర్శనము నిల్పుచుండిరి. వెంగమాంబ యప్పుడానందమే ఏరులై ప్రవహింపగా పరవశముతో బ్రహ్మముతో బ్రహ్మమై యచంచల బుద్ధీంద్రియములతో గూడినదై నిలచియుండగా యానందబాష్పములు ముత్యములవలె కన్నుల నుండి రాలుచుండగా అండపిండబ్రహ్మాండభాండములు నిండిన స్వయంజ్యోతియైన శ్రీ వేంకటేశ్వరపరంజ్యోతి యందు చిక్కువడిన అంతరింద్రియములు గల్గియుండెను.

అట్లుండగా కొంతకాలమునకు పిమ్మట తాళ్ళపాకుల చిన్నయ్య సూరి వంశస్థులు (ఈ మహాత్ముడు కృష్ణరాయల కాలమున విజయనగరము నుండి వేంకటాచలముజేరి యష్టాంగయోగముల నభ్యసించి శ్రీనివాసుని మెప్పించి వారి స్నేహమునకు, బాత్రుడై వారితో నాడిపాడి పరబ్రహ్మైక్య సంధానుడాయెను. ఈ బ్రహ్మవేత్త చరిత్రము శ్రీ వేంకటేశ్వర భక్తవిజయము యొక్క రెండవ భాగమునను్నది) శ్రీ వెంగమాంబ మాహాత్మ్యముల జూచి సంతసించినవారై శ్రీవారికోవెలకు ఉత్తరమాడవీధి యందున్న రాతియిల్లు నామె నివాసమునకై యుచితముగా నిచ్చిరి. అందుపై వెంగమాంబ తాను నివసించుచుండిన పూరియిల్లును విడచి వుత్తరమాడవీధిలో జేరి యా గృహము యొక్క వెనుక భాగమున నొక బావిని త్రవ్వించి దివ్యపరిమళ కుసుమతులసీవనము నేర్పరచి శ్రీనివాసుని సదా యా పుష్పరాసులచే నారాధించుచు పరమ పవిత్రురాలై యుండెను.

**అక్కారామయ్య వెంగమాంబ యొక్క శాపమును బొందుట**

**కం॥ పాటిగ శుభకార్యములకు**
**కోటిగ విఘ్నంబు లెన్నొకూడిన భంగిన్ ।**
**మేటియగు నామె చర్యకు**
**వాటముగానడ్డ చర్య వచ్చెన్ హెచ్చెన్ ॥**

అదేమన్న నాకాలమున అక్కారామయ్య దీక్షితులను నొక యర్చకుల పెద్ద యుండెను. అతడు సర్కారు తరపున నర్చకుడైయున్నకారణమున నతనికి మిగిలిన యర్చకులకన్న నధికారమెక్కువగా నుండెను. ఇతడు వెంగమాంబ యింటికి పడమర యింటిలో నివాసముండెను. ఇతడు విద్యాసంపత్కుల ధన, యౌవన, గర్వపర్వతారోహుడై తనకన్న భువిలో ధన్యులును, సమానులు లేరని మనసులో నెంచినవాడై భగవద్భక్తులను నిర్లక్ష్యము జేయుచు, వారల నిందించుచుండెను. ఇతడు గొప్ప కుటుంబి గనుక నాతని కుటుంబములో దాదాపు యేబదిమంది దనుక పుత్రులు, పుత్రికలు, అన్నదమ్ములు, బావలు, మేనమామలు బంధువులు గల్గియుండిరి. అతడామె భక్తి ప్రయోజనము లేనిదనియు, వితంతువు వెంట్రుకలుంచుకొనుట లోకసమ్మతము గాదనియు, అది దురాచారమనియు, అట్టివారికి భగవద్భక్తి నిజముగా సిద్ధించదనియు, కులరూప, యౌవనములు గల వనిత కులాచారముననుసరించి కుటుంబమున నుండక నిరభిమానముగా దిరుగుట నిందార్హమైన చర్యలనియు జెప్పుచు నామెను పలువిధముల దూషించుచుండెను. ఇట్లుండియు వాడు తన క్రోధమును మనసులోను దాచుకొనలేక ప్రక్క యింటనున్న యామెకు శ్రమగలుగ జేయనారంభించెను. తనయింటిలో నందరును కుడిచిన వెనుక యుచ్చిష్టమైన యాకులనామె పూలవనమున వేయుమని యింటిలోని వారితో జెప్పెను. అయినను వెంగమాంబ యాదుష్టుని చేష్టలను సహించుకొని వానికి బోధజేయనెంచినను యహంకార పూరితుడగు రామయ్య దీక్షితులామె బోధనను వినక దురాకృతమైన వార్తల జెప్పుచు తన దుష్కార్యమును పట్టుగా జేయుచుండెను. ఇట్లుండగా నొకనాడామె తన యింటివెనుకనున్న పూలతోటలో నుండగా అక్కారామయ్య దీక్షితు లెంగిలి విస్తరుల నామెపై వైచెను. అది జూచి వెంగమాంబ కినిసి 'ఓ పాపీ! నీవు నీ వంశము నాశమగు గాక'యని

శపించెను. ఆహా! ఆ దేవతామణి వాక్రుచ్చిన కొన్ని నిముషములలోనే యాతని కాపదలు తుఫానువలె సంభవించనారంభించెను. రావణుని దశశిరములు రాముని బాణప్రయోగముచే చెట్టునుండి వ్రాలిపడు నారికేళముల వలె నాతని కుటుంబ సభ్యులు వలవలయని చావనారంభించిరి. కొందరు వ్యాధిగ్రస్తులై పడకల జేరిరి. కొందరు మూర్ఛపోయి యట్లే గతులైరి. కొందరు వెఱ్ఱులైరి. కొందరు విషూచిచే చచ్చిరి. ఇట్లు కొలది కాలములోనే దాదాపుగా నందరును యాకులు రాలినట్లు రాలిపోయిరి. వేరు తెగిన వృక్షమువలె దీక్షితులును పంచేంద్రియము నుండి రక్తము ధారలు గట్టి భూమిపైబడి ప్రాణములను గోల్పోయెను. ఇట్లు జరుగుచుండగా శేషించిన యొక్కడు మాత్రము వెంగమాంబ యింటికి వచ్చి కన్నులలో నీరు నింపుకొని యామె నిరుపమానమైన చరణ సరోజములబడి గాద్గద్యముగా నిట్లు ప్రార్థించెను.

కం॥ తల్లీ చేసిన తప్పుల
నుల్లంబున నుంచుకొనక నుత్తమమతివై ।
చల్లగ నన్ను క్షమించి యం
కొల్లగ రక్షించవమ్మ కోమల వల్లీ!

కం॥ శరణంబంటిని నాపై
కరుణించుట ధర్మమమ్మ ఘన వెంకమ్మా!
బరువుగ బ్రతిమాలుచు మీ!
చరణంబుల బడెదనమ్మ క్షమియింపగదే!

అని ప్రార్థించగా వెంగమాంబ దయతో వానిని జూచి యిక నీ కుటుంబము యేకప్రాణి మాత్రమై నిలచిపోవునని శాపమును మరలించెను. (రామయ్య దీక్షితుల వంశమిప్పుడరణ్యమున నొంటరి వృక్షము వలె యేకప్రాణి మాత్రమై యుండెను.)

## శ్రీ వేంకటేశ్వరులకు వెంగమాంబ హారతి నేర్పరచుట

ఇట్లుండగా వెంగమాంబ శ్రీ వేంకటేశ్వరులకు కర్పూరహారతి నొకటి యేర్పాటుజేసి యాహారతిని తానే తీసుకొనిపోయి ప్రతిదినము శ్రీనివాసునికి నివేదించి మరల వచ్చుచుండెను. హారతితట్టను చేత ధరించి వెంగమాంబ శ్రీ శేషాచలేశ్వరుని కోవెలలోనికి ప్రవేశించి వెలలేని రత్నములచే హత్తించిన యాభరణ జాలములచేతను, గంధ, కస్తూరి, కుంకుమపూలు, పచ్చకర్పూరాది దివ్యపరిమళములచేతను, వివిధ దివ్యపుష్పరాశిచేతను, అత్యున్నతమైన పట్టుపీతాంబరములు చేతను అలంకృతుండై యాశ్రయించిన భక్తజనులకు కల్పవృక్షము వలె సకల కామితఫలప్రదుడై, పరమ దయాసముద్రుడై, ధగద్ధగాయమానుండై ప్రకాశించుచున్న శ్రీవేంకటేశ పరబ్రహ్మమూర్తికి శిరఃపాదపర్యంతము శాంతముగా నివేదించి కరుణారసపూరితుని పూర్ణదృష్టిచే దర్శించి మనస్సనెడి జలధిలో భక్తి తరంగములుత్పన్నములు కాగా, యానందమనెడి గాలివీచగా, నమృతమనెడి నురుగులు బుద్బుదములు జనితములై వ్యాపించగా, పరబ్రహ్మానందముచే వెంగమాంబ మనోబుధ్యాంత రంగములు కోటిచంద్రుల చల్లదనము కొల్లలాడగా నామె హారతి యా బ్రహ్మానంద విభవమును భరింపజాలక అట్లే మేను మరచినదై కదలక మెదలక తనలో జ్ఞాన భానునియందుంచిన దృష్టిని వదలక భూమిపై నిలిచినదై బ్రహ్మాండభాండములకు యీశ్వరుడైన శ్రీ వేంకటేశుని దర్శించి బ్రహ్మానంద మత్తచిత్తయై మరల యింటికి బోవుచుండెను. ఆమె మహాభక్త శిరోమణియగుట చేత కోవెలకధికారులందురును ఆమెను నిరాక్షేపంగా దేవస్థానములోనికి బోయి యామె యిచ్ఛవచ్చినంత కాలముండుటకు సమ్మతించి యుండిరి.

## శ్రీ వెంగమాంబ హారతి యాక్షేపింపబడుట

అయినను ఆ కోవెల యర్చకులలో కొందరికి మాత్రము కేవలము స్త్రీకింత స్వతంత్రము దేవస్థానమందిచ్చుట సరికాదని యామె హారతి

విషయమై కొంత యసూయ గలిగియుండెను. ఇట్లుండగా నొకనాడు దేవస్థానములో నర్చకులు భగవంతునకు సకలాలంకారములంజేసి ముగించిన వెంటనే వెంగమాంబ తన హారతిని దీసికొని దేవస్థానములోనికి వచ్చెను. అప్పుడసూయాపరులైన యర్చకులామెను జూచి కోపము గలవారై యీ యన్యాయమున కేమి జెప్పవచ్చును? మొట్టమొదటనే యీ వితంతువు లోపలకు వచ్చుచున్నదే, ఎంత భక్తురాలైన నేమి యాధిక్యత గలదు? వితంతువు పూజ మొదట గావలెనా? నేటికి పోనిమ్ము. రేపు మొదలు యీమెను లోనికి రానివ్వక తరుమవలెనని నిందించిరి. వెంగమాంబ యానాడావచనములు నాలకించినప్పటికిన్ని యెప్పటివలెనే యాలోకేశు నారాధించి తన యిల్లుజేరెను.

## వెంగమాంబ యింటికడ శ్రీ వేంకటేశ్వరు రథము నిలచిపోవుట

మరుసటి దినము వెంగమాంబ హారతి దీసికొని క్రమప్రకారముగా కోవెలలోనికి రాకపోయెను. అది తెలిసికొని అర్చకులొకరినొకరు ముచ్చటించుచు 'మిత్రులారా! చూచితిరా! నిన్నటి దినము మనము మాటలాడుకొన్నది యావితంతువు వినినట్లున్నది. అందువల్లనే నేడు హారతి దీసికొని రాలేదు. మంచి పనియైనది. ఖండితముగా మనము చెప్పని కారణముననే యింతవరకు నామెలోనికి వచ్చి యిచ్చానుసారముగా వర్తించుచున్నది' అని మాట్లాడుకొనిరి. ఇట్లుండగా నాటి దినము శ్రీనివాసమూర్తికి రథోత్సవము జరిపించవలసి యుండుటచేత నర్చకులు భగవంతుని మేరుగిరి తుల్యముగా రత్నకాంచనములచే చేయబడిన కల్పవృక్షవాహనము నందారూఢునిగాజేసి మంగళవాద్యములు మొరయుచుండ తిరువీథుల చుట్టుకొని వచ్చుచుండిరి. అప్పుడు భక్తాంబుధిచంద్రుడైన శ్రీనివాసుడు వేంచేసియున్న రథముత్తర మాడవీథి యందున్న శ్రీ తరిగొండ వెంగమాంబ యింటివద్దకు వచ్చిన వెంటనే యిటునటు కదలక స్థాయిగా నిలబడిపోయెను. అప్పుడు రథము నీడ్చుచున్న

పనివాండ్రు మితిలేని యాశ్చర్యము నొంది తమవల్ల యైనంతవరకు నా రథమును లాగ ప్రయత్నించిరి. కాని యది మేరుపర్వతమున కన్నను కడుస్థిరముగా నిలిచినదై యించుకైనను యటునిటు కదలకపోయెను. అదిచూచి యర్చకులు బిత్తరపోయినవారై గుంపులుగా గూడి శక్తికొలది లాగి సవాలులంచేసిరి గాని యదియొక యణుమాత్రమైనను ముందుకు రాకపోయెను. రథమునీడ్చిన శ్రమచే నర్చకుల భుజములకు చాల బాధకలిగెను. పిమ్మట వారెల్లరను పిలిచి రథమును లాగజేసిరి. అయినను నది కదలలేదు. అశ్వములు, నేనుగులు మొదలగు జంతువులతో లాగించిరి. కాని లాభము లేకపోయెను. అప్పటికి చాలకాలము గడచెను. రాత్రి రెండు జాములైనను శ్రీనివాసుని యర్చకులు కోవెలలోనికి వేంచేయింపలేకపోయిరి. పిమ్మట నర్చకులు యేమి చేయుటకును పాలుబోక ప్రతిమలవలె కదలక విభ్రమచిత్తులై బహుకాలమొకరినొకరు చూచుకొనుచు నిలచిరి. ఇట్లుండగా వారికి ముందు దినము వెంగమాంబను దూషించిన సంగతి జ్ఞాపకమునకు వచ్చెను. రథము వెంగమాంబ యింటికడ నిలచియుండుటచే నీ సంఘటన వెంగమాంబ వల్లనే కలిగెనని వారికి నిశ్చయమాయెను. ఆమె మహిమను దెలియక దూషించుటచే వారికి భీతి, దిగులు, అందుపై తాపము నొకటి వెంబడి నొకటిగా మనసులో జనింపనారంభించి వారి యుల్లముల వ్రణపరచెను. అప్పుడు వారామెకు జేసిన యపచారమునకు చింతించి వెంగమాంబ పాదములపైబడి తమ తప్పులను క్షమించమని ప్రార్థించిరి.

కం॥ తెలియక తప్పులజేసిన
మలినుల మేమమ్మ చాల మానేరములన్ ।
తలచక క్షమించి కావుము
చెలిమిని యీ రథము బోవజేసియు వేగన్ ॥

ఓ తల్లీ! మానేరములను క్షమింపుము. నీ భక్తి మాహాత్మ్యములను దెలిసికొనలేని పామరులము. శ్రీనివాసుని సేవామగ్నులమేయైనను పాక

పాత్రయందుండు గరిటవలెను, కమలము కడనున్న మండూకము వలెను నా భగవంతుని ప్రభావముల నెఱుగజాలము. మీపై శ్రీనివాసునికింత దయగలదని తెలిసియుండిన మేము మీయందు కడు భక్తిశ్రద్ధలతో నడచుకొనెడివారము. ఓ మాతా! మా తప్పులను క్షమించి రథము తిరిగి యథాస్థానమునకు బోవజేయుము. రాత్రి చాల గడచినది. స్వామి ఆలయము నింకను ప్రవేశింపలేదు. ఇట్లెన్నడును జరిగియుండలేదు. శీఘ్రముగా రథము బోవునట్లనుజ్ఞయిమ్మని ప్రార్థించిరి. అది విని వెంగమాంబ వారిని జూచి, 'నన్ను ఉత్తరు విమ్మనుచున్నారు. నేనుత్తరు విచ్చిన భగవంతుడు వేంచేసియున్న రథము కదులునా?' యనెను. అర్చకులు 'తల్లీ! తప్పక కదులును. భగవంతుని యంతరంగభక్తురాలైన మీరుత్తరు విచ్చిననట్లే జరుగు'ననిరి. అప్పుడు చిరునవ్వుతో వెంగమాంబ తన హారతి దీసికొని వచ్చి శ్రీనివాసునికి నివేదించి యర్చకులను జూచి రథము పోనిండని చెప్పి తన యింటికి బోయెను. అట్లు వెంగమాంబ చెప్పిన మరుక్షణమే రథము పూలబంతివలె కడులేశముగా కదిలిపోయి దేవస్థానము వద్ద నిలచెను. అర్చకులు భగవంతుని కోవెలలోనికి వేంచేయింపుజేసి యది మొదలు ప్రతిదినమును వెంగమాంబ హారతి నెత్తికొని దేవళములోనికి వచ్చిన వెంటనే యర్చకులామెకు భృత్యానుభృత్యులై నమస్కరించుచు నామెకు గావలసిన యుపచారములు జేయుచుండిరి.

## శ్రీనివాసమూర్తి వెంగమాంబ యింటికి వచ్చుట

వెంగమాంబ రాత్రులందు తన గృహకృత్యములను ముగించుకొన్న వెనుక తనయింటిలో నొకచోట కూర్చుండి చేతియందు తాళమును దాల్చి కడు నిర్మలముగా శ్రీనివాసునిపై మనోహరమైన స్తోత్రములు, కీర్తనలు, పద్యములు మొదలగునవి పాడుచుండెను. ఆ స్తోత్రపాఠములు వినుటకు కడు మనోహరముగను, కుతూహల ప్రదముగను, పరవశకరముగ నుండును. ఆ స్తోత్రములు వినిన భక్తజనుల స్వాంతములానందముచే

రంజిల్లినవై శాంతమయమని గ్రహించి ఆ ఆనందమును తనయందే స్థిరముగా నుంచుకొనియున్నట్లు చలనరహితమై యాస్తోత్రములందే నిమగ్నమై యుండెను. శ్రీనివాసమూర్తియే యాకీర్తనముల నాలకించి పరవశమగుచుండెను. వెంగమాంబ పాడిన వెంటనే బ్రహ్మానందముచే నతిశయించినవాడై యామెకు ప్రసన్నుడై సమీపమునకు వచ్చి నిలుచును. ప్రతిరోజును యర్చకులు గుడి తలుపులు మూసిన వెంటనే వేంకటరమణుడు వెంగమాంబ యింటికి వచ్చి యామె యెదుట నిలచి యా స్తోత్రములకు పరవశుడై యాడుచు "గోవిందం బ్రహ్మానందం" అని యానందముచే వూగులాడుచు నా యోగీశ్వరి సాన్నిధ్యమందే యుండెను. లోకైకనాథునే రమింపజేయగల వెంగమాంబ తన యెదుట సుప్రసన్నుడై యున్న వేంకటేశుని చేతులతో సూచనలు జేసి వర్ణించుచు, సర్వాంగముల పూజించుచు సుగంధపుష్పముల పరమేశునిపై జల్లుచు పరబ్రహ్మయైన శ్రియఃపతిని కొనియాడుచుండెను. ఇట్లుండగా నర్చకులు దేవస్థానములో సన్నిధి ద్వారములు దెఱచు వేళకు వేంకటేశుడు మరల యథాస్థితిగానుండి భక్తజనులకు దర్శనమిచ్చుచుండెను.

## వెంగమాంబ శ్రీ వేంకటేశ్వరులతో వాదించుట

ఈ ప్రకారముగా జరుగుచుండగా నొకనాడు నారాయణుడు సన్నిధి తలుపులు అర్చకులు తాళము వేసినంతనే వెంగమాంబ యింటికి వచ్చి యామె కభిముఖంబున నిలుచుని స్తోత్రములు వినుచు నానందముచే సొక్కుచు నాడుచుండెను.

మత్తకోకిల : అందమైన ముకుందు డాతరియాడుచుండగ వేడుకన్
చంద్రశేఖరుడాది దేవత జాలమెల్లను భక్తిచే
వందనంబులు జేయుచున్ సురవార్ధి చంద్రుని నాట్యమున్
సందు గొందుల దాగిచూచియు సంతసిల్లిరి హెచ్చుగా

మత్తకోకిల : ఎందుజూచిన శోభనంబుల చిందులాడిన వారిగా
సుందరాంగులు నాడు చుండగ శుభ్రమైన తరంగముల్
పొందియాస్థలమందు కాంతులుపొంగుచున్ మెఱయంగ గో
వింద శ్రీహరి యంచు పాడుచు వేడ్కనాడిరి దేవతల్.

అప్పుడు పరతంత్రుడు ధరించిన పూలమాల లుయ్యాలలూగునట్లాడు చుండెను. శేషాద్రీశుడు ధరించిన యాభరణములలోని నవరత్నకాంతులా తేజోవంతుడు నిలిచిన స్థలమునకు చుట్టు ప్రదేశమున ననంతశోభన పుంజములై చిందులాడుచుండెను. ఆ కరుణాకరుని వినీలశరీరకాంతులా యెడ ధగధగ మెఱయుచుండెను. ఆ పరమాత్ముడాడుచున్న యా పుణ్యప్రదేశము కైలాసమో? వైకుంఠమో? లేక సత్యలోకమా యనునట్లు పరమపవిత్రస్థలమై యనంతకోటి దివ్యతేజములతో కొల్లలాడుచుండెను. అట్టి తరుణమున వెంగమాంబ యా పరమ తాండవమూర్తి జూచి "ననుగన్నయ్యా! నా మనవి యొకటిగలదు. ఆలకించెదవా" యని యడిగెను. అందుకు శ్రీధరుడు వల్లె, యనెను. "భక్తులందు నిత్యానురాగముగల గోవిందా! నేను వండి పెట్టిన భోజనమును దినుచు, నాకడనే నివసించుచు నేబోయిన తావుల సహాయుడవై వచ్చుచు క్షణమేనియు నన్ను వీడకుము సర్వేశా! నా యీ కోర్కెను నీతో చెప్పక మఱియెవ్వరితో చెప్పగలన"ని ప్రార్థించెను. అందుకు నిత్యమంగళవిగ్రహుడు దరహాసముతో నామెను గాంచి "ఓ జననీ! నన్ను దలచినట్టియు, ధ్యానించునట్టియు, వెదకునట్టియు, కొనియాడునట్టియు, పిలుచునట్టియు నా ప్రభావములు, నిత్యము పొగడుచుండునట్టియునైన భక్తులీ యండపిండ బ్రహ్మాండ భవనములందెన్ని కోట్లున్నారు? నీ వద్దనే నేనుండిన వారికడకు బోని కారణమున వారికి క్లేశము జనించదే" యని సర్వస్వతంత్ర పరతంత్రుడైన భగవంతుడు పల్కెను. అది విని వెంగమాంబ స్వామిని జూచి "యో జగత్పితా ఈ తంత్రవాక్యములు నాతో జెప్పిన నేనొల్లను. నీ యథార్థము నేనెఱుగుదును. నీవు సత్తామాత్ర

శరీరుండవు. ఆదిమధ్యాంతరహితుండవు. స్వయంప్రకాశుండవు. జగదీశుండవు. అఖిలాండాకార వృత్తిచే ప్రకాశించువాడవు. మంగళ స్వరూపుండవు. విస్ఫురనిరతిశయ ప్రభావుండవు. జ్ఞానస్వరూపుండవు. పరంజ్యోతి స్వరూపుండవు. మిక్కిలి మహిమలు గలవాడవు. అట్టి నీవు నాయొద్ద స్థిరముగా నుండియు బ్రహ్మాండ భాండములయందంతటను, పరమాణువునందును నిండినవాడవు. 'అణోరణీయాన్, మహతో మహీయాన్' అను యుపనిషద్వాక్యము రీతిగా నణువుగను, నఖండముగ నున్నావు. అట్టి మహత్ప్రభావము గల నీవిట్లు కపటములు బల్కిన నేనొప్ప"ననెను. అందుకు పున్నమచంద్రునివలె నమృతకళలుదీపించగా మందహాస ముఖారవిందుడైన గోవిందుడు వెంగమాంబను జూచి "మాతా! జగన్నాటక సూత్రధారుండనైన నాకు నీ వద్దనే యుండుట కవకాశ మెక్కడి" దనెను? అందుకు వెంగమాంబ "స్వామీ! నీవు సకలప్రవర్తకుండవు. మరల కేవల సాక్షీభూతుండవు. నీ మాయ నెఱుగ నీకే దరము. నీ జగజ్జాలముల నెరుగ నేరికిని దరము గాదు. అట్టి మహిమలు గల నీవు నాకిట్టి తంత్రవార్తలు జెప్పిన నేనెంతమాత్రము సమ్మతించను. నిన్ను సదా లక్షించుచుండుటకు నాకు బ్రహ్మాండమంత గొప్ప యాశ యున్నది. నా మనవి నంగీకరించి కావవలెను. లేకున్న నిన్ను విడువనోప"నని వాదించుచుండెను.

### వెంగమాంబ హరిపీతాంబరమును పట్టుకొనుట

ఇట్లు సంవాదము జేయుచుండగా తెల్లవార వచ్చుటచే స్వామి సన్నిధిలో నర్చకులు వేంకటేశునికి మేల్కొలుపులు బాడుచుండిరి.

రాగం : భూపాలం - తాళం - అట

పల్లవి : శ్రీ వేంకటేశ్వర - శ్రితజనపారిజాత ।
పరమదయాపర - మేలుకో । స్వామీ! మేలుకో
శ్రీ వేంకటేశ్వర మేలుకో ॥

అ.ప॥ దేవేంద్రమరుదర్కరుద్రా శరణ్యా!
శ్రీదేవి మనోల్లాస - మేలుకో శ్రీ వేంకటేశ్వర మేలుకో ॥

చ॥ 1) ఆధారమందున - అమరగణాధిప ఆరాధించెదమయ్యా - మేలుకో
శ్రీధర మాధవ శ్రీనివాసస్వామీ మేలుకో ॥
శ్రీ వేంకటేశ్వర మేలుకో ॥

2) స్వాధిష్ఠానమున సర్వాత్మబీజమై సంభ్రమించు స్వామి మేలుకో ।
వేదాంతమునులచే వెలయుచున్న శ్రీవేంకటాద్రిచంద్ర మేలుకో॥
॥శ్రీ వేంక॥

3) మణిపూరకంబున మాణిక్యకాంతుల మలయుచున్న జ్యోతి మేలుకో।
ఘనఘనహరిగోవింద నారాయణయని ఘంట మ్రోగెను మేలుకో॥
॥శ్రీ వేంక॥

4) అనాహతంబున - ప్రణవ రవంబులు హంసోహమని పల్కెమేలుకో।
గణాధిప నిన్ను కనులారసేవించ కాచియున్నామయ్యా మేలుకో
॥శ్రీ వేంక॥

5) విశుద్ధమందున - పరిశుద్ధమైనట్టి విశ్వాంతరావాస మేలుకో ।
విశదముగా వెలుగు - రవికోటి సంకాశ శ్రీ వేంకటేశ్వరా మేలుకో॥
॥శ్రీ వేంక॥

6) ఆజ్ఞేయమందున - అమృతకళలతో సమరియున్న జ్యోతి మేలుకో।
ప్రజ్ఞలోన ప్రజ్ఞ - పరిపూర్ణమైనట్టి ప్రజ్ఞాన బ్రహ్మమా మేలుకో ॥
॥శ్రీ వేంక॥

7) వేయిరేకుల మధ్య - వెలలేని రత్నమై వెలుగుచున్న చుక్క మేలుకో
హాయిగా నిద్రాంకశాయి దయతోను, జేయుతముగను మేలుకో॥
॥శ్రీ వేంక॥

8) ఘల్లు ఘల్లుమని ప్రణవకాంతులు గూడి తెల్లవారవచ్చె మేలుకో ।
చల్లని మారుతి కొల్లగా వచ్చెను ముల్లోకరక్షక మేలుకో ॥
॥శ్రీ వేంక॥

9) గంగ యమునలు గూడి - సరస్వతి పొంగుచు ప్రవహించె మేలుకో।
రంగుగా చేపట్టి - రంగ ప్రకాశుని రక్షించు వేలాయె మేలుకో॥
॥శ్రీ వేంక॥

ఇట్లు మేల్కొలుపులు బాడియర్చకులు తలుపులు దెరువ వచ్చిరి. అందుచే శ్రీనివాసులు వెంగమాంబను జూచి "అమ్మా! నేను పోయి యిక ప్రపంచజనులకు దర్శనమివ్వవలె"ననెను. వెంగమాంబ దిగ్గన పైకి లేచి యా లీలావిగ్రహుడు ధరించిన పట్టు పీతాంబరము నొకప్రక్క దృఢముగా పట్టుకొని "నా స్వామీ! నాకు తగిన యుత్తరమీకున్న నిన్ను విడవను. నా కడ నీకపటము జెల్లదని చెప్పుచు తాను చేతబట్టియున్న పీతాంబరమును లాగ నారంభించెను. ఆ తరుణమందు కోవెల వాకిండ్లు తెరువబడుటచే శ్రీవేంకటేశ్వరుడు వెంగమాంబ యింటనుండి దిగ్గున నంతర్ధానము నొంది కోవెలయందు మూలస్థానములో తేజోమయమైన పరబ్రహ్మాంబై యథాగతి ఆ భక్తులకు దర్శన మిచ్చెను. అప్పుడు వెంగమాంబ చేత చిక్కుపడిన పీతాంబరము సగము చినిగినదై యొక యంచుతో గూడ నామెచేతియందే నిలచినది. హరి తన్ను విడనాడి పోయినందుకు వెంగమాంబ కొంత తడవు యోచించుచుండి చేతనున్న పట్టుపీతాంబర శేషమును చెండుగా జుట్టి కన్నులనొత్తికొని తన యింటి యందొక గదిలో భద్రపరచెను.

## అర్చకులు విభ్రమము నొందుట

ఇట్లుండగా నర్చకులు తలుపులు దెరచి లోనికి ప్రవేశించి చూడగా శ్రీనివాసుడు ధరించిన వస్త్రము చినిగినదై సగభాగము కానకయుండెను. అందుకు వారాశ్చర్యమునొంది యే కారణమున నిట్లు సగము చినిగినది?

యెవ్వరేని దోచుకొనియుందురా? యని పరస్పర మాలోచించి యా విషయము ఆ కాలమందున్న దేవస్థానాధికారితో జెప్పిరి. వారది విని మిక్కిలి యాశ్చర్యమునొంది దిగ్గున బయలుదేరి యా వింత సంఘటనను వింతగా జూచి విభ్రమమునొంది కారణమేమిటని దీర్ఘముగా నాలోచించుచుండెను. ఇట్లుండగా కొంతకాలము తరువాత వారర్చకులను జూచి శ్రీనివాసుని పీతాంబరశేషము దోచుకొనిపోయి యుండరనియు, అది పరమభక్తుల యింటనే యుండవలెననియు, వెదకి చూడుడనియు చెప్పెను. అప్పుడర్చకులు కొంత యోచించి యీ కలియుగములో వెంగమాంబ కన్నను భక్తశిరోమణులుండబోరని తలచి యా సంగతి వెంగమాంబ నడిగెదమని యుద్దేశించి గుంపులుగా గూడి యామె యింటికి బోయిరి.

## అర్చకులు వెంగమాంబను విచారించుట

అర్చకులు వెంగమాంబ యిల్లు జేరి సాష్టాంగప్రణామము లొనర్చి యామెకీ విధముగ జెప్పిరి "తల్లీ వేంకటేశుని పీతాంబరమును చింపి సగమెవరో దోచిరి. మీకది తెలియగలదని యడుగ వచ్చితిమి. నిజము మాకు దెల్పగదమ్మా" యని ప్రార్థించగా విని వెంగమాంబ వారల జూచి "అదిగో! ఆ గదిలో నున్నది. తీసుకొని పొండని" చెప్పెను. ఆ మాటల కర్చకులు విస్మయముచే తడబడుచున్న స్వాంతములు గలవారై వేగముగా గదిలోనికి ప్రవేశించి పీతాంబరము నెత్తి చూడగా నది చిరిగినది గాక పూర్తిగా రెండంచులతో గూడి రంగు నిగ్గులచే ప్రకాశించుచుండుటచే నది శ్రీనివాసుని పీతాంబరముగా నుండునేమోయని శంకించి పరిశీలించి చూడగా నందు శ్రీనివాసుని పీతాంబరము యొక్క గుర్తులు సంపూర్ణముగా నుండుటచే నోరాడ తడబడుచు వెంగమాంబ వద్ద శలవు దీసికొని వేగముగా బోయి శ్రీనివాసుని సన్నిధికి బోయి జూడగా శ్రీనివాసుడంతకు బూర్వము ధరించి యున్న పీతాంబర శేషమును కానరాకపోయెను. అదిజూచి యర్చకులు యేమిజెప్పుటకును నోరురాక శ్రీ వేంకటేశ్వరులకును,

వెంగమాంబకును మానవగోచరము గాని విశేషములు జరుగుచున్నవని తలంచి తమ స్వామి నానంద బాష్పములచే నిండిన కన్నులతో స్వామి ప్రభావమును చెప్పజాలక "జేజే వేంకటేశ్వరా! జేజే పరమ దయాళో! నీకన్న నిజదైవంబు లేరు. నీకన్న రక్షకులు లేరు. నీకన్న లోకనాథుడు లేడు" అని మైమరచి యుత్సాహముతో నా స్వామికి సహస్ర కలశాభిషేకము జేయించి వెంగమాంబవద్ద నుండి దెచ్చిన పీతాంబరమును గట్టి కర్పూరనీరాజనము నిచ్చి సత్యసుందరాకారుని కన్నులార గాంచి, మంగళస్తోత్రముల బాడిరి. అప్పుడు బైరాగీ సాధువులు జే బాలాజీ । జే బాలాజీ అని శ్రీనివాసునికి జయ సంకీర్తనములం జేసిరి.

కం॥ వేంకటగిరి రాజేశ్వర ।
సంకటహర పద్మనాభ సమపదనుయా!
శంకర సురపతి సన్నుత!
పంకజవర యంఘ్రియుగళ పరమదయాళో॥

## వెంగమాంబ శ్రీ వేంకటేశ్వరులకు భోజనంబిడుట

వెంగమాంబ పూర్వము శ్రీనివాసునడిగిన విషయముల తన కను గుణ్యముగా జేసికొని యుండుట చేత తన యింటిలో సకలవిధభక్ష్యముల పచనము జేసికొని వాటిని దీసికొని స్వామి కోవెలకు తూర్పునకు ఉత్తరముగా నర్ధమైలు దూరములోనున్న పాండవతీర్థమునకు (పాండవులు రాజ్యమును బోగొట్టుకొని వేంకటాచలమునకు వచ్చి యీ తీర్థములో స్నాన మాచరించుకొని, వేంకటేశ్వరుల కటాక్షమునకు పాత్రులై శత్రుజయమును, తిరిగి రాజ్యభోగములను బొందిరి. కనుక దీనికి పాండవతీర్థమని పేరు గల్గినది.) చెంగటనొక శుభ్రస్థలమును జూచి యచ్చట కూర్చుండి తంబుర మీటుచు భక్తిరసభరితంబైన కీర్తనలచే వీణావినోదగానలోలుని ధ్యానించ నారంభించెను. ఆ దివ్యగీతములు విని శుకపికమరాళ కోయిలాది పక్షులు మైమరచి యా గీతములను వినుచుండును. మయూరములు పురివిప్పి

యప్సరసలు దేవసభలో నాట్యమాడినట్లు యాడజొచ్చెను. శ్రీనివాసుడా గీతముల కానందించి యామె యొద్దకొక్కక్క సమయమున నొక్కొక్క రూపముతో వచ్చుచుండెను. ఒకప్పుడు మత్తగజమువలెను, సింహమువలెను, వేరొకప్పుడు భల్లూకమువలెను, వ్యాఘ్రమువలెను వచ్చి యామెను బెదరించుచుండెను. ఇట్లుండ శ్రీనివాసుడొకనాడు గొప్ప వ్యాఘ్రరూపముతో భూనభోంతరములు ప్రతిధ్వనించునట్లు బొబ్బరించుచు ఆమె చెంగటకు మహా క్రూరముగా వచ్చెను. అది జూచి వెంగమాంబ "ఓ లక్ష్మీనాథా! నీ వేషమును నేనెరుగుదును. నీ కూతలు నేనెఱుగుదను రమ్ము! రమ్ము! నీ ఘోరాకారమును విడచి సౌమ్యుడవై వచ్చి యీ భోజనమును దినిపొమ్మని" చెప్పెను. శ్రీనివాసుడప్పటికి నేమియు నెరుగని వానివలె నామె సమీపమునకు వచ్చి బొబ్బరించుచు కోరలదెఱచి యాకలిగొన్న దానివలె నామెపై బడి గోళ్ళతో చీల్చునట్లభినయించుచుండును. ఆమె అప్పటికిని వెరువక "ఓ వేంకటేశా! నీ వేడుకను చాలించుము. నిన్ను నే నెరుగుదును. యీ జాలముచేత నన్ను బెదిరించకుము" అని చెప్పుచుండెను. ఇట్లామె సమీపమున తన వేషములనన్నింటిని జూపుచు తుదకు శ్రీవత్సలాంఛనుడై, కరుణామూర్తియై దర్శనమిచ్చెను. వెంగమాంబ యప్పుడా తేజోమయమూర్తికి సుగంధ ద్రవ్యములచే నలుగుపెట్టి, కస్తూరికా తిలకమును దిద్ది, కర్పూరహారతులనిచ్చి శ్రీశుని పాదరాజీవములను ముద్దులు గొని పిమ్మట తాను దెచ్చిన యరటి యాకునందు సకలవిధ భక్ష్యములను, సకల ఫలరస శర్కర, నారికేళ దివ్యోదకపాయసములను వడ్డించి, వాటిని తినిపించి, జగన్మోహనుని తృప్తి పరచి తాంబూలములనందించి, మంగళస్తోత్రముల బాడి మెప్పించి పిమ్మట స్వగృహమునకు బోవుచుండును.

### కోవెలయధికారులు వెంగమాంబను పరిశోధించుట

ఇట్లు జరుగుచుండగా కోవెల యధికారులలో కొందరు వెంగమాంబ ప్రతిదినము భోజనమును దీసికొని యడవి మార్గమున బోవుటకు

హేతువేమియని యోచించి యా కారణమును గనిపెట్టుటకు నిశ్చయించిరి. ఒకనాడామె భోజనము దీసికొని బోయిన తదుపరి వారును వెన్నంటిపోయిరి. కొంతదూరము పోయిన వెనుక వెంగమాంబ యొక శుభ్రప్రదేశమున గూర్చుండెను. కోవెల యధికారులు కొంతదూరమున దాగి చూచుచుండిరి. కొంతసేపటికొక బెబ్బులి పిడుగులు పడినట్లు ఘర్జించుచు వారు దాగియున్న ప్రదేశమునకు ప్రక్కగా చెట్టు చేమలను చిందర వందర జేయుచు పరుగిడి వచ్చెను. దానికి భయపడినవారై వారిలో కొందరు మూర్ఛిల్లిరి. మఱియొక క్షణమునకంత నా వ్యాఘ్రము వెంగమాంబపై కెగురంబోయెను. అదిజూచి మూర్ఛనొందక యుండిన యొకరిద్దరు వెంగమాంబ మృతి నొందెనేమోయని భ్రమించిరి. ఆ బెబ్బులి యామె చెంగట మహాక్రూరముగా చిందు లాడజొచ్చెను. అదిజూచి భయభ్రాంతులై మిగిలినవారును మూర్ఛనొందిరి. అప్పుడు వెంగమాంబ యథాగతిగా శ్రీనివాసునకు భోజనంబిడి పరంధాముని ధ్యానించుచు మరల నిల్లుజేరెను. నాటి యర్ధరాత్రమునకు మూర్ఛితులు తెలివినొంది వెంగమాంబ మాహాత్మ్యమేమనవచ్చు! ఆ బెబ్బులి శ్రీమన్నారాయణుని యవతారమే గాని యొండుగాదని చెప్పుకొనుచు చీకటిలో దారి తెలియక "వెంగమాంబను పరిశోధింప వచ్చిన తమ యపచారమును మన్నింపుమనియు, దారిజూపుమనియు, అపరాధ శుల్కము చెల్లింతుమనియు, వేంకటేశ్వరుని ప్రార్థించి తమ గృహములను జేరిరి. అది మొదలు వెంగమాంబ మహిమల గొనియాడుచు ననేకవిధ పక్వాన్నములను శ్రీనివాసునికి నివేదించుచు నత్యంత ప్రీతితో నారాధించు చుండిరి.

ఆ॥ వేంకటేశ! నిన్ను వెదకి పూజించిన
సంకటములు బాయు సంభ్రమునగను ।
పంకజాక్ష నిన్ను పాడిన వేడిన
సకల దోషచయము సమసిపోవు ॥

## శ్వేత నాగేంద్రుడు వెంగమాంబకు నీడ నిచ్చుట

శ్రీ వెంగమాంబ తన బృందావనములోనున్న యొక విశాలమైన బండపై (ఆ బండ నేటికిని శ్రీ వెంగమాంబ బృందావనములో పడమరగా అతి సమీపములో నున్నది) పద్మాసనాసీనయై వేంకటేశుని దలచి మేనిని మరచి యుండగా నొక దేవతాంశమైన శ్వేతసర్పము తన పడగనీడ నామె శిరమునకు ఛత్రమువలె బట్టుచుండెను.

కం॥ నాగేంద్రుడు తన పడగల
బాగుగ శ్రీ వెంగమాంబపై నిడుకొనియిున్ ।
భోగముగ నాడ పువ్వుల
వేగమె వర్షించి రంత వేడ్కతో యమరుల్ ॥

ఒకనాడు పరబ్రహ్మమునందైక్యము జెందియున్న నామె శిరముపై తన పడగ నటునిటు యాడించుచు "హరిః ఓం, హరిః ఓం" అనునట్లు బుసలెట్టుచుండెను. మరికొన్ని వేళల నామెకు చెమటగల్గునేమోయని యలసట దీర్చుట కామె ముఖారవిందమునకు చల్లని గాలిని విసరునట్లు బుసవెట్టుచుండెను.

## వెంగమాంబ హారతి శాశ్వతమగుట

ఒకనాడు మాధవుడు వెంగమాంబ యింటికి వచ్చి సంభాషించుచుండగా నామె యా పురుషోత్తముని సుందరాననమును జూచి స్వామీ! కరుణామూర్తీ! నిన్ను దలచిన వారికి యమభయము లేదు. నీ భక్తులకు భవభయము లేదు. నిన్నాశ్రయించిన వారికి వ్యథ, నిన్ను కొనియాడిన వారికి మాయాంధకత్వమును లేవు కనుక శాశ్వతమూర్తీ! పంచవింశతి తత్త్వమేళనమైన నా యీ దేహమును నేత్యజించి నన్ను నాపేరు నీ కోవెలయందు శాశ్వతముగా నుండునట్లొక యేర్పాటు చేయవలయుననెను. అందులకు భగవంతుడు మందహాసముతో మారు

మాట్లాడక వెడలిపోయెను. ఇట్లుండ నాటి రాత్రి వెంగమాంబ స్వామికి హారతి నెత్తుకొనిపోగా యా హారతిలో శ్రీనివాసుని విరాట్స్వరూపము ప్రతిబింబితమై యామెకు కనబడెను. కాబట్టి వెంగమాంబ తన హారతిని శ్రీ వేంకటేశ్వరులకు ప్రతిదినము వచ్చునట్లును, అది శాశ్వతముగా శ్రీవారి కోవెలయందు జరుగునట్లును యేర్పాటు జేసిరి. అందుకు శ్రీ వేంకటేశ్వరులు సంతసించినవారై యామె హారతిని యంగీకరించి యా హారతి ప్రతిదినము రావలయుననియు, అట్లామె హారతిరాకున్న కోవెలలో రాత్రి తీర్మానము జేయగూడదనియు నర్చకులకు స్వప్నములో గన్పడి యాజ్ఞ యిచ్చెను. వెంగమాంబ తన హారతిక్రమము దప్పక తన యనంతరమును జరిపించుటకు గాను తన చెల్లిలి పుత్రికను దత్తుగా దీసికొనెను. (ఈమె దత్తపుత్రిక పేరు మంగమ్మ నేటికిని మంగమ్మ సంతతి వారే శ్రీ వేంకటేశ్వరులకు ప్రతి దినము శ్రీ వెంగమాంబ హారతిని దీసికొని వచ్చుచున్నారు)

**అర్చకులు వెంగమాంబ హారతి నాక్షేపించుట**

ఇట్లుండగా వేంకటేశ్వరులు అర్చకులకు స్వప్నములో వెంగమాంబ హారతి రాకున్న దేవస్థానములో రాత్రి తీర్మానము జేయగూడదని చెప్పిన దినము మొదలు వారు మిక్కిలి క్రోధస్వాంతులై "అయ్యో! ఇదియేమి న్యాయము!? భగవంతుడే వితంతువు హారతిని గొనుచున్నాడే, ఇచ్చట విద్వాంసులు లేరా? సద్బ్రాహ్మణులు లేరా! ధనవంతులే లేరా? రాజులే లేరా? అట్టివారి హారతి వచ్చిన నెంత ఘనముగా నుండును? వెంగమాంబ కేవలము వితంతువు. అందునను సకేశవతియై మంగళ స్త్రీవలె వర్తించు దురాచారవతి. చెడిపోయినది. అయినను కానిమ్ము. రేపు వెంగమాంబ హారతి దెచ్చుటకు ముందే దేవస్థానములో తీర్మానము జేయించి తలుపులు వేసియుంచెదము. అట్లైన నామె హారతి క్రమముగా నిలచిపోవునని యెంచి మరుదినమదే ప్రకారముగా ముందుగనే తీర్మానము జేసి తలుపులు

తాళములు వేసి తమ నివాసములకు బోయిరి. వెంగమాంబ సకాలమునకు హారతిని దీసికొని శ్రీనివాసుని కడకు వచ్చెను. అప్పుడు

కం॥ మూసిన తలుపుల తాళము
బాసియునొక క్షణములోన బాహాటముగా।
దీసుక వికసించియు గడు
భాసురముగ దారినిచ్చె భామామణికిన్ ॥

అప్పుడామెలోనికి ప్రవేశించి శ్రీనివాసుని ధ్యానించి నిత్యకల్యాణుని గుణముల గొనియాడి కర్పూరనీరాజనహారతులునిచ్చి తన నివాసమున కేగెను. ఆ విషయము నర్చకులెరిగి విభ్రమమము చెంది యామె మాహాత్మ్యమునకు భీతిల్లినవారై బుద్ధి దెచ్చుకొని యికపై నామెకెట్టి విఘ్నములు గల్పింపరాదని నిశ్చయించుకొని యామె సన్నిధికేగి చరణములపై బడి యిట్లు ప్రార్థించిరి.

కం॥ జననీ తప్పులనెన్నో।
ఘనముగ జేసితిమి చాల కలుషాత్ములమై
వినవమ్మ! యెంత మాత్రమి!
కనుచేయము యణువు దప్పకడ తథ్యముగా!

కం॥ కరణంబని మేమందరు
కరముల నొకటిగను జేర్చి కడు భక్తులమై
చరణంబుల జారంబడి
కరుణకు వేడెదము తల్లి కమలదళాక్షీ!

కం॥ నీ శిశువులు నేరంబుల
జేసియుపడిదముల యందు జేరి భజించన్।
వాసిగ వారిని కావక
గాసిలోబడ వేతువేమొ కరుణయు లేకన్ ॥

కం॥ కావున మమ్ము క్షమించి యం
కావలె సత్కరుణజూచి కడకన్నులతో ।
గోవిందుని సమముగ మిము
దేవునిగా గొలుతు మింక । దివ్యసుధాంబా ॥

కం॥ ఇంకమీద మీదు హారతి
సకలేశ్వరునకును రాగ సన్నిధి తలుపుల్ ।
ప్రకటితముగ బంధించము
సకలాగమ వినుత మాత సత్యసమేతా ॥

అని ప్రార్థించి సుబుద్ధిగల వారై యర్చకులు నాటి దినము మొదలు యాలోకమాత ప్రభావముల గొనియాడుచు శ్రీనివాసునికామె హారతిని ప్రతిదినమిచ్చుచున్నారు. (నేటికి నాక్రమము దప్పక ప్రతిరోజు వెంగమాంబ హారతి రాక దేవస్థానములో యిప్పటికిన్ని రాత్రి తీర్మాన మగుటలేదు.) వెంగమాంబ హారతి వివరం – దీనికి ముత్యాల హారతి యని పేరు. ఒక్కొక్క దినమున శ్రీ వేంకటేశ్వరుల దశావతారములలో నొక్కొక్క రూపమును రజత, ముత్యములచే తట్టలో నమర్చి శ్రీ వేంకటేశ్వరుల యేకాంతసేవ కాలమున కర్పూరహారతి జరుగుచున్నది.

## శ్రీ వెంగమాంబ తుంబురుకోనను జేరుట

ఇట్లుండగా నొకనాడు వెంగమాంబ తన గృహమందు భజనల జేయుచు శ్రీనివాస మూర్తిని జూచి "ఓ జగత్పితా! ఇక యీ మానవుల కండ్లబడ నేనొల్లను. నన్ను నీ పాదపద్మములందైక్యము జేసికొమ్మని" ప్రార్థించెను. అది విని సర్వేశ్వరుడు "ఓయమ్మా! యింక కొంతకాలము నీవు నా క్షేత్రమందే నివసించి నన్నారాధించు చుండుము. తదుపరి నిన్ను నా అక్షయ మంగళపదమందు జేర్చుకొనియెద" ననెను. అందుకా కాంతామణి "ఓ తండ్రీ! నేనిక మానవుల కన్నుకగపడక యుండు మార్గమును

జూపుము" అని వేడగా భగవానుడామె హస్తమును సర్వమంగళకరమైన తన హస్తమున గీలించి యింటి నుండి బయటకి గొని వచ్చెను.

కం॥ వచ్చిరి యిరువురు క్షణములో!
హెచ్చుగ తుంబూరుకోన హేమానదికిన్ ।
స్వచ్ఛముగ సూర్యచంద్రులు
వచ్చిరోయీధాత్రికనగ వైభవమొప్పన్!

ప్రణవశైలేశ్వరుడైన నారాయణుడు రెప్పపాటున వెంగమాంబను దోడ్కొని పండ్రెండు మైళ్ళ దూరములోనున్న తుంబురుకోన వద్దకు వచ్చి యటనొక దివ్యప్రదేశమును జూచి తన తర్జనిని (బొటనవ్రేలు) చూపించగా నొక గొప్ప బిలము తటాలున భీకరధ్వనితో గూడి యుత్పన్నమై దారి నిచ్చెను. నిర్మానుష్యమైన యడవి యందు పరమేశ్వరుడామెను జూచి "మాతా! నీవీ గుహయందు నివసించుచు దీని ద్వారము నుండి నా యొద్దకు వచ్చి యారాధించి వచ్చుచుండుము. నీవిక నా భక్తులకు దక్కనెవ్వరి కండ్లకు నగుపడవు. నిన్ను దర్శించిన నా భక్తులు కృతార్థులౌదురు. నీ చరిత్ర విన్నను, నీ భక్తి మాహాత్మ్యముల గొనియాడినను నీకు నాయందుగల భక్తి ప్రేమాతిశయముల జెప్పుకొని సంతోషించినను అట్టివారు నీవలె నా కత్యంత ప్రియులు. నా కృపకు పాత్రులు. వారి యోగక్షేమముల నిర్వహించు భారము నాది. వారలకు తోడునీడయై యుండి సకలాపదలను దాటింపజేసి దేహమును బాసిన వెనుక పరమ పదమునందు జేర్చుకొందునని చెప్పి కరుణాకరుడు కలకల నవ్వుచు ఆ గుహామార్గముననే దేవస్థానములోనికి వెడలిపోయెను.

## తుంబురుకోన మాహాత్మ్యము

పూర్వము శ్రీరాముడు పితృవాక్యపాలనకై సీతాలక్ష్మణసమేతుడై దండక వనములకు బోయి తిరుగుచు నీ ప్రదేశమునకు రాగా సీతాదేవి దాహమున

కోర్వజాలక తనకు పానీయము నిమ్మని రాముని ప్రార్థింపనాతడు తన ధనుస్సుచే నా తీర్థమును కలుగజేసి సీతాదేవి దాహమును దీర్చెను. తర్వాత కొంతకాలమునకు గంధర్వులకాచార్యుడైన తుంబురు మహర్షి యీ తీర్థమున గ్రుంకుచు దాని ఘట్టమునందుండు యశ్వత్థవృక్షమునకు ప్రదక్షిణ నమస్కారములు జేయుచు శ్రీ వేంకటేశుని ధ్యానించుచుండెను. ఒకనాడు తుంబురుడు తాను జేయు ప్రకారముగా తీర్థమున గ్రుంకి యశ్వత్థమునకు ప్రదక్షిణ నమస్కారములను జేయుమనగా గర్భవతియైయున్న నాతని పత్ని యావిధముగా జేయ సమ్మతించక పోయెను. అందుల కాతడామెనుకోపించి మండూకమై యా తీర్థఘట్టమందుండు యశ్వత్థవృక్షమందు వాసము జేయుము. అగస్త్యముని తన శిష్యులతో నచటికి వచ్చి యా తీర్థమాహాత్మ్యమును శిష్యులకు బోధించుచుండగా విని స్వస్వరూపమును బొందుదువని శాపమొసగెను. కొంతకాలమామె శాపగ్రస్తయై తుదకు అగస్త్యముని వలన శాపవిమోచనమును బొందెను. అనంతరము తుంబురుడు నాతని పత్నియు నా తీర్థమందు స్నానమాడి పరమేశుని ధ్యానించగా శ్రీనివాసుడు ప్రసన్నుడయ్యెను. తుంబురుడు తమ యిరువురకును శ్రీనివాసుని పాదసన్నిధి స్థిరము గావలెననియు ప్రార్థించెను. వేంకటేశుడు వారి యిష్టార్థముల నెరవేర్చెను. ఈ పుణ్యతీర్థమునందు ఫాల్గుణశుద్ధ పౌర్ణమినాడు స్నానమాడి వేంకటేశుని ధ్యానించిన దురిత శాప, విష భవభయ విమోచనము గల్గి పరమ పురుషార్థము సిద్ధించును.

## వెంగమాంబ శ్రీనివాసుని బిలమార్గమున వచ్చి యారాధించుట

విజనము, వితతము, విమలమునైన యాయటవిలో వెంగమాంబ శ్రీమన్నారాయణుని భజించుచు కొండలలో, గుహలలో, ముండ్లపొదలలో, మిట్టపల్లములలో, క్రూరమృగములతో నిర్భయముగా సంచరించుచు శ్రీ వేంకటేశుని గొనియాడుచు యాగుహయందే యుండెను. ఇటనింటిలోనామె కన్పింపకపోవుటచే ప్రజలు పరబ్రహ్మములో నైక్యము జెందెనని తలచి వుత్తర

మాడవీధికి ప్రక్కగానున్న యామె బృందావనమునకు వెళ్ళి దానికి ప్రదక్షిణ నమస్కారముల జేయుచు నామె కీర్తిని గొనియాడుచుండిరి. వెంగమాంబ తుంబురుకోన జేరినది మొదలు బిల మార్గమున వచ్చి వేంకటేశునారాధించి పోవుచుండెను. ప్రతిదినము నర్చకులు కోవెలయందు తీర్మానముజేసి వెళ్ళగనే వెంగమాంబ యచటకు వచ్చి వారుజేసిన యలంకారములను దీసివైచి తాను దెచ్చిన యడవి పూలమాలల నలంకరించుట చేత ప్రతి యుదయమర్చకులు తాము జేసిన యలంకారములు మారియుండుట చేత విభ్రమముతో నేమి జేయుటకును దోచక యా కాలమందుండిన మహంతు ప్రభువుకు విన్నవించిరి.

## మహంతు వెంగమాంబను దర్శించుట

మహంతు యా మాటలను విని మిక్కిలి యాశ్చర్యముతో నారహస్యమును కనిపెట్టదలచి యొకనాటిరాత్రి కోవెల మూలస్థానపు తలుపులు మూయక మునుపే తానొక రహస్య ప్రదేశమున దాగొని భారమంతయు వేంకటేశుని చరణారవిందము లందుంచి కవాటములో నున్న యొక చిన్న రంధ్రము నుండి భగవంతుని జూచుచుండెను. ఇట్లు రాత్రి మూడవ జాము కాగానే దివ్యపరిమళ మొకటి జనించెను. దానినంటి పున్నమి వెన్నెల వంటి కాంతి గల్గెను. అందుండి తరిగొండ వెంగమాంబ యొక హస్తమున తులసియు, నరణ్యములోని పుష్పములును, మరియొక హస్తమున ఫలములను దెచ్చి యా పరంధాముని కౌగిలించుకొని నా ప్రాణాధారమా! నా ముద్దుల వేంకటేశ్వరా! యని ముచ్చటించి యర్చకులు జేసిన యలంకారములను దీసివైచి తన యిచ్ఛానుసారముగా పరమేశు నలంకరించి, తాదెచ్చిన పూలచే పూజించి, ఫలములను దినిపించి, భజనలు జేసి, స్తోత్రములు బాడి మంగళ హారతులనిచ్చి ప్రొద్దుపొడవక మునుపే యెటు బోయినదియు దెలియక యదృశ్యమయ్యెను. అదిజూచిన మహంతు భయకంపములచే తడబడుచు ఓహో! వెంగమాంబ యెచ్చటనో యుండి

మాయగా వచ్చి శ్రీనివాసునారాధించి పోవుచున్నది. హా! తల్లీ! నీ భక్తి నేమనవచ్చును? అని చెప్పుచుండ వేకువజామున నర్చకులు తలుపులు దెఱచుకొని లోనికి వచ్చి మహంతును విచారించగా నతడాశ్చర్యముచే చిత్తవికలతను బొంది పిచ్చివానివలె నేమిజెప్పుటకును నోరురాక ఆహా! ఆహా! యని పలుకుచు తాను జూచిన విశేషమున కాశ్చర్యపడుచుండెను. ఇట్లుండగా నచట వారందరు నీతని నూరడించి మనసును కుదుటపరచి విచారించగా నతడు కొంత మనస్థైర్యమును సంపాదించుకొని గద్గదస్వరముతో జరిగినది జెప్పెను. అది మొదలు భక్తులా లోకమాతను వేనోళ్ళ బొగడుచు నామెను దర్శింపవలెనని యడవులందు వెదుకుచుండిరి.

## శ్రీ వేంకటేశ్వరులు వెంగమాంబ యొద్దకు బోవుట

ఇట్లుండగా నాటినుండి వెంగమాంబ హరిపూజకు గాను దేవస్థానమునకు రాక నిలచిపోయెను. కాబట్టి కరుణాకరుండైన భగవంతుడే పండ్రెండు మైళ్ళ దూరములోనున్న యామెగుహ వద్దకు సామాన్యనరునివలె పోయి యామెచే పూజలంది తిరిగి వచ్చుచుండెను. ఒక సమయమున లీలామానుష విగ్రహుడు అలసట చెందిన వానివలె నామెకడకు రాగా వెంగమాంబ యా పురుషోత్తముని జూచి "నను గన్నతండ్రీ! నీ యలసటకు కారణమేమ"ని ప్రశ్నించెను. అందుకు పరమేశుడు "అమ్మా! నేను పదునాల్గు లోకములను చుట్టివచ్చితిని. నా భక్తులందరిని జూచి వచ్చితి" ననెను. అందుకు "నా ముద్దుల చిలుకా! నీ వెంతటి యుద్యోగమును జేయుచున్నావు? నీవలె కరుణగలవారును, కష్టముల నెంచక భక్తుల బ్రోచువారును, నీవు దప్ప యీ యేడులోకము లందును మఱియొకరిని గానమ"ని చెప్పెను. ఒకప్పుడు పరమాత్ముడు పాదముల నొప్పితో వెంగమాంబ వద్దకు వచ్చి కూర్చుండెను. అపుడాలోకమాత విశ్వేశ్వరుని జూచి "ఓ ప్రాణప్రియా! నీ వింత యలసటగా నుండుటేల" యని, ప్రశ్నించెను. అందుకు పరమ దయాసముద్రుడు "అమ్మణీ! నేను బహుదూరము తిరిగినందున పాదములకు

నొప్పి గల్గిన" దని ప్రత్యుత్తరమిచ్చును. అప్పుడు వెంగమాంబ రాజగోపాలుని పాదములను తనపై నుంచుకొని యొత్తుచుండును. మఱియొక సమయమున శ్రీ వేంకటేశ్వరుడు వెంగమాంబ కడకు వచ్చి "జననీ! నాకాకలియగుచున్న"దనగా వెంగమాంబ ఫలములను ముక్కలుగాజేసి తినిపించును. ఇట్లు యేడుకొండల నారాయణుడు ప్రతిదినమును వెంగమాంబ యొద్ద సకలవిధ సన్మానముల బొంది పోవుచుండును.

## పుష్కరిణీజుని చరిత్రము

ఇట్లుండగా నొక బ్రాహ్మణుడు ప్రారబ్ధవశమున మిక్కిలి రోగపీడితుడై బంధుజనులు దరిజేరనీక నసహ్యముచే నిగ్రహించబడినవాడై, విరక్తి గలవాడై సర్వమును త్యజించుకొని సర్వరక్షకుడైన శ్రీ వేంకటేశ్వరు శరణు పొందుట కన్నను తన కర్మనివారణమునకు వేరు సదుపాయము లేదని నిశ్చయించి తడబడుచు వచ్చి శ్రీనివాస క్షేత్రము జేరెను. అచ్చటి వారారోగపీడితుని జూచి యసహ్యపడుచు వానిని నిందించి తరుమసాగిరి. అందుచే నా బ్రాహ్మణుడు విశేషత్యాగము గలవాడై ప్రాణములు పోయిన పోనిమ్మని విరక్తిచే ప్రాణత్యాగమునకు తెగించి యడవిలోనికి బ్రవేశించి తుంబురుకోన సమీపము జేరగా వాని కలసట విశేషించెను. ఆరోగి యక్కడ వేంకటేశుని మొరలిడుచు "ఆపద్బాంధవా! అనాథరక్షకా! నే పూర్వమున నెట్టి పాపములు జేసితినో! నాకిట్టిగతి సంభవించినది. బంధువుల చేతను, మిత్రుల చేతను, తల్లిదండ్రుల చేతను, ప్రజలందరి చేతను దరిజేరనీక తరుమబడినవాడనైతిని. నీ కోవెలయందుండవచ్చియు నిచ్చటకు దరుమబడితిని. నేను దిక్కులేని పక్షినై నీవే గతియని యీ యరణ్యమునకు వచ్చితిని. నన్నేటుజేయ నీకిష్టమో! అట్లే జేయుము. మృగముల నోటికెరగా జేసెదవో! లేక యాకలిచే ప్రాణములు జోవునట్లు జేసెదవో నేనెఱుగను. నీవు కరుణామూర్తివి! నన్ను రక్షింపు"మని పల్కుచుండగా నాకలి యధికమై యగ్ని వలె దహించసాగెను. వాడా బాధకు తట్టుకొనలేక పెద్దగా 'ఓ వేంకటరమణా ! కృపానిధీ!' అని ప్రలాపించుచుండెను.

## వెంగమాంబ బ్రాహ్మణునాదరించుట

అప్పుడు సమీపములోని గుహయందు బ్రహ్మనిష్ఠాసక్తచిత్తయై సతతము నారాయణ పాదపద్మయుగళీచింతనామృతపానమత్తయై రాణించుచున్న వెంగమాంబ వానిమొరలను విని దయాసముద్రయై తటాలున పైకిలేచి యొక బంగారు పళ్ళెమందు సకల విధ భక్ష్యముల దీసికొని వానియెదుట వచ్చి నిలువబడి ఓయీ! వీనిని భుజింపుమనెను. ఆతడు వెంటనే యాప్రసాదముల తృప్తిగా భుజించి సంతోషాబ్ధి తేలియాడెను. పిమ్మట వెంగమాంబ యతనిని జూచి "ఓయీ! నీకు నేను ప్రసాదముల నిచ్చినట్లును, నేనిచ్చట నున్నట్లును యెవ్వరితోడను చెప్పబోకుము. అట్లు చెప్పెదువేని నీ శిరము వ్రక్కలగు"నని చెప్పి వానిని కన్నులు మూయుమనెను. అప్పుడా బ్రాహ్మణుడు కన్నుల మూసికొని చాలసేపట్లు యుండినను వెంగమాంబ మాట్లాడకపోయెను. అందుచే నతడు కన్నులు దెఱచి చూడగా తటాలున నా స్థలము వదలి పండ్రెండు మైళ్ళ దూరములోనున్న స్వామి పుష్కరిణియందు బయలు వెడలినవాడై సకల రోగములను బాసి ధగధగ మెరయు శరీరముతో వజ్రమువంటి దృఢకాయుడై ప్రకాశించెను.

## పుష్కరిణీజుని ప్రజలాదరించుట

అప్పుడా తీర్థఘటమునందు స్నానమాచరించుచున్న ప్రజలతనిని జూచి వాని మాహాత్మ్యము దెలియుటకు గుంపులుగా వచ్చిరి. వాడును వెంగమాంబ చెప్పిన మాటను జవదాటక మర్మమును బయలుపరచక మౌనియై యుండెను. అందుచే నతనిని నొక దివిజునిగా నిశ్చయించి ప్రజలు వానికి విశేషములైన కాన్కలు, భక్ష్యములు నిచ్చి యారాధించుచుండిరి. ఇట్లు కొంతకాలము జరిగిన పిమ్మట నా వెఱ్ఱి బ్రాహ్మణుడు తనకు సమర్పింపబడు ధనరాసులజూచి విభ్రమము నొంది భయమును వదలి చాలకాల హరణమైనదే, యిప్పుడు వెంగమాంబ

మర్మమును జెప్పిన యాపద సంభవింపదని యాలోచించినవాడై యాపుణ్యాంగన నివాస స్థలమునున్ను తన నావెు కటాక్షించిన విధమునందరికిని తెల్లముజేసెను. మరుక్షణమే వాని శిరము ప్రక్కలై యెండిన మ్రాకువలె క్రిందబడెను. ఆమె నివాసమును, ప్రభావమును తెలిసికొన్న ప్రజలామెను దర్శించు నిమిత్తమై అడవులంతా తిరిగి వెదుకనారంభించిరి.

## వెంగమాంబ శ్రీ వేంకటేశ్వరుని సత్తా మాత్ర స్వరూపమున బ్రవేశించుట

ఇట్లుండ నొకనాడు వెంగమాంబ తన కడకు వచ్చిన శ్రీనివాసుని జూచి "ఓ ప్రభూ! నా నివాసము లోకులకు దెలిసిపోయినది. ఇక నన్నెందుంచెదవు? అని యడిగెను. అందుకు కరుణాకరుడు "తల్లీ! నిన్నిక యెందును యుంచబోను. నాయందే యుంచుకొనియెదను. నీవు నా సత్తామాత్ర స్వరూపంబై యుండు" మని జెప్పియామె నా గుహామార్గముననే కోవెలలోనికి గొనివచ్చి యా పుణ్యాంగనను తనయందే లీనమొనర్చుకొనెను. నదులు సముద్రమున గలిసి యేకమైనట్లు వెంగమాంబ సర్వలోకనాథుని దివ్యస్వరూపమునందైక్యమై, యా పరబ్రహ్మమందే పరబ్రహ్మమై, యేకమై, అద్వితీయమై, నిత్యానందమై, నిశ్చలమై, నిరవధికానందమై, యచలమై అక్షయమంగళ పరబ్రహ్మముతో సమత్వమును బొందెను.

కం॥ తరిగొండమాత కథలను
పరితోషముతోను జదివి భక్తితో విననన్ ।
గిరులైన పాపరాసులు!
పరిమారును వేంకటేశు పదము లభించున్ ॥

కం॥ శరణంబని నీ పదముల
పరిపూర్ణముగాను పడిన భక్తుల పేర్మిన్।
కరమిచ్చి యాదరించెడు
దొరవగు శ్రీ వేంకటేశ! దురితవినాశా ॥

**ప్రశ్న : వేంకటేశుడు వెంగమాంబ కడ నిత్యనివాసము జేయుట కారణమేమి?**

**ఉత్తరం :** పువ్వులు పూచిన మాత్రమున వానియందలి మధువును గ్రోల తుమ్మెదలు ఝుంకారించుకొని వచ్చినట్లు, పరమభక్తుల యందున్న భక్తిరస మధువును ద్రావుటకు భగవంతుడు వారినెడబాయక భక్తిరసమును గ్రోలుచు నానందించుచున్నాడు.

శ్రీ తరిగొండ వెంగమాంబకు సంతకాపు మొగిలిపెంట వద్ద తన మేనిఛాయనిచ్చి యాదరించిన శ్రీ యాంజనేయులను శ్రీ వెంగమాంబ గారి బృందావనములోనున్న నేరేడు వృక్షము క్రింద ప్రతిష్ఠించియున్నారు. నేరేడుచెట్టు ఎండిపోగా స్వామి బృందావనంలోకి వచ్చివున్నాడు. నేటికిని ఆయన దర్శనము కలుగుచున్నది.

శ్రీ వెంగమాంబను ధ్యానించుచు, నామెకృపను సంపాదింపగోరిన పుణ్యులలో ననేకులకామాత నేటికిని దర్శనమిచ్చుచు వారికి గల్గిన యాపదలను నిర్మూలించుచు ప్రత్యక్ష జగజ్జననియై శ్రీ శేషపర్వతమునందు ప్రకాశించుచున్నది. శ్రీ వెంగమాంబ యింటిప్రక్కన వేంచేసియున్న శ్రీలక్ష్మీ నృసింహమూర్తికి ప్రతి జయంతికిని అమ్మగారి సంతతి వారిచే నుత్సవములు జరిపింపబడుచున్నవి. అప్పుడు తొమ్మిదవ రోజున శ్రీ భూనీళాసమేతుడై శ్రీ వేంకటేశ్వరులామె యింటికి వేంచేసి సకల సమ్మానముల బొంది మరలివచ్చుచున్నారు. ఆ పద్ధతి క్రమముగా నేటికిని జరుగుచున్నది.

**ప్రశ్న : వెంగమాంబకు గల్గిన శ్రమలను భగవంతుడు మాన్పగూడదా?**

**ఉత్తరం :** నలియ గొట్టకున్న ఓషధులలోని సారము బయటపడనట్లు, యెంత భక్తిశిరోమణులైనను శ్రమలు గలుగకున్న వారి భక్తిసారము యొక్క లోతును, పట్టుదల, స్థైర్యము, దృఢత్వము, నమ్మకము సర్వేశ్వరునికి రూఢిపడజాలవు.

*శ్రీ వెంగమాంబా చరిత్రము సంపూర్ణము*

## శ్రీ వెంగమాంబ ప్రణీతము

సీ॥ జగతిలో మానవజన్మంబు దొరకదు
దొరికిన పురుషుడై పుట్టటరుదు!
పురుషుడై పుట్టిన పొలతి మంచిది రాదు
వచ్చిన భాగ్యంబు లెచ్చుటరుదు!
భాగ్యశాలికి పుత్ర ఫలము చేకూడదు
కూడిన వితరణ జాడలరుదు!
వితరణ గల్గిన వితత శాంతము సున్న
శాంతంబు గల్గిన సత్యమరుదు!

తే॥గీ॥ సత్యమొదవిన శ్రీహరి స్మరణలరుదు
హరిని దలచిన వాడెపో పరమయోగి
పుండరీకాక్ష తరిగొండ పురనివాస!
సరగ నను బ్రోవు వేంకటాచల నివాసా॥

రాగం - నాదనామక్రియ - తాళం - త్రిపుట

పల్లవి : హరినామస్మరణ జేయకుంటే ఆవల గతియేమి?॥

చ॥ 1) అన్నదమ్ములెడబాయకమునుపే,
అలి నిష్ఠురాలాడక మునుపే,
కన్నకొడుకు దండించక మునుపే,
కాయము వ్యాధుల చిక్కక మునుపే ॥హరి॥

2) వృద్ధాప్యము ప్రాప్తించక మునుపే,
పుత్సాహంబులు యిముడక మునుపే,
నిర్ధనులై దిగులు పడుటకు మునుపే,
నేత్రాలు పొరలను గప్పక మునుపే ॥హరి॥

3) దవడలు లోనికి బోవక మునుపే,
దంతపటుత్వము తగ్గక మునుపే,
చెవులకు మందము దగులక మునుపే,
చల్లగ దోవ నడువజాలక మునుపే ॥హరి॥

4) కట్టుబూనుకొని తిరగక మునుపే,
కంఠధ్వని స్థితి తగ్గక మునుపే,
అట్టుముందటికి వంగక మునుపే,
అంగము తల వణకించక మునుపే ॥హరి॥

5) అప్పుల వారు కదియక మునుపే,
అన్నమొకరు దినిపించక మునుపే,
దొప్పలోను చేయి గడుగక మునుపే,
దోవతి బలువై దోచక మునుపే ॥హరి॥

ఆనందభైరవి రాగం - అట తాళము

పల్లవి॥ జ్యోతి వెలుగుచున్న దమ్మా! దాని లోతు తెలియ రాదె కొమ్మా!॥

అ॥ప॥ పాతాళగగనకళాతీతమై సర్వ భూతములందు ప్రఖ్యాతిగ పరమాత్మ ॥జ్యోతి॥

చ॥ 1) ఎవరి చేజిక్కిన దోయమ్మా
దాని విధ మిట్టిదని చెప్పరాదుగదమ్మ
శివకేళిలో గూడి సిద్ధేందుభావమై
భువనైకమై చాల బుధులందు నాయాత్మ ॥జ్యోతి॥

2) మాయలో మాయైన దమ్మా దాని
మహిమ తెలియ గూడదమ్మా
మాయకు లోగాను - మాయకు వెలిగాను
రేయిబగలు నొక్కరీతిగ పరమాత్మ ॥జ్యోతి॥

3) నానారూపములైన దమ్మా
తిరిగి తాను తానై యున్నదమ్మా
పూని త్రికూట నిత్యానందవార్ధిలో
జ్ఞానములోను నిదానముగా నాత్మ ॥జ్యోతి॥

4) కనకమయమై యున్న దమ్మా తిరిగి
కనవచ్చు కనరాదోయమ్మా
ఫణితితోను గూడి పగలు రేయొకరీతి
తనువులోపల నీలతామరసరమునందు ॥జ్యోతి॥

5) ఎరుకలో యెరుకైన దమ్మా సర్వ
మెరిగే సాక్షియై యున్నదమ్మా
పరమాణువై విశ్వ పరిపూర్ణముగ నాత్మ
గురుచంద్ర తరిగొండ నరహరి రూపమున ॥జ్యోతి॥

కాంభోజిరాగం - అట తాళం

పల్లవి : ద్వాపరయుగమున ధరణిపై వెలసిన
గోపాలుడు నీలో కొలువై యున్నాడు నేడు ॥ద్వా॥

అ॥ప॥ ఆ పుణ్యునెరిగిన యాపదలేదట్టి
భూపతికి నీకైన - పుట్టు దరిద్రునకైన ॥ద్వా॥

చ॥ 1) బుద్ధి మనసు మధ్య పున్నమ చంద్రుడై
ముద్దుల బాలుడు ముద్దాడుచున్నాడు
వద్దికతో యట్టే బుద్ధి నిల్పిన క్షణమే
సిద్ధముగను పరిశుద్ధమౌ పరంజ్యోతి ॥ద్వా॥

2) వెలలేని మాణిక్యతిలకమై నడిమధ్య
అల పరమాత్ముడు వెలుగుచున్నాడు

నేడు సలలితముగ గోకుల పలువన్నెల
చిలుక నీలోపల వలనొప్పుచును చాల ||ద్వా||

3) నవనీతచోరుడు చిన్నగోపాలుడు
కన్నచోట నే బహుయున్నతమైన వాడు
సన్నంపువీధిలో వెన్నెల లోపల
కిన్నెరమును బట్టియున్న చిద్రూపుడు ||ద్వా||

4) గోపిక వస్త్రముకి కొల్లబెట్టినట్టి
శ్రీపతి నీలోన దీపమై యున్నాడు
రేయి పగలును లేక - ఆపోజ్యోతి గనుక యే
రూపుగానకను సర్వవ్యాపి వెలుగుచు ||ద్వా||

5) బృందావనములోన సుందరాంగుల మధ్య
అందమై కలువల బంధువై యున్నాడు
కంధి గర్వాపహారుడెందు జూచిన నిత్య
మందహాసముతోను పొంది బిందువులోను ||ద్వా||

6) రంగప్రకాశుని రక్షించ నడివీధి
శృంగారవాకిట పొంగుచున్నాడు నేడు
అంగములో యణులింగమై మున్నాళ
సంగము లోపల మంగళప్రదముగ ||ద్వా||

## శ్రీ వెంగమాంబ భోజనమునకు శ్రీనివాసుని బిలచుట

రాగం-సావేరి తాళం-అట

పల్లవి॥ శ్రీలక్ష్మీస్థితాంగ - చిద్రూపచిన్మయ - శివనుత శుభాంగ రావయ్యా!

అ॥ప॥ మేలైన భక్ష్యముల్ చాల దెచ్చినాను
నీలవర్ణ తిని పోవయ్యా! శ్రీ వేంకటేశ్వర
రావయ్యా! బ్రహ్మాండనాయకా రావయ్యా!

చ॥ 1) పాలు-వెన్న-తేనె, ఫలములు - శర్కర -
పూలరాసులు దెచ్చినానయ్యా - ఫాలాక్ష
శ్రీగోపాల - శ్రీనివాస - లీల యవతార రావయ్యా! ॥శ్రీ॥

2) సంపంగి తైలము - ఇంపైన గంధము -
సొంపార దెచ్చితి రావయ్యా!
సంపతిల్లగాను కుంకుమ పూలను
కెంపులవలె దెచ్చినానయ్యా! ॥శ్రీ॥

3) తులసిరేకులతో దళముగ గట్టిన
వలనొప్పుమాల లుయ్యాలులుగా
సలలితముగ నీదు కంఠమందున యూగ
చిలుక వర్ణ వేగరావయ్యా ॥శ్రీ॥

4) వెలలేని ముత్యముల్ రత్నాల హారములు
జ్వలియించ యురమున వేలుగాగా
కల కల యను చిరునగవుల నాసామి
వలరాయపతి వేగ రావయ్యా ॥శ్రీ॥

5) ఇరుగడల భూ సిరులగూడియు మెరయుచు
దగదగ నిరుపముగ సరసమైన

వయ్యారముతో నిటు సరగన
వేంచేయవయ్యా ॥శ్రీ॥

6) శృంగార సన్మునిపుంగవ మనోభృంగ
మంగళ బ్రహ్మమ రావయ్యా।
పొంగుచు కలకల రంగ ప్రకాశుని
సంగరముగ బ్రోవ వేమయ్యా ॥శ్రీ॥

* * *

సీ॥ ఈ కథ వ్రాయువారిది చదివెడి వారు
విశ్వాసయుక్తులై వినెడివారు
నాయురారోగ్య భాగ్యముల ననుభవించి
పుణ్యాత్ములగుదురు భూతలమున
కమలాప్త చంద్ర నక్షత్రంబులున్నంత
కాల మీ కృతి శుభకరముగాను
తరిగొండ హరియైన యురగాద్రిపతి కృప
భూలోకమున వృద్ధి బొంది యుండు

గీ॥ భూవరాహ ప్రభునకు సత్పుణ్యనిధికి
లక్ష్మికిని మఱి భూ నీళలకును హరికి
శేషగిరికిని దరిగొండ శ్రీ నృహరికి
మంగళము గలుగు వలయు నో మౌనులార!

*'సమాప్తమ్*
*ఓం తత్సత్'*
*'సర్వేజనాః సుఖినోభవంతు'*

# 5(ఎ) శ్రీ తరిగొండ వెంగమాంబ గారికి వ్రాయించి యిచ్చిన దానపత్రముల నకళ్లు

చిత్తూరు జిల్లా తరిగొండలో కానాలి కృష్ణయ్య, మంగమ్మ దంపతుల సంతానం వెంగమాంబ. ఇంజేటి వేంకటాచలప్పతో బాల్యవివాహం చేశారు. బాలవితంతువై తిరుమలచేరి గోగర్భం తీర్థంలో తపస్సుచేస్తూ జనం తాకిడి ఎక్కువకాగా తుంబురుతీర్థంలోని 'గవి'లో ఆత్మశుద్ధి పొందింది. ఆమెకిష్ట మొచ్చినపుడు ఆలయ ప్రవేశంచేసి శ్రీవారికి పూజానైవేద్యాలు నిర్వర్తించేది. ఆమె ఎలా వస్తుందో? ఎలా పోతుందో? అంతుబట్టని అర్చకులు తలబాదు కునేవారు. స్వామివారు మాత్రం రుచికరమైన ఆమె వంటల కోసం ఎదురు చూసేవారు. వంటేకాదు, తిరుమల వేంకటేశుని, తరిగొండ నృసింహుని పరంగా కీర్తించిన ఆమె కవితలు కూడా రుచికరమైనవి. శ్రీవేంకటాచల మాహాత్మ్యము, రాజయోగసారము, విష్ణుపారిజాతము, అష్టాంగ యోగసారము, నృసింహయక్షగానము, ద్విపద రామాయణము, భారతం, భాగవతం, మేలుకొలుపులు, శతకాలు, మొత్తం 18 ఆమె రచనలు. పెద్దగా చదువుకోకపోయినా దైవకృపతో ఆమెకు పాండిత్యం అబ్బింది. దానికి కారణం ఆమెకు బ్రహ్మవిద్యాగురువైన సుబ్రహ్మణ్యయోగి ఆమెకు ప్రసాదించిన శక్తి అని అంటారు.

33 సంవత్సరాల క్రితమే ఆమె ఇంటిని శోధించాను. ఒక్క రచన కూడా దొరకలేదు. తలా తోకా లేని కొన్ని తాళప్రతులు, చిత్తు కాగితాలు లభించాయి. అవి ఉపయోగం లేనివి. ఆమె బంధువుల వంశవృక్షం ఒక కాపీ దొరికింది. ఆమె నిస్సంతువు కాబట్టి దీనివల్ల మనకు వుపయోగం లేదు. వెంగమాంబ మఠానికి 1939లో ఒక జడ్జిగారిచ్చిన సర్టిఫికెట్టు వుంది. దానివల్ల మనకు పెద్ద ప్రయోజనం లేదు. ఆమె పూజాగదిలో తామ్రరేకు ఒకటి వుంది. దాని మీద యంత్రం గీచి, ఆ యంత్రంలో ఒక మంత్రం

లిఖించారు. అది ఇలా వుంది. "మంత్రరాజాయ విద్మహే! మహామంత్రాయ ధీమహి! తన్నో యంత్ర ప్రచోదయాత్! ఉగ్రం వీరం మహావిష్ణుం, జ్వలంతం సర్వతోముఖం. నృసింహం భీషణం భద్రం, మృత్యుమృత్యుం నమామ్యహం" అని, 1941 నాటి ఒక కరపత్రం దొరికింది. దానిలో ఆమె సాయుజ్యం శాలివాహన శకం 1738 ఈశ్వరనామ సంవత్సరం శ్రావణ శుద్ధ నవమి అని వుంది. 7-8-1817గా మన తేదీ లెక్కకు వస్తుంది. పుట్టకను పండితులు 1840 సం॥లో జీవించి వున్నదని రాశారు. దీనితో చిక్కు వచ్చింది. అప్పటికి జీవించి వుంటే ఆమె మరణకాలం మరో 60 ఏళ్ళు వెనక్కి వచ్చి 1877 అవుతుంది. అంటే అప్పటికి ఆమె వయస్సు 120 సంవత్సరాలకు పైగా అవుతుంది. నిజంగా అంతవరకు జీవించి వుంటే ఆమె రచనలు ఆమె జీవిత కాలంలోనే అచ్చులో వుండాలి. అలాలేదు. సరే! ఈ విషయాన్ని యింతటితో వదిలిపెడదాం.

అవసాన దశలో ఆమెకు ఒక మఠం వెలసింది. దానికి సంబంధించిన దానపత్రాలు, తాళప్రతులలో దాదాపు 35 దాకా లభించాయి. అవి పరిశోధకులకు యిస్తూ తిరిగి తీసికొంటూ వుండగా వున్నట్టుండి అదృశ్యమై పోయాయి. నకళ్లు మాత్రం నా దగ్గర మిగిలాయి. ఇబ్బంది లేదు. ఎందుకంటే ఆ దానాలు మాట ప్రకారం ఎవరూ యివ్వడం లేదని కరపత్రంలో గుండేపల్లి కుప్పయ్యశర్మ 1941లోనే పేర్కొన్నారు. ఈ గుండేపల్లి కుప్పయ్యశర్మ తరిగొండ వెంగమాంబ సోదరి కుటుంబానికి చెందిన మేనేజర్. ఆయన, ఆయన కుమారుడు జి.వి.ఎల్.ఎన్.మూర్తి ఏదో తంటాలుపడి నృసింహజయంతి అన్నదానం జరిపేవారు.

తరిగొండ వెంగమాంబ సమాధి *తిరుమలలో శ్రీ వేంకటేశ్వర బి.నాగిరెడ్డి ఇంగ్లీషు మీడియం స్కూలు ఆవరణలో వుంది. అక్కడే ఒక జూనియర్ కాలేజీ కూడా వుంది. ఆ సమాధిమీద ఒక మండపము వుంది.

---

ఇప్పుడవి లేవు. ఆ బృందావనంలో యిప్పుడు ధ్యానమందిరం నిర్మాణమవుతోంది.

అందులో తులసీకుండం, ఆమె పాదాలు, ఆమె పూజించిన చిన్న ఆంజనేయస్వామి ప్రతిమ వున్నాయి. ఇప్పటికీ నిత్యపూజ చేస్తుంటారు. జీరెడ్డి చెన్నారెడ్డిగారు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ అధిపతిగా వుండేటప్పుడు ఒకసారి వచ్చి యీ మండపాన్ని చూసి, "దానిక్రింద కూడ ఇలాంటి మండపం ఒకటి వుంటుందని, దానిలో ఆమెకు సంబంధించిన వస్తువులు వుంటాయని బహుశా ఆమె రచనల తాళప్రతులు కూడా అక్కడ దొరకవచ్చునని, కొన్నిచోట్ల అవిధంగా దొరికాయని" చెప్పారు. కానీ దానిని త్రవ్వే సాహసం ఎవరూ యిప్పటివరకు చేయలేదు. ఆ స్థలంలో నిర్మాణాలుండేవి. ఒకప్పుడు ఆమె పూదోట. మండపానికి అనుకొని పెద్ద బండ వుంది. ఆ కాలంలో ఆమె ఆ బండ మీద కూర్చొని శ్రీవారికి పూలు కట్టేదట. అక్కడ ఒక నేరేడు చెట్టు వుండేదట. ఇప్పుడు లేదు. ఆంజనేయ ప్రతిమ ఆ చెట్టు మొదలులో వుండేదట. ఆ బండ క్రింద ఒక సొరంగం వుందని అది ఎక్కడికి పోతుందో తెలియదని బహుశా శ్రీవారి ఆలయానికో లేదా తుంబురు తీర్థంలోని వెంగమాంబ గవికో పోవచ్చునని, అయితే దానిని బండతో మూసివేశామని మూర్తి అయ్యవారు బతికుండే కాలంలో చెప్పారు. ఈ మిస్టరీని యిక్కడితో వదిలివేద్దాం.

తాళపత్రాలలోని దానాలు పరిశీలిద్దాం. దిండిగల్లులోని రెండు గ్రామాల దానం తప్ప, తక్కినవన్నీ చిత్తూరు జిల్లాకు చెందినవి. వానిలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబకు అని కొన్నిటిలో, వెంగమాంబ మఠానికి అని కొన్నిటిలో, నృసింహజయంతికి అని కొన్నిటిలో, నృసింహజయంతి రోజు అన్నదానానికని కొన్నిటిలో పేర్కొన్నారు. వీటికాలం 1785 నుంచి 1809 వరకు అనగా దాదాపు పాతిక సంవత్సరాలు. అప్పటి గ్రాంథిక భాషనే వాడారు. దస్తావేజుల పారిభాషిక పదాలు, కొన్నిచోట్ల విచిత్ర వర్ణనలు, చారిత్రక విషయాలు, చలామణిలోనున్న నాణాలు కూడా అందులో చోటుచేసికొన్నాయి. వాటిని యథాతథంగా వ్రాస్తే అదొక పుస్తకమయ్యే

ప్రమాదముంది. కాబట్టి క్లుప్తంగా తేదీలు, దానకర్తలు చేసిన దానం, చిరునామాలు మాత్రం ఇవ్వడం జరిగింది. అందులోని శాలివాహన శక సంవత్సరాలు ప్రస్తుత కాలమానంలోకి మార్చబడ్డాయి.

మార్చినెల 1785 చంద్రగిరి కరణం శేతువరాయ పిళ్లై, అగరాల గ్రామంలో (చంద్రగిరి పశ్చిమద్వారం దగ్గర) స్వర్ణముఖి తీరాన 50 గుంటల భూదానం మాతృశ్రీ వెంగమాంబకు, 1794-1795 - ఈ రెండు సంవత్సరాలకు చెందిన పది దానపత్రాలలో దాదాపు పదిహేను గ్రామాలవారు నెలకు 1 మానెడు బియ్యం (దాదాపు అరకేజి) ఒక్కో ఇంటికి యిచ్చులాగున (మానికలు, కుంచాలు మునుపు వాడుకలో వుండేవి. కుంచాలను బల్లలు అని కూడా అంటారు). అంటే ఇంటికి నెలకు మానెడు బియ్యం యివ్వాలన్న మాట. మూడు దానపత్రాలలో వెంగమాంబ యాత్రీకుల దాహం తీర్చడానికి చలిపందిరిలు నిర్వహిస్తున్నట్టు వుంది. పై గ్రామాలన్నీ దేవదాన గ్రామాలు (తిరువిడయాట్టం). అందులో రెడ్లు, కరణాలు, పురోహితులు, శెట్టి వర్తకులు, కాపులు, ఫణాలవారు (చిల్లర కొట్లు) వున్నారు. ఇందులో విశేషమేమంటే 1794-1795 సం॥ నాటికి కూడా శ్రీనివాసమంగాపురాన్ని అలిమేలు మంగాపురంగా వ్యవహరించడం. దాని తాలూకాగా నాగపట్లను పేర్కొనడం. అంటే అలమేలు మంగమ్మ అప్పటికి తిరుచానూరులో లేదని అర్థం. నాగపట్ల ఆరేపల్లి రంగంపేట దగ్గరి బేచరాకు గ్రామం. నాగపట్ల చెరువుకు దగ్గరగా వుండేది. ఆలయం ఆంగ్లేయుల పాలనలోకి వచ్చాకనే యిప్పటి పేర్లు (శ్రీనివాస) మంగాపురం, తిరుచానూరు (అలమేలు మంగాపురం)గా మారి వుంటాయి. కొన్ని గ్రామాల వారు సంవత్సరానికి నాలుగు బల్లలు బియ్యం యిస్తామంటే, తొండవాడ గ్రామస్థులు మాత్రం సంవత్సరానికి రెండు పుట్ల వడ్లు అంటే ఫలితానికి లేదా కారుకు ఒక పుట్టి చొప్పున రెండు బస్తాలు దానితోబాటు నాలుగు అపరంజి రూకలు కూడా యిస్తామని పేర్కొన్నారు.

6-12-1794 శనివారం - కల్లూరి పాళేగారు కల్లూరి రంగపతి రాజు తన ఆధీనంలోని గ్రామాల పురోహితులు, కోమటిశెట్లు, కాపులు, ఫణాలవారు సంవత్సరానికి తలా ఒక అపరంజి రూక నృసింహజయంతి అన్నదానానికి యిచ్చేటట్లు కట్టడి చేశారు.

మార్చి 1795 సం॥లో తిరుమల తిరుపతి నగరంవారయిన బేరిశెట్లు, ప్రతి ఇంటికి, ప్రతి అంగడికి, సంవత్సరానికి ఒక అపరంజి రూక అన్నదానానికి యిస్తూ తమ కులం వాడయిన తిరుక్కచ్చి నంబిని (కంచి పూర్ణుడు - తిరుమల శ్రీవారికి తొలుదల్త శూద్రపూజారి) అతని గొప్పదనాన్ని వేనోళ్ల కొనియాడారు. బేరివాళ్ల కులగురువు గాబట్టి వరదరాజస్వామితో బాటు ఆయన విగ్రహం తిరుపతి బేరివీధి గుడిలో వెలసింది.

19-8-1795 సం॥లో దిండిగల్లు జమీందార్-ఆరణి విజయ వెంకటపతిరాజా బహదూర్‌వారు వడమదుర, చిత్తూరు అను రెండు గ్రామాలు దానం చేశారు. వాటి సంవత్సర ఆదాయం నాలుగువేల రూపాయలు. దానిని యీ క్రిందివిధంగా ఖర్చుచేయాలని సూచన - నృసింహజయంతి అన్నదానానికి రూ.2160, శ్రీవారి నిత్యకర్పూరహారతికి రూ.480 (ఈ తేదికి వెంగమాంబ చెల్లెలు చెంగమ్మ అక్కడే వుండి ఏకాంతసేవ సమయంలో ముత్యాలహారతి యిస్తున్నట్లు తెలుస్తోంది). నిత్యతళిగకు రూ.360, మనోవర్తి (మనసుకు తోచిన) ఖర్చు రూ.1000 వెరశి మొత్తం నాలుగు వేలు సరిపోయింది.

28-10-1795 సం॥లో పుల్లూరు మొగరాల పాళేగార్ రఘునాథ నాయనింవారు సంవత్సరానికి ఐదు తిరుపతి వరహాలు మాతృశ్రీ వెంగమాంబ వారి నృసింహజయంతి ఖర్చుకు దానం చేయడమైనది.

7-11-1795 సం॥లో బంగారుపాళెం పాళేగారు చంద్రశేఖర నాయనివారు తన గ్రామాలవారు 12 వరహాల వరుషాశన (సంవత్సరం) దానం నృసింహజయంతిరోజు అన్నదానానికి రాసిచ్చారు.

మార్చి 1796 - నూట ఇబ్బంద్రు నగరంవారు (102 మంది) తిరుపతి గోవిందరాజాలయ సమీపంలో నివసించువారు సంవత్సరానికి ఇంటికి ఒక అపరంజి రూక దానం. (ఇప్పటినుంచి మాతృశ్రీ వెంగమాంబ, మఠం, నృసింహజయంతి అన్నదానం రాయడం లేదు. అర్థం చేసుకోగలరు).

మార్చి 1796 - నూట ఇబ్బంద్రు నగరం వారిలో రాచప్పశెట్టి, లింగిశెట్టి, కేశవశెట్టి వగైరాలు సంవత్సరానికి ఇంటికి ఒక అపరంజి రూక.

ఏప్రిల్ - 1796 - నాగపట్లపేట (భాకరాపేట), రంగంపేట, పీలేరు అయ్యావాండ్లపల్లి తదితర గ్రామాల శెట్లు నూట ఇబ్బంద్రువారు సంవత్సరానికి ఒక్కొక్క ఇంటికి ఒక అపరంజి రూక.

నవంబరు 1796 - మామండూరు పాళేగారు రాజశ్రీ కృష్ణమ నాయనివారు 97 గుంటల భరణిగడ్డ పొలము - పుదిపట్ల తూంగపాళ్కుకు పశ్చిమం, పెరుమాళ్లపల్లికి తూర్పుగానున్నది, శ్రీ వెంగమాంబ మఠానికి, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవానికి సువర్ణార్ఘ్యములతో ఆచంద్రార్కంగా అంకితం.

నవంబరు 1796 - అదే గ్రామ ముఖ్య పాళేగారు వెంకటప్ప నాయనివారు అదే ప్రదేశంలో 77 గుంటల భూదానం వెంగమాంబ సన్యాసినుల మఠానికి, నృసింహజయంతి అన్నదానానికి అర్పితం. తిరుమలలో సన్యాసినుల మఠం వెంగమాంబగారు నిర్వహించేవారని దీనినిబట్టి తెలుస్తోంది. ప్రథమంగా ఆ ప్రస్తావన కనపడింది.

ఏప్రిల్ 1797 - స్వస్థలం, పరస్థలంవారు ఫణాలవారు సంవత్సరానికి ఇంటికి ఒక అపరంజి రూక.

14-4-1798 - పెనుమూరి పేటవాళ్ళు సంవత్సరానికి ఒక శంఖు రూక.

జులై-ఆగష్టు, 1798 - చిత్తూరు దగ్గర వావిలితోట రెడ్లు సంవత్సరానికి రెండు తిరుపతి వరహాలు - ఆచంద్రార్కంగా సమర్పణ.

ఆగష్టు 1798 - కరకంబేడు పాళేగారు వీరరాఘవప్ప నాయని వారు తిరుచానూరు సమీపం, తనపల్లి నల్లమాని కాల్వలో 100 గుంటల భూమి ఆచంద్రార్కంగా సమర్పణ.

అక్టోబరు 1803 - కార్వేటినగరం తాలూకా తయ్యూరు పాయకట్టు పెదకొండుపల్లి గ్రామస్థుడు బసివిరెడ్డి చౌడిరెడ్డి అనుమతితో వెంకటస్వామి సంవత్సరానికి ఒక పూల వరహా.

సెప్టెంబరు 1806 - గొట్టిగల్లు తిమ్మారెడ్డి కొద్దిగా భూదానం.

19-2-1809 - మంగళంపేట ప్రసన్న వేంకటేశ్వర ఆలయ సమీపాన నివసించు వర్తకుల తరపున దేవత వెంకటేశం శెట్టి, రాపూరు వేంకట్రామశెట్టి మొదలగువారు సంవత్సరానికి ఒక ఇంటికి ఒక శంఖు రూక. ఇది అన్నదానానికే కాక పూలసరఫరాకు కూడా ఉద్దేశించింది. ఇక్కడితో ఆగిపోయిన దానపత్రాలు, తరిగొండ వెంగమాంబ ఆ తరువాత ఎనిమిదేండ్లకు అస్తమించి వుంటుందని సూచిస్తున్నాయి.

ఇది చదివినవారు యిందులో తమ పెద్దల పేర్లు కనపడి, తమకు యిప్పుడైనా దానం యివ్వాలన్న బుద్ధిపుడితే దానం యివ్వవలసిన చోటు తిరుమల శ్రీవారి హుండీ.

నృసింహజయంతి జరిగిన పదోరోజు తిరుమల శ్రీవారు అంటే మలయప్పస్వామి దేవేరులసమేతంగా వెంగమాంబ యింటికొచ్చి కొలువు దీరుతారు. కైంకర్య వినియోగం తరువాత స్థలపరివెట్టం (సన్మానం) మొదట తాళ్లపాకం వారికి, తదుపరి తరిగొండ వెంగమాంబ వారికి యివ్వడం జరుగుతుంది.

1) శ్రీరామా భూదానము

గొట్టిగంటి తిమ్మారెడ్డిగారు వ్రాసియిచ్చినది

స్వస్తి శ్రీ విజయాభ్యుదయ శాలి వాహనశకవర్షంబులు 1728 *(1806) అగు నేటి అక్షయనామ సంవత్సర ఆశ్వీజ శు. 15 యీ శుభదినమందు తిరుమల తిరుపతి యందు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులైన శ్రీ స్వామివారి సాన్నిధ్యమందున శ్రీమదఖండ సచ్చిదానంద నిత్య పరిపూర్ణులయిన శ్రీతరిగొండ లక్ష్మీ నృసింహస్వామి వారి దివ్యశ్రీ పాదారవింద మధుకరాయమాన మానసులైన వెంగమాంబగారి మఠానాకు:- సకల జననయనమనోహర సకల దురిత నివారణ నిపుణ సకల శోభన కారణ తదియ్యనియత వైశాఖ మాస శ్రీనృసింహోత్సవ అన్నదాన ధర్మమునకు శ్రీమతుగొట్టిగంటి తిమ్మారెడ్డిగారి పౌత్రులయిన చెంగ్గల రెడ్డిగారి పుత్రులయిన తిమ్మారెడ్డిగారు వ్రాయించి యిచ్చిన భూదాన ధర్మశాసన పత్రిక క్రమంబెట్లన్నను మేము శ్రీస్వామివారి యాత్రకు తిరుమలకు వచ్చియుండగా మా గ్రామంలో భూదానం కావలెనని పలుకరిస్తిరి గనుక అదే ప్రకారం మాయేలుబడి చినగొట్టిగల్లు గ్రామంలో పెద్దచెర్వు పల్లపుకాల్వను మారెడ్డి మాన్యరి స్తళం నల్లగంటి మడిప్రె 1 తూమెడు కారారంభం చేనుపేట స్తళాంన్ను గ్రామానకు పశ్చిమంగ్గా చల్లావాండ్లపల్లె మిట్టను నల్లగుట్టకు దక్షిణం, మారెడ్డిమాన్యస్తళం చేనులో 10 పాతికె శ్రీనృసింహార్పితముగా సపాద్యుదక దానధారా పూర్వకముగా దత్తం చేసియిచ్చినాము గనుక మీ శిష్య ప్రతి శిష్యపారంపర్యం మా పుత్ర పౌత్ర పారంపర్యం ఆచంద్రార్కస్థాయిగా అనుభవించుకొని సుఖాన వుండమని మారాజనా గ్రామ కరణం బొమ్మయ చాత వ్రాయించి యిచ్చిన భూదాన ధర్మశాసన పత్రికె॥ స్వదత్తా ద్విగుణం

---

* క్రీస్తుశక సంవత్సరములు మూలములో లేవు.
పాఠకుల సౌకర్యార్థము మేము కలిపినవి. సం॥

పుణ్యం పరదత్తాను పాలనం/పరదత్తా పహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్ 'దాన పాలన యోర్మధ్యే' దాన భయోనుపాలనం!...

(Sd) తింమ్మారెడ్డి చైత్రాలు.

**2) నగదువర్తన :- శ్రీమన్ నృసింహాయ నమః పులిచలర్ మంగలంపేట వర్తకులు వ్రాసియిచ్చినది :- వర్షాశన దాన పత్రము -**

శ్రీమస్వస్తిశ్రీవిజయాభ్యుదయశాలివాహన శకాబ్దాః 1730 (1808) సంవత్సరం కల్యబ్దాః ౪౯౦౯ మీదను నగుననియెడి చాంద్రమాన విభవనామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ 5 మీయి శుభదినం శ్రీ తిరుమల తిరుపతి యందు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకులైన శ్రీ వేంకటేశ్వరస్వామి సాంన్నిధ్యమున శ్రీమదఖండ సచ్చిదానంద నిత్య పరిపూర్ణులయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహస్వామి వారి దివ్య శ్రీపాదారవింద మధుకరాయ మాన మానసులైన మాతృశ్రీ వెంగమాంబ గారికి శ్రీమన్నృసింహ జయంతి మహోత్సవ నిరంతర అన్నదాన పుష్ప కైంకర్యాతిశయ విభవములకు దైవ సింహాసన మంగళ్యంపేట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి సాన్నిధ్యమందున వున్న స్వస్తిసమస్త ఆది ప్రశస్త సకల గుణ సంపన్న పెనుగొండ పురవరాధీశ్వర కుబేరాంశ్య వర్ధనులై కన్యకా సహోదరులై బాస్కరాచార్య ఆశీర్వాద బలప్రసిద్ధులై శ్రీ జనార్ధన దేవర దివ్య శ్రీపాద పద్మారాధికులైన నూట యిబ్బండ్ర నగరం వారు దేవతు వెంకటేశం శెట్టి, రామా పూరి వెంకట్రామి శెట్టి, దరిశరాగప్పశెట్టి బలసా వెంకటేశం శెట్టి, చేగు అప్పయ్య శెట్టి, భోగనాదం వెంగన్నశెట్టి, మెంటాపుల్లియ, మేడా గురప్ప, కంది అప్పయ్య, రేపూరిచెంచు, కుంచం సిద్దప్ప, దరిశశిద్దప్ప, దండు అప్పయ్య, కరే సుబ్బన్న, సుంకు అప్పయ్య, కలువారామన్న, మారాగురప్ప, గుఱ్ర పాపయ్య, శికాపల్లె పాపయ్య మొదలైనవారు యేకస్థులై వ్రాయించిన వరుషాశన ధర్మశాసన దాన పత్రిక క్రమంబెట్లన్ననూ పేరుబడియిల్లు 1కి

సంవత్సరం వఘుటిశంకు ౧ లెఖ ప్రతి సంవత్సరమున్నూ తమశిష్య పారంపర్యగా మా పుత్ర పౌత్రపారంపర్యముగా మేమే జమ చేసి యిచ్చి నడిపించగలవారము. యీ ధర్మమునకు ఆక్షేపణ చేసినవారు కాశీలో గో బ్రాహ్మణవధ చేసిన పాపాన పోగలవారలు. యిందు సాక్షులు హరిహరాదులు - వీర్ల సమ్మతిన మాఘం అప్పయ్య వ్రాసిన దాన పత్రము॥ స్వదత్తా ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనం। అన్యదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్ ॥

(Sd) దేవత వెంకటేశంశెట్టి చేవ్రాలు

(Sd) రామూరి వెంకట్రామన్న చేవ్రాలు

(Sd) దరుశ రాగప్ప చేవ్రాలు

(Sd) బలసా వెంకటేశుడు చేవ్రాలు

(Sd) భోగనాథం వెంగన్న చేవ్రాలు

(Sd) చేగు అప్పయ చేవ్రాలు

(Sd) దండు అప్పయ చేవ్రాలు

(Sd) మెంటా మల్లయ్య చేవ్రాలు

(Sd) కరె సుబ్బయ్య చేవ్రాలు

(Sd) పెరూరి వెంకటప్ప చేవ్రాలు

(Sd) శ్రేషయ్య చేవ్రాలు

(Sd) మోవ వరదప్ప చేవ్రాలు

(Sd) బుద్ధవరం నారప్ప చేవ్రాలు

(Sd) కరె అప్పయ్య చేవ్రాలు

(Sd) కాకమా బెల్లం చేవ్రాలు

(Sd) రేవూరి చెంచు చేవ్రాలు

(Sd) మేదా గురుమూర్తి చేవ్రాలు

(Sd) దరిశ శిద్దప్ప చే(వ్రాలు

(Sd) బయ్యా బన్నన్న చే(వ్రాలు

(Sd) దిండు కుర్తి వెంకటప్ప చే(వ్రాలు

(Sd) కుంచం శిద్దప్ప చే(వ్రాలు

(Sd) మరాద అప్పయ్య చే(వ్రాలు

(Sd) శ్రీంతి గోపా చే(వ్రాలు

6 మంది చే(వ్రాలు సరిగా తెలియలేదు.

**3) నగదు వర్తన : పుల్లూరు - మగరాల రఘునాథ నాయనింవారు వ్రాసియిచ్చిన వర్షాశన దాన పత్రిక -**

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహనశక వర్షంబులు ౧౭౧౭ (1795) అగునేటి రాక్షస నామ సంవత్సర ఆశ్వీజశుద్ధ ౧౫ సౌమ్య వాసర పర్వదినమందు శ్రీమదఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకులైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి సాన్నిధ్యమందున శ్రీమదఖండ సచ్చిదానంద నిత్య పరిపూర్ణులైన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహస్వామివారి దివ్యశ్రీ పాదారవింద మధుకరాయమాన మానసులైన మాతృశ్రీ వెంగమాంబ గారికి శ్రీమన్ నృసింహజయంతి మహెూత్సవానకు శ్రీమన్మహానాయకాచారులయ్ను అచ్యుత గోత్రోద్భవులయిన, మగరాల తిమ్మప్పనాయని వారి పౌత్రులైన, కేశవప్ప నాయనిం వారి పుత్రులయిన రఘునాధనాయనిం వారు వ్రాయించి యిచ్చిన వరషాశనదాన పత్రిక - శ్రీనృసింహస్వామివారి జయంతి నిమిత్తం సంవత్సరం ౧ కి తిరుపతి గగలు ౫ యిప్పించెల్వశలవిచ్చినారము గనుక సంవత్సరం మాపుత్రపౌత్రపారంపర్యంత్తరు ఆచంద్రార్కస్థాయిగా అయిదు వరహాల వంతున కచ్చుర్ యిప్పిస్తూ రాగలవారము. యిటని మా రాజీని సంప్రతి అక్కరాజు చాత వ్రాయించి యిచ్చిన వరషాశనదాన పత్రం ।

స్వదత్తా ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనం । పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్ ॥

(Sd) రఘునాధనాయనింవారు - (xxxx)
(చేవ్రాలు నాగరలిపిగా యున్నది)

**4) గ్రామాదులలో నగదు వర్తన - శ్రీనృసింహాయనమః కల్లూరి రంగపతిరాజు వ్రాసియిచ్చిన వర్షాశనదాన పత్రిక -**

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహనశకాబ్దాః ౧౭౧౬ (1794) *కల్యాబ్దాః ౪౮౯౫ మీదనగుననియెడి ఆనందనామ సంవత్సర మార్గశిర శుద్ధ ౧౫ యీ శుభదినమందు శ్రీ తిరుమల తిరుపతి యందు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సాన్నిధ్యమందున శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహస్వామివారి దివ్యశ్రీపాదారవింద మధుకరాయమాన మానసులైన మాతృశ్రీ వెంగమాంబగారికి, శ్రీమన్ నృసింహజయంతి మహోత్సవ అన్నదాన ధర్మమునకు శ్రీమన్ మహానాయకాచార్యులైన కల్లూరి కదిరిపతిరాజుగారి పౌత్రులైన ఔభవరాజు పుత్రులైన ముద్దురంగపతిరాజు గారు వ్రాయించి యిచ్చిన వరషాశన దాన పత్రిక నృసింహస్వామిజయంతి నిమిత్తం మా తాలూకాగ్రామాదులలో సంవత్సరం ౧కి పౌరోహిత, శెట్టి, వర్తకులు, కాపులు, ఘణాలవారు, యిల్లు ౧కి. సంవత్సరం ౧కి అపరంజి రూక ఆర్ ౧ మెను యిచ్చేటట్లు శలవు యిచ్చినారము గనుక గ్రామ ప్రతి గ్రామం సంవత్సర ప్రతి సంవత్సరం మా పుత్ర పౌత్రపారంపర్యముగా తమ శిష్యపారంపర్యముగా ఆచంద్రార్కస్థాయిగా యీనిషరుష ప్రకారం నడిపించగలవారము. యీ ధర్మానకు యవరు ఆక్షేపన చేసినా కాశీలో

---

*కలియుగ సంవత్సరాలు దేవాలయ శాసనాలలో అరుదుగా కనిపిస్తాయి. అలాంటిది దాన శాసనాలలో మాత్రం వాటిని తరచుగా వాడినారు.

గోబ్రాహ్మణవధ చేసిన పాపాన పోగలవారలు. యిందు సాక్షులు హరిహరాదులు. యిటని మారాజీని మా స్థలకరణం గురుమూర్తి చాత వ్రాయించిన వరషాశన దాన పత్రం. స్వదత్తా ద్విగుణం పుణ్యాం పరదత్తాను పాలనం। పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్॥

**5) దిండిగల్లు జమీన్‌దారు ఆరణి విజయవెంకటపతి రాజాబహదరు వారు వ్రాయించి యిచ్చినది -**

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహనశకవరుషంబులు 1717 (౧౭౧౭) (1795) అగునేటి రాక్షస నామ సంవత్సర అధిక భాద్రపద శుద్ధ 5 సౌమ్యవాసర హస్తానక్షత్రం యిట్టి శుభదివసమందు శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన శ్రీ తరిగొండ నృసింహస్వామి వారి దివ్యశ్రీ పాదారవింద మధుకరాయ మానమానసులైన మాతృశ్రీవెంగమాంబ గారికి దిండిగల్లు జమెద్దారు ఆరణి విజయ వెంకటపతి రాజా బహుదరు వారు వ్రాయించి యిచ్చిన గ్రామ భూదాన ధర్మశాసన పత్రిక మీరు పెట్టె సత్రానకు దినం ౧కి రూపాయలు ౬ లెఖను నెలకు రూపాయలు ౧౮౦ సంవత్సరమునకు ర్పు ౨౧౬౦ యిది గాక తెలసి వనం తాము వుంచినారు గన్కు స్వామికి అర్పించె నిమిత్తం సంవత్సరం ౧కి రూపాయలు ౪౮౦ నిత్యం తధియకు దినం రూపాయవంతున 360 అంతు ఎకంద్రా రూపాయలు ౩౦౦౦ యిదిగాక ఖాసామనో వృత్తి ఖర్చులకు సంవత్సం ౧కి రూపాయలు ౩౦౦౦ వుభయం నాల్గువేల రూపాయలుకు మా తాలూకాలో గ్రామాదులు యిచ్చిన వివరం వడమధుర ౧ చిత్తూరు ౧ వుభయం రెండు గ్రామాదులున్నా మధుర తెల్పు రెండువేల మాడలు యింటికి రూపాయలు నాల్గువేలకు యీ రెండు గ్రామాదులు యీ శుభదినమందు ధారా దత్తముగా విడిచినాము గనుక మీ శిష్యప్రతిశిష్య పారంపర్యాయంగా మా పుత్ర పౌత్ర పారంపర్యాయంగా అచంద్రార్కస్థాయిగా పృధక్కులేకుండా నడిపించగల వారము. యిందు సాక్షులు హరిహరాదులు. వీర్ల సమ్మతిన దిండిగల్లు

జమోద్దారు ఆరణి విజయ వెంకటపతి రాజా బహదరు వారు వ్రాయించి యిచ్చిన ధర్మశాసన పత్రిక నందిమండలం కరణం చుండుపల్లె చిన్నమరాజు వ్రాసినది ॥ స్వదత్తా ద్విగుణం పుణ్యం । పరదత్తానుపాలనం । పరదత్తాపహారేణ । స్వదత్తం నిష్ఫలం భవేత్ । స్వదత్తా పుత్రికా ధాత్రి కాధాత్రి । పితృదత్తా సహోదరీ । అన్యదత్తా స్వయం మాతా । విప్రదత్తా వసుంధరా॥

(Sd) ఆరణి విజయవెంకటపతి రాజాబహదరు చేయివ్రాలు.-

**6) బంగారుపాళెం జమీన్‌దారు చంద్రశేఖరనాయనింవారు వ్రాసి యిచ్చినది-**

స్వస్తిశ్రీ విజయాభ్యుదయశాలివాహన శకాబ్దాః ౧౭౧౭ (1795) కల్యాబ్దాః ౪౮౯౬ మీదనగుననియెడి రాక్షసనామ సంవత్సరం ఆశ్వీజబహుళ ౧౧ యీ శుభదినం శ్రీ తిరుమల యందు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకులైన శ్రీ వెంకటేశ్వరస్వామివారి సాన్నిధ్యమందు శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులయిన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహస్వామివారి దివ్యశ్రీపాదారవింద మధుకరాయమానమానసులైన మాతృశ్రీ వెంగమాంబగారికి శ్రీమన్ నృసింహజయంతి మహోత్సవ అన్నదాన ధర్మమునకు శ్రీమన్ మహానాయకా చార్యులయ్ను బంగారు చంద్రశేఖరనాయనింవారి పౌత్రులయ్ను వెంకటవీరప్పనాయని వారి పుత్రులయిన చంద్రశేఖర నాయని వారు వ్రాయించి యిచ్చిన వరషాశన దాన పత్రిక మాతాలూకా గ్రామాదులలో గామశలవు నగను గగ ౧౨ పండ్రెండు వరహాలు యిచ్చేట్లు శలవుయిచ్చినారము గనుక సంవత్సర ప్రతి సంవత్సరం మా పుత్ర పౌత్రపారంపర్యముగా తమ శిష్యపారంపర్యముగా ఆచంద్రార్కస్థాయిగా యీ నిష్కరుష ప్రకారం నడిపించగల వారము. యీ ధర్మానకు యవరు ఆక్షేపన చేసినా కాశీలో గో బ్రాహ్మణ వధ చేసిన పాపాన పొగలవారు. యిందు సాక్షులు హరిహరాదులు. యిటని

మా రాజీని మా స్థలం మాగంటి వెంకట్రాయని చేత వ్రాయించి యిచ్చిన వరషాశన దాన పత్రం ॥ స్వదత్తా ద్విగుణం పుణ్యం। పరదత్తానుపాలనం। పరదత్తాపహారేణ। స్వదత్తం నిష్ఫలం భవేత్ ॥.

(Sd) చంద్రశేఖరనాయనంవారి చేవ్రాలు -

(నాగరాక్షరములతోయున్నది.)

**7) వెలిగరంధవ కోటి కెమారుడు వెంకటసామి వ్రాసియిచ్చినది -**

స్వస్తిశ్రీ విజయాభ్యుదయశాలివాహన శతాబ్దాః ౧౭౨౮ (1806) కల్యాబ్దాః ౪౯౦౭ అగునేటి చాంద్రమాన అక్షయనామ సంవత్సర వైశాఖబహుళ ౫ సౌమ్యవాసరం యీశుభదినము శ్రీ తిరుమల తిరుపతి యందు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులైన శ్రీవేంకటేశ్వరసామి వారి సాన్నిధ్యమందున్న శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహస్వామి వారి దివ్యశ్రీ పాదారవింద మధుకరాయ మానమానసులైన వెంగమాంబగారికి కాళికాంబా వరప్రసాదకులైన వెలిగరంధవ కోటి కెమారుడు వెంకటసామి వ్రాయించియిచ్చిన ధర్మశాసన దానపత్రిక క్రమమెట్లన్నను నేటి దినము మొదలుకొని తమ మఠానకు శ్రీనృసింహస్వామివారికి సంవత్సరం ౧కి పూలగగ ౧ వరహా చెప్పున సంవత్సర ప్రతి సంవత్సరం తమ శిష్యప్రతి శిష్యపారంపర్యముగా మాపుత్ర పౌత్ర పారంపర్యముగా ఆచంద్రార్కస్థాయిగా యిచ్చి నడిపించక రాగల వారము. యిందుక్కు సాక్షులు హరిహరాదులు. గాజుల బసివిరెడ్డి బుశివిరెడ్డి చవిడిరెడ్డి వీరల సమ్మతని నా రాజీని నరసప్ప వ్రాసిన ధర్మశాసన దానపత్రిక॥ స్వదత్తా ద్విగుణం పుణ్యం। పరదత్తాను పాలనం। పరదత్తాపహారేణ। స్వదత్తం నిష్ఫలం భవేత్।

(Sd) వెంకటస్వామి చెయివ్రాలు

**8) అయ్యవారిపల్లెలో వున్న వర్తకులు వ్రాసియిచ్చిన దానపత్రం -**

శ్రీమ స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకాబ్దాః ౧౭౧౮ (1796) కల్యాబ్దాః ౪౮౯౭ అగునేటి చాంద్రమాన నళ నామ సంవత్సర చైత్రబహుళ ౭ శుక్రవారం శుభ దినం శ్రీ తిరుమల తిరుపతి యందు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకులైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి సాన్నిధ్యమున శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహస్వామి దివ్యశ్రీపాదారవింద మధుకరాయ మానమానసులైన మాతృశ్రీ వెంగమాంబగారికి శ్రీమన్నృసింహోత్సవ అన్నదాన ధర్మమునకు స్వస్తి సమస్త ఆది ప్రశస్త సకల గుణసంపన్న పెనుగొండ పురవరాధీశ్వర శ్రీనగరేశ్వర జనార్ధనులై భాస్కరాచార్య ఆశీర్వాదబలప్రసిద్ధులైన శ్రీవెంకటాచల పశ్చిమ దిగ్భాగమందు వొప్పుచున్నటువంటి అనగా పీలేరు తాలూకు అయ్యవారిపల్లె గ్రామంలో వున్నట్టి మొదలైన నూటయిబ్బంద్రు నగరం వారు అయితా గుర్వప్ప, మేడారామన్న, అయితా బోయనగారి చల్మయ్య, తాళ్లపాకం చల్మయ్య, సోమిశెట్టి చల్మయ్య, మంచిబేరం నారాయణప్ప, మేడా వెంగన్న, అమతాసిద్దప్ప, ముల్లంగినరుసు, అంబటిలింగయ్య, పచ్చిపులుసు గుర్వప్ప, పున్నకంటి వెంకటేశం, అమరాలింగప్ప, రేపూరి శిద్దప్ప, బండారు వెంకట్రాయుడు, గ్రంధి నారాయణప్ప, అయితా గురప్ప, బాలిశెట్టి చన్నప్ప, జయం పట్టాభి, రేపూరి ఆదికేసు శిద్దయ్య వీరు మొదలైనవారు యేకస్థులై వ్రాయించి యిచ్చిన ధర్మశాసన దానపత్రిక క్రమమెట్లన్నను మాతాలూకు పేరుబడియిల్లు ౧కి సంవత్సరం లెఖను మాయధాశక్తి అపరం జర్మా ౧ లెఖను ప్రతిసంవత్సరమున్నూ తమ శిష్య పారంపర్యముగా, మా పుత్రపౌత్ర పారంపర్యముగా ఆచంద్రార్కస్థాయిగా నడిపించగలవారము. యీ ధర్మమునకు యవరైనను అక్షేపన చేసినా కాశీ గోబ్రాహ్మణ వధ చేసిన పాపాన పోగలవారు. యిందు సాక్షులు హరిహరాదులు. యిటని మా

రాజీ రేపూరి రామన్న వ్రాసిన ధర్మశాసనదాన పత్రం యిందుకు ప్రమాణం॥ స్వదత్తా ద్విగుణం పుణ్యం। పరదత్తానుపాలనం। పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్ ॥ స్వదత్తాం పరదత్తాం వా। యో హరేత్యవసుంధరా షష్టి వర్ష సహస్రాణి ॥ పిష్టాయాం జాయతే క్రిమిః ॥ మద్వంశజాః పరమహపతి వంశ జాణయే భూమిపాః। సతతముజ్వల ధర్మబిత్తాః మద్ధర్మమేవ పరిపాలయ మాచరంతి తత్పాదుకద్వయ మహం శిరసాం వహామి ॥

(Sd) మేడా రామయ్య చ్రైవ్రాలు

(Sd) చలమన్న చ్రైవ్రాలు

(Sd) తాళ్లపాకం చలమన్న చ్రైవ్రాలు

(Sd) బండారు వెంగన్న చ్రైవ్రాలు

(Sd) రేపూరి శిద్దప్ప చ్రైవ్రాలు

(Sd) బాలిశెట్టి చెన్నప్ప చ్రైవ్రాలు

(Sd) మంచిబేరం నారాయణప్ప చ్రైవ్రాలు

(Sd) బండారు వెంకట్రాయుడు చ్రైవ్రాలు

**9) పెనుమూరు పేటస్తళం వర్తకులు వ్రాసియిచ్చిన దాన పత్రం -**

శ్రీమ స్వస్తిశ్రీవిజయాభ్యుదయ శాలివాహనశతాబ్దాః ౧౭౧౮ (1796) కల్యాబ్దాః ౪౮౯౭ మిొదనగునని యెడి చాంద్రమానేన కాళయుత్తినామ సంవత్సర చైత్రబ ౧౩ యీ శుభదినమందు శ్రీమదఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకులైన శ్రీ వేంకటేశ్వర స్వామి సాన్నిధ్యమందున శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహ స్వామివారి దివ్యశ్రీపాదారవింద మధుకరాయమానమానసులైన మాతృశ్రీ వెంగమాంబగారికి శ్రీనృసింహజయంతి మహోత్సవమునకు పెనమూరు పేట స్తళం స్వస్తి సమస్త ఆదిప్రశస్త సకల గుణ సంపన్న పెనుగొండ

పురాధీశ్వర కుబేరాంశ వర్ధనులైన కన్యకాసహూదరులై భాస్కరాచార్య ఆశీర్వాద వరప్రసిద్ధులై శ్రీనగరేశ్వర జనార్ధన దేవర దివ్యశ్రీ పాద పద్మారాధికులైన నూటయిబ్బంద్రు నగరం వారు పాలచల శిద్దప్పశెట్టి, చల్లగుండ్ల గుర్వప్పశెట్టి, వత్తులూరి వరదప్పశెట్టి, కంభంపాటి వెంకట్రామయ్య, శాలర్ అయ్యప్పశెట్టి, మన్నారు ముద్దురామిశెట్టి, సాతులూరి వెంకటాచలం, రాచపల్లి వెంకటప్ప, నూతి వెంకటాచలం, భోగనాథం పాపయ్య, మొదళ్లపల్లి గురప్ప, ఉద్దగిరి రంగప్ప, అన్నం గురప్ప, గుంటి సుబ్బరాయుడు, తిరువీధి ముత్యాలు శెట్టి, బయ్యాపుల్లయ్య వీరు మొదలైన స్థితా నూట యిబ్బంద్రు నగరం వారు వ్రాయించి యిచ్చిన వరషాశన దాన పత్రిక క్రమమెట్లన్నను మనపేటలో పేరుబడియిల్లు వకటింటికి సంవత్సరం వకటింటికి శంఖుల్ 1లెఖను అక్షరాలా రూకలెఖను సంవత్సర ప్రతి సంవత్సరమున్నూ తమ శిష్యపారం పర్యముగా మా పుత్రపౌత్రిపారంపర్యముగా, మీరు వచ్చిన సంవత్సరం యిచ్చి నడిపించుక రాగలవారము. యీ ధర్మానకు యవరు ఆక్షేపణ చేసి నిలిపినా కాశీలో గోబ్రాహ్మణవధ చేసిన పాపాన పోగలవారు. యిందుక్కు సాక్షులు హరిహరాదులు. వీర్ల సమ్మతిన గాడిపల్లి చంగం భట్లు వ్రాసిన దానపత్రిక శ్లో॥ స్వదత్తా ద్విగుణం పుణ్యం ।పరదత్తానుపాలనం । పరదత్తాపహారేణ । స్వదత్తం నిష్ఫలం భవేత్ । దానపాలనయోర్మధ్యే । దానాచ్ఛ్రేయోనుపాలనం । దానాత్ స్వర్గమవాప్నోతి। పాలనా దచ్యుతం పదమ్॥ స్వదత్తా పుత్రికా ధాత్రి । పితృదత్తా సహోదరి। అన్యదత్తా భవేన్మాతా। దత్తా ధాత్రి పరిత్యజా॥

(Sd)

(Sd) శాల్లర్ వెంగన్న చెయివ్రాలు

(Sd) కంభంపాటి వెంకట్రాముడి చెవ్రాలు

(Sd) గుంటి సుబ్బరాయలు చేవిరాలు

(Sd) రాచపల్లె వెంకటప్ప చెయివ్రాలు

(Sd) వత్తులూరి వరదప్పచెవ్రాలు

(Sd) చల్లగుండ్ల గురప్ప చెవ్రాలు

(Sd) కెళ్లు బాలయ్య చెయివ్రాలు

(Sd) పచ్చిపులుసు రమణప్ప చెవ్రాలు

(Sd) చల్లూరి దొడ్డయ్య చెవ్రాలు

(Sd) తెర్వీధి ముత్యాలు చెయివ్రాలు

(Sd) నామముసల్య చెయ్యివ్రాలు

(Sd) మన్నూరుముద్దు రామన్న చెవ్రాలు

(Sd) భోగనాధం పాపయ్య చిఇవ్రాలు

(Sd) అన్యం గురప్ప చెయివ్రాలు

(Sd) శాలర్ అప్పయ్యశెట్టి చెవ్రాలు

**10) చిత్తూరి దేశం రెడ్లు వ్రాసి యిచ్చిన దాన పత్రం -**

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకాబ్దా ః 1717 (1795) కల్యాబ్దా ః 4896 అగుననియెడి చాంద్రమాన రాక్షసనామ సంవత్సర భాద్రపద శుద్ధ 10 లు యీ శుభదినం శ్రీతిరుమల యందు శ్రీమదఖిలాండ కోటి బ్రహ్మాండనాయకులైన శ్రీ వెంకటేశ్వరస్వామివారి సాన్నిధ్యమందున శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులయిన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహ స్వామి దివ్యశ్రీపాదారవింద మధుకరాయ మానమానసులైన, మాతృశ్రీ వెంగమాంబ గారికి శ్రీమన్నృసింహజయంతి మహోత్సవ అన్నదాన ధర్మమునకు చిత్తూరు శేమా మూలం పూతలపట్టు చిర్రెడ్డి, పెయనరెడ్డి, బుచ్చిరెడ్డి, అబ్బారెడ్డి, కొత్తకోట వెంగారెడ్డి, వెంకటరెడ్డి, శలవుకుంట ముక్కంటిరెడ్డి, పాలనూరు కృష్ణారెడ్డి, పాపిరెడ్డి, వెంకట్రెడ్డి, ముదిగళం రామిరెడ్డి, చంగళ్వరెడ్డి, చిన్న చంగల్వరెడ్డి, వెంకట్రెడ్డి, కాణిపాక పెయనరెడ్డి,

పలుభిమిరెడ్డి, పెద్ద చంగల్వరెడ్డి, చిన చంగల్వరెడ్డి, గోపాలరెడ్డి, నారాయణ రెడ్డి వీరు ఏకస్తులై వ్రాయించి యిచ్చిన వరషాశన ధర్మశాసన దాన పత్రక్రమం పూతలపట్టు 552 కొత్త కోట 551 కల్వకుంట 551 ముదిగళం 551 కాణిపాక 551 యీ ప్రకారం మేము గ్రామ ప్రతిగ్రామాదులలో నిర్నయం పరచినాము గనుక సంవత్సర ప్రతి సంవత్సరం తమ శిష్యపారంపర్యముగా మా పుత్ర పౌత్ర పారంపర్యముగా నిష్కరుష ప్రకారం చెల్లిస్తూ రాగలవారం. యీ ధర్మానకు యవరు ఆక్షేపన చేసినా కాశీలో గోబ్రాహ్మణవధ చేసిన పాపాన పోదురు. యిందుక్కు సాక్షులు హరిహరాదులు. యిటని మారాజీనా కొత్తకోట వెంగ్గారెడ్డి వ్రాసిన దాన పత్రం ॥ స్వదత్తా ద్విగుణం పుణ్యం । పరదత్తాను పాలనం । పరదత్తాపహారేణ । స్వదత్తం నిష్ఫలం భవేత్ ॥

(Sd) చిన్రెడ్డి పెయనరెడ్డి బుచ్చిరెడ్డి అచ్చిరెడ్డి చేయివ్రాలు

(Sd) కొత్తకోట వెంగారెడ్డి వెంకట్రెడ్డి చేవ్రాలు

(Sd) కలవుకుంట ముక్కంటిరెడ్డి చెవ్రాలు

(Sd) పాలనూరి కృష్ణారెడ్డి పాపిరెడ్డి వెంకటరెడ్డి చెవ్రాలు

(Sd) పల్లుభీమిరెడ్డి, పెదచెంగర్రెడ్డి, చిన్నచంగరెడ్డి, గోపాలరెడ్డి, నారాయణరెడ్డి చెవ్రాలు

(Sd) ముదిగుళం రామిరెడ్డి చంగర్రెడ్డి, వెంకట్రెడ్డి, చిన్న చెంగల్వరెడ్డి చెవ్రాలు

**11) గోలకొండలో చేరిన పుట్లచెర్వులో తాలూకాలో మల్లంపేట వారు వ్రాసియిచ్చిన దానపత్రం -**

శ్రీమస్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహశకాబ్దా ః 1728 (1806) అగునేటి చాంద్రమాన అక్షయనామ సంవత్సర భాద్రపద శుద్ధ 15 శు భదినం శ్రీతిరుమల తిరుపతి యందు శ్రీమదఖిలాండకోటి

బ్రహ్మాండనాయకులైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి సాన్నిధ్యమందున శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహ స్వామి దివ్యశ్రీపాదారవింద మధుకరాయ మానమానసులైన మాతృశ్రీ వెంగమాంబ గారి మఠానకు సకలజననయన మనోహర సకల దురితనివారణ నిపుణ సకల శోభనకారణ తదియ్యనియత వైశాఖమాస శ్రీలక్ష్మీనృసింహ జయంత్యోత్సవ అన్నదాన ధర్మమునకు శ్రీనగరేశ్వరజనార్ధన స్వామి దివ్యశ్రీపాదపద్మారాధికులైన కన్యకాసహోదరులైన భాస్కరాచార్య ఆశీర్వాదబలప్రసిద్ధులైన గోలకొండలో చేరిన పుట్లచెర్వు తాలూకాలో చేరిన మల్లంపేట గ్రామంలో వుండే నూట యిబ్బంద్రు నగరం వారమైన వుపలంచ భోజ కుమారుడు చుక్కయ్య పౌత్రుడు పాపిశెట్టి వ్రాయించి యిచ్చిన వరషాశన ధర్మశాసన దానపత్రిక క్రమమెట్లనన్నను మాయిల్లు 13 సంవత్సరం 1కి కుంఫిణి పది రూపాయల చెప్పున సంవత్సర ప్రతి సంవత్సరమున్నూ తమ శిష్యపారంపర్యముగా మాపుత్రపౌత్ర పారం పర్యముగాను ఆచంద్రార్కస్థాయిగాను మేమే యిచ్చి నడిపించుకరాగల వారము. యీ ధర్మమునకు యెవరు ఆక్షేపణజేసి నిలిపినా పంచమహాపాతక కోప పాతకములు జేసిన పాపాన పోగలవారు. యిందుకు సాక్షులు హరిహరాదులు. యిటని మారాజీని త్రికరణ శుద్ధిగా చెంన్నప్ప చాత వ్రాయించి నేను చేవ్రాలు చేసి సమర్పించిన వరుషాశన ధర్మశాసన దాన పత్రం ॥ యిందుకు ప్రమాణ శ్లోకము ॥ స్వదత్తా ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనం। పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్ ॥ స్వదత్తాం పరదత్తాం వా। యో హరేత్య వసుంధరా। షష్టివర్ష సహస్రాణి। పిష్ఠాయాం జాయతే క్రమః ॥ మద్వంశజాః పరమహీపతివంశజాః / యే భూమిపాః సతతముజ్వల ధర్మ చిత్తాపి మద్ధర్మమేవ పరిపాలన మాచరంతి / తత్పాదుక ద్వయమహం శిరసా నమామి.

(Sd) వుపలంచ పాపయ్యవ్రాలు

**12) పెదకొండ్డుపల్లె బసివిరెడ్డి వ్రాసియిచ్చిన దాన పత్రము -**

శుభమస్తు ॥ స్వస్తిశ్రీవిజయాభ్యుదయశాలివాహన శకాబ్దాః ౧౭౨౫/ (1803) కల్యాబ్దాః ౪౯౦౪ ప్రభవాది గతాబ్దాః ౫౭ అగునేటి చాంద్ర మాన రుధిరోద్గారి నామ సంవత్సర ఆశ్వీజ బహుళ ౭ శుక్రవారం యీ శుభదినమందు శ్రీతిరుమల తిరుపతి యందు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులైన శ్రీవెంకటేశ్వరస్వామివారి సాన్నిధ్యమందున శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహస్వామివారి దివ్యశ్రీ పాదారవింద మధుకరాయ మానమానసులైన వెంగమాంబగారికి కార్వేటినగరం తాలూకాలో తయ్యూరు పాయకట్టులో పెదకొండుపల్లెలో వుండే ఆరుట్ల గోత్రకులైన పెడకంటి రాజుల బసివిరెడ్డి పౌత్రుడైన నాగిరెడ్డి పుత్రుడైన బసివిరెడ్డి వ్రాయించి యిచ్చిన ధర్మశాసన దానపత్ర క్రమం యట్లన్నను. నేటి దినం మొదలుకొని తమ మఠానకు శ్రీనృసింహస్వామివారికి సంవత్సరం 1కి పూలగాగ 1 వరహ చొప్పున సంవత్సర ప్రతి సంవత్సరం తమ శిష్య పారంపర్యముగా మాపుత్ర పౌత్రపారంపర్యముగా ఆచంద్రార్కస్థాయిగా యిచ్చి నడిపించుక రాగలవారము. యిందు్కు సాక్షులు హరిహరాదులు. యిటని నారాజీని నా పెద్దయ కొమారుడు మల్రెడ్డి చాత వ్రాయించి యిచ్చిన ధర్మశాసన దాన పత్రిక॥ స్వదత్తా ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనం । పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్ ॥

(Sd) (బసివిరెడ్డి చైవ్రాలు)

**13) నందనూరి గ్రామం రెడ్లు వ్రాసి యిచ్చిన దాన పత్రం -**

స్వస్తిశ్రీవిజయాభ్యుదయ శాలివాహన శకాబ్దాః ౧౭౨౨ (1800) అగుననువంటి చాంద్రమాన రవుద్రినామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ 13 బృహస్పతి వారం శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహస్వామి దివ్యశ్రీపాదారవింద మధుకరాయ మానమానసులైన

మాతృశ్రీ వెంగమాంబగారి నందనూరి చిర్‌రెడ్డి, నారాయణరెడ్డి, గోవిందరెడ్డి, ముత్తిరెడ్డి, రామిరెడ్డి వీరలందరు ఏకస్థులై మాది వ్రాయించి యిచ్చిన దానవరుషా చలదాన పత్రిక క్రమమెట్లన్నను మా గ్రామానకు సంవత్సరం 1కి గాగ 1 వ్రాయించి యిచ్చినాము గనుక సంవత్సరం ప్రతి సంవత్సరం మాపుత్రపౌత్ర పారంపర్యంగాను తమశిష్య పారంపర్యముగాను యిచ్చి నడిపించగలవారము. యిటని మారాజీని వ్రాసియిచ్చిన దాన పత్రము. గ్రామకరణం ముత్తప్ప వ్రాసిన వరుషాశన దానపత్రం -

చిన్‌రెడ్డి, నారాయణరెడ్డి, గోవిందరెడ్డి, ముత్తిరెడ్డి, రామిరెడ్డి చెయివ్రాలు.

**14)** వెంకటరెడ్డి వ్రాయించి యిచ్చిన దాన పత్రము -

స్వస్తిశ్రీవిజయాభ్యుదయ శాలివాహన గతాశకాబ్దా : 1725 (1803) కల్యాబ్దాః 4905 ప్రభవాది కల్యాబ్దాః 57అగుననియెడి రుద్రద్గారి సంవత్సరమున 15 యీ శుభదినమందు శ్రీమదఖండ... మాతృశ్రీ వెంగమాంబగారి మఠానకు అచ్యుత గోత్రోద్భవుడైన మాదిరెడ్డి పల్లె మాదిరెడ్డి పౌత్రుడైన పాపరెడ్డి పుత్రుడైన వెంకటరెడ్డి తాను వ్రాయించి యిచ్చిన దాన పత్రక్రమమెట్లన్నను యీ వూరికి పశ్చిమం నైరుతి భాగమందు వుండే మాదిరెడ్డిపల్లె చెరువు క్రింద మాదశ బింధం నుడి టెంకాయ తోటలో తూర్పుభాగమందు వున్నవి రెండు చెట్లు శ్రీనృసింహార్పితముగా తమ మఠానకు సహిరణ్యోదక దాన ధారాపూర్వకముగా సమర్పించినాను గనుక యీ రెండు చెట్ల మహసూలున్నూ తమమఠంలో శ్రీనృసింహస్వామిజయంతి వుత్సవమునకు సంవత్సర ప్రతి సంవత్సరం తమ శిష్యప్రతిశిష్య మా పుత్రపౌత్రపారంపర్యముగా ఆచంద్రార్కస్థాయిగా తిరుమలమఠం యిస్తూ రాగలవారము ॥ శ్లోకములు ॥ వెంకట్రెడ్డి చైవ్రాలు : గ్రామకరణం గురునాథపిల్లె కోట వెంకటచలం వ్రాసినది -

**15) కుంచారపులచ్చయ్య వ్రాసియిచ్చిన దానపత్రం వరుషాశనం**

శ్రీమస్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకాబ్దాః 1722 (1800) అగునని యెడి చాంద్రమానప్రజోత్పత్తినామసంవత్సర ఫాల్గుణ బహుళ ౧౦ భానువారం యీ శుభదినమందు శ్రీ తిరుమల తిరుపతి యందు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకులైన శ్రీ వెంకటేశ్వర స్వామివారి సాన్నిధ్యమందున శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన మాతృశ్రీ వెంగమాంబగారికి శ్రీనగరేశ్వరజనార్ధనస్వామి దివ్యశ్రీపాద పద్మారాధికులైన కన్యకాసహోదరులైన మాతృశ్రీవెంగమాంబగారికి కుబేరాంశ వర్ధనులైన భాస్కరాచార్య ఆశీర్వాదప్రసిద్ధులైన నూటయిబ్బంద్రు నగరంవారు గోలకెండలో యుండే కుంచారపు లచ్చయ్య, చంగయ్య, బాలయ్య వీరు మొదలైనవారు ముగ్గురు ఏకస్తులై వ్రాయించి యిచ్చిన వరుషాశన ధర్మశాసన దాన పత్రిక క్రమమెట్లన్నను శ్రీ వెంకటేశ్వర స్వామివారికి నిత్యం తులసిదళం కైంకర్యము నిమిత్తము సంవత్సరం 1కి కుంఫిణి 24 యిరవై నాలుగుర్పాయలు లెఖను, సంవత్సర ప్రతి సంవత్సరమున్నూ, మీ శిష్యపారంపర్యముగా, మా పుత్రపౌత్ర పారంపర్యముగాను ఆచంద్రార్కస్థాయిగాను, మేమే యిచ్చి నడిపించుక రాగలవారము. యిందుకు సాక్షులు హరిహరాదులు. యిటని మారాజీని త్రికరణ సిద్ధిగా యింజేటి నరసప్ప చాత వ్రాయించియిచ్చిన ధర్మశాసన దానపత్రిక - స్వదత్తా ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనం। పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్ ॥

(Sd) కుంచారపు లచ్చయ్యవ్రాలు. -

**16) శ్రీనృసింహాయ నమః అవుకుతాలూకులో నిట్టూరుపరగణాలో బ్రాహ్మణపల్లె పాపిరెడ్డి వ్రాసియిచ్చినది -**

శ్రీమస్వస్తిశ్రీ విజయాభ్యుదయశాలివాహనశకాబ్దాః 1721 (1799) కల్యాబ్దాః ౪౯౦౦ అగు నేటి చాంద్రమానశిద్దార్ధి నామసంవత్సరమార్గశిర బహుళ ౫లు యీ శుభదినమందు తిరుమల తిరుపతి యందు

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకులైన శ్రీవెంకటేశ్వరస్వామి సాన్నిధ్యమున శ్రీతరిగెండ లక్ష్మీనృసింహస్వామివారి దివ్యశ్రీపాదారవింద మధుకరాయ మానమానసులైన మాతృశ్రీ వెంగమాంబగారి మఠానకు శ్రీనృసింహజయంతి మహెూత్సవ అన్నదాన ధర్మమునకు తిరుమలకు పశ్చిమోత్తర దిగ్భాగమున అవుకు తాలూకాలో చేరిన నిట్టూరు పరగణాలో చేరిన బ్రాహ్మణపల్లె వెంకటరెడ్డి పుత్రుడైన పాపిరెడ్డి వ్రాయించి యిచ్చిన ధర్మపత్రిక క్రమమెట్లన్నను మా పేరుబడి శేద్యములో మాకు వచ్చిన ధాన్యములో సరకారుగుత్త 1 పోగా నిలిచిన ధాన్యములో ఎనిమిదిపాళ్లలో వకపాలు శ్రీనృసింహజయంత్యోత్సవానకు సంవత్సర ప్రతి సంవత్సరమున్నూ తమమతానకు యిచ్చెదమని సహిరణ్యోదక దానధారాపూర్వకముగా వ్రాసి యిచ్చినాము గనుక తమ శిష్యపారంపర్యముగా మాపుత్రపౌత్రపారంపర్యముగా ఆచంద్రార్కస్థాయిగా యిచ్చి నడిపించుకరాగలవారము. యిందుక్కు సాక్షులు హరిహరాదులు. యిటని నారాజీనా నా పుత్రుడైన వెంకట్రాముడు వ్రాసిన ధర్మశాసన దానపత్రిక ॥సహ॥ స్వదత్తా ద్విగుణం పుణ్యం । పరదత్తానుపాలనం । పరదత్తా పహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్ ॥ మద్వంశజాః పరమహీపతివంశజాః। యె భూమిపాః సతత ముజ్వల ధర్మచిత్తాః । మధర్మమేవ పరిపాలనమాచరంతి। తత్పాదుక ద్వయ మహం సిరసా వహామి। మా తండ్రిపాపిరెడ్డి అనుమతిని వెంకట్రామరెడ్డి చైవాలు తిరుమలరెడ్డి ఘంటం ముట్టిన సాజ్ఞ.

**17) చిత్తూరు తాలూకా వావిలితోటరెడ్లు వ్రాయించియిచ్చిన దానపత్రము-**

స్వస్తిశ్రీ విజయాభ్యుదయశాలివాహన శకాబ్దాః 1720 (1798) కల్యాబ్దాః ౪౮౯౯ మీద దగు నేటి చాంద్రమాన కాలయుక్తినామసంవత్సర శ్రావణశుద్ధ సౌమ్యవాసర యీ శుభదినమందు తిరుమల తిరుపతి యందు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకులైన శ్రీవెంకటేశ్వస్వామివారి సాన్నిధ్యమందున శ్రీమదఖండసచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన శ్రీతరిగొండ

లక్ష్మీనృసింహస్వామి దివ్య శ్రీపాదారవింద మధుకరాయమానమానసులైన మాతృశ్రీ వెంగమాంబగారి మఠానకు, శ్రీమన్నృసింహోత్సవమునకు చిత్తూరి తాలూకా... పెద్దిరెడ్డిక్రిష్టారెడ్డి వెంకటరెడ్డి నాచమరెడ్డి మునిరెడ్డి కరణం చిత్తంబ్బువీరు మొదలైన రెడ్లు కరణాలు వ్రాయించిన ధర్మశాసన దానపత్రిక క్రమమెట్లన్నను... తిరుపతులు గగ 2 వరహాలు లెఖను సంవత్సర ప్రతిసంవత్సరమున్న్వా, తమశిష్యపారంపర్యముగా మాపుత్రపౌత్రపారం పర్యముగా ఆచంద్రార్కస్థాయిగా యిచ్చినడిపించుక రాగలవారం. యిందుక్కు సాక్షులు హరిహరాదులు. యిటని మారాజీనా గ్రామకరణము అబ్బువ్రాసిన ధర్మశాసన దానపత్రం ॥ స్వదత్తా ద్విగుణం...నిష్ఫలం భవేత్ ॥ స్వదత్తాం పరదత్తాంవా...జాయతే క్రిమిః మద్వంశజాః ...రసాం వహామి ।------

(Sd) నారంబంమ్మరెడ్డి అ॥మునిరెడ్డిపెద్దిరెడ్డి. వెంకట్రెడ్డి క్రిష్టారెడ్డి చేవ్రాలు---

18) చంద్రగిరి హుశెనిపేట స్వస్తిశ్రీవిజయాభ్యుదయం శాలివాహనశకాబ్దాః ౧౭౧౮ (1796) కల్యాబ్దాః ౪౮౯౭అగు నేటి చాంద్రమాన నళనామ సంవత్సరచైత్రశుద్ధ ౧౦ యీశుభదినం తిరుమల, తిరుపతి యందు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకులైన శ్రీవెంకటేశ్వరస్వామివారి సాన్నిధ్యమందున శ్రీమదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహస్వామి దివ్యశ్రీపాదారవింద మధుకరాయ మానమానసులైన మాతృశ్రీ వెంగమాంబ గారికి శ్రీమన్నృసింహోత్సవ అన్నదానధర్మమునకు, చంద్రగిరి రాయ... పేటస్థళమందు వున్న రాచప్పశెట్టి లింగిశెట్టి కేశవశెట్టి మొదలైన చతుర్దిక్కుయాభై ఆరుదేశం వారున్న్వా, సముద్రాల చలంశెట్టి సర్విశెట్టి, చిట్టియశెట్టి... గప్పశెట్టిమొదలైన నూట యిబ్బంద్రు నగరం వారున్న్వా పలిపేటద సహా వ్రాయించి యిచ్చిన ధర్మశాసన దానపత్రికక్రమ మెట్లన్నను. మా తాలూకు పేరు బదియిల్లు 1కి సంవత్సరం 1కి అపరంజిల్ 1రూక

లెఖను సంవత్సర ప్రతి సంవత్సరం తమ శిష్యపారంపర్యమునూ పుత్రపారంపర్యముగా ఆచంద్రార్కస్థాయిగా, మేమే జమచేసియిచ్చి... యీ ధర్మానకు యవరైనా ఆక్షేపణ చేసి నిలిపినట్టు అయితే, కాశీలో గోబ్రాహ్మణ వధశేసిన పాపానపోగలవారు. యిందుక్కు సాక్షులు హరిహరాదులు. యిట... శేనిపేటస్తళం కరణం తంబుప్పిళ్ల అనుమతిని రమణయ్య వ్రాసిన ధర్మశాసనదానపత్రం శ్లో॥ స్వదత్తా ద్విగుణం । నిష్ఫలం భవేత్ ॥

(Sd) రాచంశెట్టి చేవ్రాలు

(Sd) లింగిశెట్టి చేవ్రాలు

(Sd) కేశవశెట్టి చేవ్రాలు

(Sd) సముద్రాల చలంశెట్టి చేవ్రాలు

(Sd) సరివిశెట్టి చిట్టంశెట్టి చేవ్రాలు

(Sd) వేముల పాపిశెట్టి చెయివ్రాలు

(Sd) దరిశ రాఘవశెట్టి చేవ్రాలు

(Sd) స్తళకరణం తంబుపిళ్ల చేవ్రాలు

(Sd) జొన్నగడ్ల... అప్పయ్య చేవ్రాలు

యింకను 7 లేక 8 చేవ్రాలు సరిగా చేయనందున తెలియలేదు.

**19) భూదానము - శేతువరాయపిళ్ల వ్రాయించియిచ్చిన దాన పత్రం -**

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకాబ్దాః 1707 (1707) (1785) కల్యాబ్దాః ౪౮౮౬ ప్రభవాదిగతాబ్దాః ౩౮ అగునేటి చాంద్రమాన విశ్వావసు నామసంత్సర చైత్రశుద్ధ ౩ బానువాసర అశ్విని నక్షత్రం యీ శుభదినమందు శ్రీమదఖండసచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకులైన శ్రీశేషాచలనివాసులైన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహస్వామి దివ్యశ్రీపాదారవింద మధుకరాయ

మానమానసులైన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబగారికి చంద్రగిరి తాలూకా, స్తళకరణం పాపయ్యపిళ్ల పౌత్రులయిన నరసయపిళ్ల పుత్రులయిన శేతువరాయపిళ్ల వ్రాయించి యిచ్చిన భూదాన ధర్మశాసనపత్రిక క్రమమెట్లన్నను తెండమండలం తిరువళ యాట్టం వుళ్ మండలం శేషాచల పర్వతానకు దక్షిణం అగస్త్యమహరుషివాసమైన చంద్రగిరి దుర్గానకు పశ్చిమం అయితేపల్లెకు తూర్పు వృషభపర్వతానకు వుత్తరం యీ మధ్యవున్న అగరం గ్రామంలో మా కరణీక స్వతంత్ర మాన్యలో నలబై ఎనిమిది అడుగుల కెలను నీరారంభం అచ్చుకట్టున గుంటలు 50 యాభైగుంటలున్నూ శ్రీ లక్ష్మీనృసింహార్పితముగా యిచ్చినాము గనుక యీ మాన్యం తమశిష్యపారంపర్యంతమున్నూ, ఆచంద్రార్కస్థాయిగా, దాన క్రయ విక్రయంబులకు యోగ్యమవునట్లుగా మీరే అనుభవించగలవారు. మా పుత్రపౌత్రపారంపర్యంతమున్నూ ఆచంద్రార్కస్థాయిగా నడిపించగలవారము యిందుకు యెమి ఆక్షేపణ ఆటంకాలు లేవు. కలిగినట్లు అయితే, మేము ముందు నిలిచి, తీర్చుకొగలవారము. యిటని హరిహరాదుల సాక్షిగా అగరాల తెగురు శేషయ మాముదూరు నూలిపాపయ వీర్ల సంమ్మతిని నారాజీన నా పుత్రుడయిన కృష్ణరాయలు వ్రాసిన భూదాన ధర్మశాసన పత్రిక। యిందుకు ప్రమాణం దానపాలనయోర్మధ్యే దా నాచ్ఛ్రేయస్య పాలనం। దానాస్స్వర్గమానాప్నోతి పాలనాదచ్యుతం పదమ్। స్వదత్తా ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనం। పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్ ॥ అని ప్రమాణం వున్నది గనుక తెలిసి నడిపించవలసినది.

(Sd) స్తళకరణం శేత్వురాయని స్వహస్తం చేవ్రాలు

**20) భూదానము : రాజశ్రీవెంకటప్పనాయని వారు వ్రాసియిచ్చినది -**

